# ఆంధ్రభూమి

సర్వవిషయములను చర్చించు
సచిత్రాంధ్రమాసపత్రిక.

స్థాపిత సం ౧౯౩౩.
సాలుచందా 1-8-0.
సంపాదకుడు :
ఆండ్ర శేషగిరిరావు, బి. ఏ.

సంపుటము : ౪. యువ, మార్గశిరము : డిసెంబరు, 1935. సంచిక : ౧.


## సంపాదకీయ సమాలోచన

**౧. వీరేశలింగ వీరుని శిలావిగ్రహ ప్రతిష్ఠాపనము:—**

ఈపంక్తులు వ్రాయబడు ఈనాటికి(డిసెంబరు ౧-వ తేదీ ఆదివారము)సరిగా వారము దినములకుక్రితము (నవంబరు ౨౪-వ తేదీ ఆదివారము) పావనగౌతమీతీరమున రాజమహేంద్రవరమున రాజవీధియందు ఇన్నీసుపేటలోని చతుష్పథమున శ్రీవీరేశలింగ వీరుని శిలావిగ్రహప్రతిష్ఠాపనము జరిగినది. వీరేశలింగము ఆంధ్రదేశమునకు ఆధునిక యుగప్రవర్తక. అతడు ప్రతిబంధములను వింధ్యపర్వతపంక్తుల నెన్నిటినో దాటిన అగస్త్యుడు. ప్రాతసృష్టిని పోనాడచేసి ప్రజలను క్రొత్తసృష్టిలో జొనిపిన విశ్వామిత్రుడు. మూకలు కట్టుకొని ఎప్పటికప్పుడు వచ్చిపడుచుండిన అడ్డంకుల నతిక్రమింపజాలిన ధైర్యము—ఆ ధైర్యమునకు తగిన కార్యదీక్ష—ఆ కార్యశౌర్యమునకు ఉచితోపయోగ్యవృత్తిని కల్గించిన మొక్కవోని దేశహితకాంక్ష అతనిని వీరునిగాచేసిన గుణములు. ఆంధ్రునిసంఘజీవనమున, సారస్వతక్షేత్రమున ఆతడు గొప్ప మార్పులు కొనివచ్చినాడు. అవి దేశాభ్యుదయమునకు అఖిలభారతదేశమునందలి వివిధ జాతులలో ఆంధ్రజాతికి సముచితస్థానమును సంపాదించినవి. ఎన్నిరీతుల పూజించియు ఆ వీరుని ఋణము ఆంధ్రులు తీర్చుకొననేలేరు. ఆ ఈగగరాని యప్పులో ఈశిలావిగ్రహప్రతిష్ఠాపన మంతపాటిది? అయినను అల్పమాత్రులము మనము కొండంతదేవునకు కొండంత పత్తిరి నీయజాలముగదా! తెనుగుదేశము నింతవఱకు ఏ పట్టణమున జాతీయవీరున కెవనికిని శిలావిగ్రహప్రతిష్ఠాపనము లేదు. ఇదే మొదటిది. ఆధునికాంధ్రదేశపు మొదటి వీరుడగు వీరేశలింగము శిలావిగ్రహమే అట్టివానికి మొదటిదగుట యెంతయు సముచితముగనున్నది. తరతరములకు వీరేశలింగవీరుని అంశ ఆంధ్రులలో నిలిచి యుండునుగాక!

* * *

**౨. ఇది అత్యుత్తమదానము:—**

రాజేంద్రబాబు ఆంధ్రదేశసంచారమున కాంగ్రెసుసంస్థకుగాను పట్టినదానములలో అత్యుత్తమదానమొకటి గలదు. అది రాజమహేంద్రవరపౌరులు శ్రీ అరవ తిరుపతిరాయుడు గారు రాజమండ్రిలో కాంగ్రెసున కీయదలచిన

గృహదానమే. ఆంధ్రదేశమున ఊరూర కాంగ్రెసు సంస్థకు ఇట్లు స్వగృహములు నెలయుచో కాంగ్రెసునకు క్రొత్తజవముచేకూరగలదు. ఆంధ్రదేశమున మరి యేపట్టణమునను కాంగ్రెసునకు స్వగృహము లేదు. బెజవాడ యందలి కాంగ్రెస్ మందిరము ఆంధ్రరాష్ట్రీయ సంఘమువారిదికాని బెజవాడ పట్టణకాంగ్రెసు సంఘమువారిది కాదు. అగుట స్వగృహముగల పట్టణ కాంగ్రెసుసంఘములలో రాజమహేంద్రవర కాంగ్రెసుసంఘమే మొదటిది కాగలదు. రాజమహేంద్రవరమున నీవిషయమున మొదటి పేరు తెచ్చిన శ్రీఅగవ పెరుమాళయ్యగారి వదాన్యత కొనియాడ తగియున్నది. కాంగ్రెసుచరిత్రలో స్వగృహములవిశేషమైన ప్రాముఖ్యము వహించుననుటకు ఒకనిదర్శనము చూపవచ్చును. కాంగ్రెసు దృష్టిలో అలహాబాదు భారతరాజధాని. లక్నోకు తరలిపోయిన సంయుక్తరాష్ట్రపు ప్రభుత్వమువారును, అచటికై రైల్వేవారును తమ ప్రధానకార్యాలయములుంచుట కిష్టగింపని అలహాబాదు కాంగ్రెస్ వారికి రాజధాని యెట్లయినది? అలహాబాదుపౌరుడు మోతీలాల్ నెహ్రూగారు తన ఆనందభవనమును కాంగ్రెస్ నకు దానము చేసియుండుటచేత.

* * *

**౯. నిజామురాష్ట్రాంధ్రమహాసభలు:—**

బ్రిటీష్ భాగములనున్న ఆంధ్రులు ఆంధ్రసభల విషయమున ఉత్సాహము కనబరచుట మాని చాలదినములైనది. ఇచ్చటి నాయకులలో విశ్వదృష్టి ప్రబలి కొందరు, ఉద్యోగకాంక్షలో ఊపిరిసలుపక కొందరు. తమిళుల సాంబారుకు రుచిమరిగి కొందరు, ఇట్టివియే యగు మరి యితరకారణములచే కొందరు ఆంధ్రసభలపై ఆప్యాయత కనబఱచుటమానినారు. నిజామురాష్ట్రాంధ్రనాయకశిఖామణులగు శ్రీయుత సురవరము ప్రతాపరెడ్డిగారు, శ్రీయుత మాడపాటి హనుమంతరావుగారు మున్నగు ఆంధ్రమహాశయులు మాత్రము డిందుపడని ఉత్సాహముతో, గోల్పోవని విశ్వాసముతో, తఱుగని అభిమానముతో నిజామురాజ్యమున ఆంధ్రోద్యమము నడుపుచున్నారు. మెదకుజిల్లా జోగిపేట, నల్లగొండ జిల్లా దేవరకొండ మున్నగు తావులయందు జరిగిన ప్రథమ, ద్వితీయ, తృతీయ ఆంధ్రసభలు అచటి ఆంధ్రుల వ్యగ్రోత్సాహమునకు ప్రదర్శనభూములైనవి. ఈడిసెంబరు తుదివారమున నిజామురాష్ట్రీయచతుర్థాంధ్రమహాసభలు కరీంనగరము జిల్లా సిరిసిల్లలో జరుగనున్నవి. సిరిసిల్లకు సమీపముననున్న వేములవాడయందలి రామేశ్వరస్వామి ఈసభలు జయప్రదముగ నిర్వహింపబడుటకు పూటకాపు. ఈసభలు విజయవంతములై అలసత్వమున పడిన బ్రిటీష్ ఆంధ్రులను కూడ మేల్కొల్ప జాలునుగాక యని 'ఆంధ్రభూమి' మనఃపూర్వకముగ కోరుచున్నది.

* * *

**౯. వేల్ పిక్చర్సువారి 'కృష్ణలీల' టాకీ:—**

ఇది టాకీలయుగము. ఆంధ్రదేశమున ఇపుడు టాకీలవిషయమున ఉన్న సంచలనము మఱేవిషయమును గూర్చియు లేదు. దీని నందుకొని తెనుగు తెలియని ఇతర దేశీయులు కూడ ధనాశాపీడితులై తెనుగు టాకీలను తయారుచేసి తెనుగువారి తలపై రుద్దుచున్నారు. ఇట్టి పరిస్థితులలో తెనుగుతనముగల వేల్ పిక్చర్సు వారి 'కృష్ణలీల' టాకీ అవతరణము ఎంతయు ప్రశంసనీయమగుచున్నది. అవతరణముచే ప్రశంసనీయమగుటయేగాక 'కృష్ణలీల' అనకర్షణముచే దర్శనీయముకూడ

నైనది. రాజేశ్వరరావు, గగ్గయ్య, శ్రీరంజని మున్నగు ఇందలి వేషధారుల పాత్రధారణము దోషరహితముగనున్నది. భావప్రకటనము లెస్సగనున్నది. పాటలు మనోహరగానమున పాడలి వీనులవిందుగ నున్నవి. ఛాయాగ్రహణము, శబ్దగ్రహణము చక్కగ చేయబడినవి. ఇదివఱకు వచ్చిన తెనుగుటాకీల కన్నిటికంటె ఇది ప్రశస్తతరముగా నున్నదని చేయెత్తి చెప్పవచ్చును. ఇట్టి చిత్రమును డైరెక్టుచేసిన శ్రీ. పి. వి. దాస్‌గారిని కళాప్రియులగు ఆంధ్రులెల్లరు శ్లాఘింపగలరు.

* * *

౫. వీనస్ అస్యూరెన్సు కంపెనీవారి పదునాలగవ వార్షిక నివేదిక :—

1935, మార్చి, 31-వ తేదీతో ముగిసిన వీనస్ అస్యూరెన్సు కంపెనీవారి పదునాలగవ వార్షిక నివేదిక విమర్శనార్థము మాకార్యాలయమునకు పంపబడినది. నివేదిత వత్సరమున రూ. 27,60,435-9-0 లకైన 3172 ప్రొపోజల్సు చేరినవి. ఇందు సంవత్సరాంతమునకు రూ. 23,75,502-9-0 లకైన 2865 ప్రొపోజల్సు పోలసీలైనవి. వీనివలన ఏడాదికి ప్రీమియము రాబడి రూ. 1,18,065-11-0 లు. కంపెనీవారి లైఫ్ ఫండు రూ. 3,08,620-2-0 నుండి రూ. 4,93,163-1-0 కు పెంపొందినది. కోఆపరేటివ్ బెనిఫిట్ స్కీమునందును, కోఆపరేటివ్ ఇన్సూరెన్సు స్కీమునందును కూడ ఇట్టి క్రమాభివృద్ధియే కనిపించుచున్నది. భారతదేశపు రాజధానీనగరమగు ఢిల్లీ ప్రధానకార్యస్థానముగ కలిగి ఈ కంపెనీ భారతదేశమునందంతటను భీమావ్యాపారము చేయుచున్నది. మఱియు నిది ఆంధ్రాభిమానమునకు తగిన కంపెనీయము. ఏమన ? ఈకంపెనీ జనరల్ మేనేజరు శ్రీయుత బి. నరసింహము పంతులుగారు ఆంధ్రులు. వీరి ఆంధ్రాభిమానము ఒకసారి ఢిల్లి వెళ్ళియున్న ఆంధ్రులకెల్లరకును అనుభవపునరుక్తము. ఢిల్లీ రాష్ట్ర కాంగ్రెసు కార్యదర్శులుగా వారచట ఆంధ్రకీర్తిని ప్రచారముచేయుచున్నారు. ఈకంపెనీ డైరెక్టరుబోర్డు అధ్యక్షులు ఆంధ్రకేసరి ప్రకాశము పంతులుగారు. విశాఖపట్టణము నందలి వైద్యశిఖామణులలో నొకరగు (శ్రీ) బెండపూడి పేరిరాజుగారు (యం.బి.,బి.యస్.) ఇటీవలనే ఈకంపెనీ డైరెక్టరులుగా నెన్నుకొనబడినారు. ఇన్నిరీతుల ఆంధ్రసంబంధముగల ఈ కంపెనీ ఆంధ్రుల ఆదరణకు పాత్రము కాగలదని నమ్ముచున్నాము. ఈ కంపెనీని గూర్చి విశేషవిషయములు తెలిసికొనగోరువారు సూపరింటెండెంటు, వీనస్ అస్యూరెన్సు కంపెనీ, 22 సెకండులైన్ బీచ్, మదరాసు అని కాని; మెసర్సు శ్రీరాములు అండ్ జయరాములు, అసిస్టెంటు సూపరింటెండెంట్సు, వీనస్ అస్యూరెన్సు కంపెనీ, 141 పురశువాకము హైరోడ్డు, మదరాసు అనికాని వ్రాయవలెను. తెనుగుదేశమున గుంటూరు, విశాఖపట్టణము, బెజవాడలందు ఈకంపెని శాఖాకార్యాలయములు కలవు.

* * *

౬. తెనుగుగ్రంథాలయములు :

తెనుగు పత్రికలు :—

హైదరాబాదు కృష్ణదేవరాయాంధ్రభాషా నిలయపు 34-వ వార్షిక నివేదిక విమర్శనార్థము మా కార్యాలయమునకు పంపబడినది. వయస్సుచేతను వసతిచేతను ఆంధ్రదేశపు గ్రంథాలయములలో పెద్దదైనవానిలో నిదియొకటి. వయోజనవిద్యావ్యాప్తికి తోడుపడునవి, విద్యార్థులు తాము నేర్చినవిద్య మఱచి తిరిగి

నిరక్షరాస్యత పొల్పొడకుండను చేయగలవి, ఎప్పటికప్పుడు నూత్నవిషయములను బోధింపగలవి పత్రికలు. అట్టి పత్రికలను సామాన్యప్రజల కందియవలసినవి గ్రంథాలయములు. ఈ విషయము నీ గ్రంథాలయపాలకులు లెస్సగ గ్రహించి ఇరువదియొక్క తెనుగు పత్రికలచే తమ పఠనమందిరము నలంకరించుచున్నారు. ఈ ఇరువదియొక్క పత్రికలును నిలయపు సొమ్ముతోనే తెప్పింపబడుచున్నవి. ఇది యొకవిశేషము. తెనుగు దేశమున గ్రంథాలయములు తెనుగు పత్రికలను తేరగ తెప్పించుకొనుటకే తంటాలు పడుచుండును. సొంత డబ్బుతో ఈగ్రంథాలయమువలె ఇన్ని పత్రికలను తెప్పించు గ్రంథాలయము ధనవంతము, విద్యావంతము అని చెప్పబడు బ్రిటీష్ ఆంధ్రభాగమునందే మఱియొకటి లేదని చెప్పగలము. ఈవిషయమున కృష్ణదేవరాయాంధ్రభాషానిలయము బ్రిటీష్ ఆంధ్రభాగమునందలి ఎల్ల గ్రంథాలయములకు ఒజ్జబంతిగా నుండదగియున్నది. మొన్న విశాఖపట్టణమున జరిగిన ఆంధ్రదేశగ్రంథాలయ సేవక మహాసభ ద్వితీయసమావేశమునకు అధ్యక్షత వహించి శ్రీయుత శరణు రామస్వామి చౌదరిగారు తెలుగుదేశమున ఏడువందల ఏబది గ్రంథాలయములున్నవని చెప్పినారు. ఈగ్రంథాలయములలో సగమైన కృష్ణదేవరాయాంధ్రభాషానిలయపు ఒరవడి నందుకొనుచో ఒక్కొక్క గ్రంథాలయము నిజమైన ఒక్కొక్క విద్యాలయము అయి దేశకళ్యాణకారకము కాగలదు. మన గ్రంథాలయపాలకులీ విషయమై శ్రద్ధవహింతురా ?

# ముసోలినీనియంతకు నిరంతరబంధనములు

ప్రపంచమునందలి వివిధదేశము లిపుడు ఇటలీపై ఆంక్షలు ప్రయోగించియున్నవి. ఇంతకుపూర్వము ఇటలీదేశముననే ఇటలీ నియంత ముసోలినీకి లెక్కలేనన్ని ఆంక్షలు. ఈయ దనున ఆ నిరంతరబంధనము లెట్టివో తెలిసికొనుటకు కొంత ముచ్చటగ నుండగలదు.

ముసోలినీచుట్టును అన్ని వేళలయందును మూడువందలమంది పోలీసువారుందురు. వారు పోలీసుదుస్తులను మాత్రము ధరించియుండరు. ముసోలినీ తనకుటుంబముతో నివసించు విల్లాటార్లానియాను, అతని కార్యాలయమగు పెల్లాజోవెనీజియాను వారు నిరంతరము కాపాడుచుందురు. జాన్ పార్డు అను సుప్రసిద్ధ పత్రికావిలేఖరి యొకడు ఒకసారి రోము నగరమునకు పోయినపుడు ముసోలినీ కార్యాలయమునకు ఎదురుగనున్న హోటలులో దిగబోయెను. అతని పుట్టుపూర్వోత్తరములన్నియు ఆరాతీసిన పిమ్మటకాని ఆవిదేశీయుని ఆ హోటలులో కాలుపెట్టనిచ్చిరికాదు. రోము విడిచి ముసోలినీ ఎచ్చటికైన పోవుననుకొనుడు. ఈ మూడువందలమంది పోలీసువారును అతనిని ముట్టియుండవలసినదే !

జాన్ పార్డు ఆహోటలులో చేరిన తరువాత తనగదియందలి గవాక్షముగుండా ముసోలినీ కార్యాలయమువైపు చూచినాడు. పెల్లాజోవెనీజియా ముందరి చతురశ్రమమున సింహద్వారమున కీవల ఫాసిస్టుమిలిటరీదుస్తులు ధరించిన కావలివాండ్రు ఇద్దరుమా యుండిరి. ఇక నెవరును పారావా నియే అతడు భావించెను. కాని ముమున బేదుస్తులతో తిరు కావలివాండ్రే. వింతవాడెవడై

నడకలు నడుచుచు తారట్లాడుచున్నట్లుగా కనిపించెనా కావలివాండ్రయందు ఒకడువచ్చి వానిని వెంటనే తరలిపోవ హెచ్చరించును.

ఈ పోలీసువారు అనుమతించినగాని ముసోలినీ తనయింటినుండి ఆఫీసుకును, ఆఫీసునుండి ఇంటికిని పోకూడదు. నియంతకు ఎట్టి ఆంక్ష! ప్రతిదినమును ఒకదారిని పోయివచ్చుటకైన వీలులేదు. ఆదారికూడ వారే నిర్ణయింపవలయును. దినదినమును దారిమార్చబడుచుండును. అతడు పోవు దారియందు బేదుస్తులయందుండు ఈ పోలీసులు అచటచట నిలిచియుందురు. వారియందు వారికి ప్రత్యేకపు గుర్తులుగలవు. ముసోలినీ రాకను వారు ఒండొరులకు ఈ ప్రత్యేకపు గుర్తులతో తెలుపుకొందురు. ముసోలినీ వచ్చుచున్నాడనగా రస్తాయందలి జనులను ప్రక్కలకు పోవ నాజ్ఞాపించి వారు దారి ఖాళీచేయుదురు.

ఇట్టి సమయములందే ముసోలినీకి బాంబులవలని ప్రమాదము సంభవించవచ్చునని ఈ పోలీసుల భయము. అగుట వారు ఎక్కువ జాగ్రత్తవహింతురు. మునిసిపల్ కాలవలలోనికి పోనీటిని జార్చు మురుగులందు ఎవరును బాంబులు పెట్టకుండుటకై అచట ఇనుప రేకుల తాపడము! సైడుకాలువలపై ఇనుప మూతలు. లాంతరు స్తంభములన్నియు ప్రత్యేకశ్రద్ధతో పరీక్షింపబడును. ఇంటి వారే అట్టి సమయములందు కిటికీలపై కెక్కరాదు. ఇక ఇతరులమాట ఏల? ముసోలినీ బహిరంగసభలయందుపన్యసింపపోవునపుడు జాగ్రత్త విషయమున ఈ రక్షకభటులు కంట వత్తిడుకొని యుందురు.


ముసోలినీ తనకువచ్చు ఉత్తరములైన తాను చింపుకొనరాదని ఆంక్ష. దినమునకే అతనికి నూరలకొలది ఉత్తరములును, డజనులకొలది పార్సెలులును వచ్చును. అతని అభిమానులు అతనికి ఈ పార్సెలులద్వారా బహుమానములు పంపుదురు. ఇట్టి బహుమానములు తనకు పంపరాదని ముసోలినీ ఎన్నియోసారులు ప్రకటించినాడు. కాని అతని అభిమానులీ ప్రకటనను పాటించుటలేదు. ఇట్లువచ్చు ఉత్తరములనుండియు పార్సెలులనుండియు బాంబులుకూడ రావచ్చునుగదా! వానిని ముసోలినీయే స్వయముగ విప్పుచో ఎంత ప్రమాదము? కావున వానిని అతడు చూచుటకు పూర్వము ఇతరులు విప్పుదురు.

నేటి జాతిసమితివారి ఆంక్షలను అతడు తక్కసించుకొనునట్లు వ్యక్తిపరమైన ఈ పోలీసు ఆంక్షలనుకూడ నతడు తక్కసించుకొనును. రక్షకభటుల ఆంక్షలనుండి తప్పించుకొనుటకే అతడు సర్వదా యత్నించుచుండును. వేసవియందు ప్రతిదినమును అతడు సముద్రస్నానము చేయును. కావున అట్టిసమయములందు అతడు మోటారుసైకిలు ఎక్కి రోము ఓస్టి యూనడుమనోద్యానపై పోర్టియానో కోటవైపు ఎవరికిని చెప్పకయే పోవుచుండును. ఒక్కొక్కప్పుడు సామాన్యప్రజలతోడను, కర్షకులతోడను కలిసి మెలిసి వర్తింప నాతడు ముచ్చటపడును. కర్షకుల నాట్యములందు కూడ పాల్గొనును.

పెలాజ్జో వెనీజియా యందలి బాల్కనీ మీద నిలబడి ప్రజలకు ఉపన్యసించు ప్రతిసారియు అతనికి ప్రాణభయము కలదు. అటుగాక! ఆత డిట్టి ఉపన్యాసము లీయవలసిన అవసరములు తఱుచై యుండును. ఎన్నియోసారులు అతనిపై తుపాకిగుండ్లు బారు చేయబడినవి. అన్నిసారులును అతడు మృత్యుదేవత వదన గహ్వరమునుండి నిరపాయముగ బయటపడినాడు.



గౌరీశంకర శిఖరద్వయము



# ఆనాడు ఆషాఢ శుద్ధ పాడ్యమి

[గత సంచిక తరువాయి.]

పుస్తకాలు ఇదివరకు నేను కేవలం కాలయాపనకోసం చదివేదాన్ని. ఆపుస్తకాలే ఇప్పుడు నాజీవితానికి సౌఖ్యం చేకూర్చే ఉపకరణాల్లో ముఖ్యమైనవిగా మారిపోయాయి. ఎందువల్ల ? అబ్బాయే ఆపుస్తకాలు తెచ్చియిస్తూఉంటాడు. నేనిదివరకు మావాదినా దొడ్డమ్మా బలవంతాన పాడిపాడి విసువెత్తినపాటలే ఇప్పుడు నానోటంటవస్తే ఎంతో వింతగానూ, అమృతమయంగానూ ఉన్నట్టు నాకే తోచేవి. కారణం ? గది లోగుమ్మంలో కూచుని అబ్బాయి **వాటిని** విని మెచ్చుకుంటూ ఉంటాడు.

ఎప్పుడైనను చల్లని వెన్నెలరాత్రులలో అబ్బాయితోకలిసి మేమందరం సముద్రపు టొడ్డుకు సరదాగా షికారువెళ్ళినప్పుడు ఎంత కాలమాయి ఎప్పుడూ చూస్తున్నవే అయినా అగాధమైన ఆ సముద్రం, దానిలోంచి కొండలవలె పైకిలేచే ఆతరంగాలూ, అవి పేలిపోయేటప్పుడు వాటిలోంచి రాసులురాసులుగా పైకితుళ్ళి పండువెన్నెట్లో తళతళ మెరిసే నీటిముత్యాలూ—పైన అనంతనీలిమాకాశం, దానిగుండా ఈదే మబ్బుతెరలూ, అవిపక్కకు తరిలేటప్పుడు మిలమిల తొంగిచూసే నక్షత్రరాసులూ అన్నీ తిలకిస్తూ ఉంటే వాటన్నిటిలోనూ ఏదో అపూర్వమైన ప్రకృతి రహస్యం, అమూల్యమైన భగవత్సందేశం అంతర్యామిత్వమై ఉన్నట్లు, వాటిని గ్రహించి మెచ్చుకోగలిగే శక్తి నాలోకూడా ఏమూలో యిమిడి ఉన్నట్లు నాకర్థమయేది. పైగా, భగవత్స్వరూపమే ప్రకృతిరూపంతో భూమిమీదనూ, దేవతాస్వరూపంతో ఆకాశంలోనూ నిండిఉన్నట్లు నామనస్సుకి తట్టేది.

ఇప్పుడుకూడా అబ్బాయి వెక్కిరింపులధోరణి ఏమీ తగ్గకపోగా దినేదినే అధికమవుతున్నదని కూడా చెప్పవచ్చును. అయినా వాటి వ్యాఖ్యాసంమాత్రం వేరని తెలుసుకోగలిగినందున అవి నాకు కోపానికిబదులు ఇప్పుడు ఆనందాన్నే చేకూరుస్తున్నాయి.

'ఉమ నిద్రపోయిందంటే ఏనుగులు మీదనుంచి నడిచినను తెలీదు' అనేవాడొకప్పుడు.

'ఎనిమిదిగజాలచీరైనా ఉమకి సరిపోతుందో చాలదో అనుమానమే' అని ఇంకోసారనేవాడు.

ఆమాటలవల్ల నాకు మొద్దునిద్రనీ, నేను లావుగా ఉంటాననే అర్థములే పైకి స్ఫురించినా అబ్బాయి చెప్పదలుచుకున్నది మాత్రం వేరని నాకు తెలుసు. అదేమిటంటే 'ఉమా! ఎప్పుడూ నేను నీగురించే తలపోస్తూ ఉంటాను. ఎన్నటికీ నిన్ను మరిచిపోలేను' అని. అతని చూపులూ, చేష్టలూ, వైఖరీ, ముఖంలోని భావాలూ అన్నీ ఆసంగతే తెలియజేసేవి.

ఇలాగే ప్రతి విషయంలోనూ అతడు మాట్లాడుతున్నదానికంటె, చెబుతున్నదానికంటె, అడుగుతున్న దానికంటె—మాటాడదలుచుకున్నదీ, చెప్పదలుచుకున్నదీ, అడగదలుచుకున్నదీ వేరుగానే ఉన్నట్లు నాకు ధ్వనించేవి. నాప్రశ్నలూ, జవాబులూ కూడా వాటికనుగుణంగానే ఉండేవని గ్రహించలేని వారెవరూ వుండరు.

## ౭

ఆనాడు ఆషాఢశుద్ధపాడ్యమి. నాకు బాగాజ్ఞాపకముంది. జ్ఞాపకమేమిటి? ఆత్మనేదే శాశ్వతమైందని ఒప్పుకుంటే ఈ శరీరంపోయినను జన్మజన్మాంతరాలవరకూ ఆరోజును నేను మరిచిపోలేను. ఒక్క నేనేకాదు—

'ఆషాఢస్య ప్రథమదివసే మేఘమాశ్లిష్టసానుం
వప్రక్రీడా పరిణతగజ ప్రేక్షణీయందదర్శ ॥'

అని వెయ్యి సంవత్సరాలక్రిందట మహాకవి కాళిదాసు స్వాగతమొసగిన ఆ పవిత్రదివసమును ఆర్యావర్తంలో ఎవ్వరూకూడా మరిచిపోదామన్నను మరిచిపోగలుగుతారని నేననుకోను.

ఆనాడు హైస్కూలు వార్షికోత్సవం. ఉపాధ్యాయులకూ, విద్యార్థులకూ ఉత్సాహంతో, కార్యక్రమం సాగించవలసిన పూచీతో ఊపిరితిరగకుండా ఉన్నది. అందులో బాలికలచేత శాకుంతలనాటకమభినయింపజేయవలసిన పూచీ మా ఆయనమీద పడింది. శకుంతలపాత్ర ధరించవలసినది మాచెల్లెలే. ఉదయంనుంచి నాటకంలో పాత్రలు వహించే పిల్లలందరూ మాయింటివద్దనే ఉండి ఎవరిభాగములను వారు వల్లెవేసుకొని అభినయించి చూసుకుంటున్నారు. సాయంత్రం నాలుగుకాకపూర్వమే పిల్లలనందర్నీ తోడ్చుకుని మావారు బడికి బయల్దేరారు. వారి హడావుడి చూస్తే రాత్రి ఏడెనిమిది గంటలవరకూ ఇంటికి చేరుకునేటట్లు లేదు.

ఆనాడు దినమల్లా చాలాతీక్ష్ణంగా ఎండకాచి సాయంత్రం అయిదు కాకపూర్వమే చిన్నచిన్న తెల్లని మబ్బుతెరలు రాసులురాసులుగా కుందేళ్ళమందవలె ఆకాశమంతటా గునగున సంచరించడం మొదలుపెట్టాయి. వాటితో పరిగెత్తడానికి పందాలు వేసుకుని వెనకబడ్డ మేకలమందవలె దట్టమైన కారుమబ్బులు ఉరుముకుంటూ వాటిని వెంబడిస్తున్నాయి. త్రుటికాలంలోనే తెల్లమబ్బులు మాయమై నీలిమాకాశం, సంధ్యారాగం, అస్తమించే సూర్యుడూ అన్నీ కారుమబ్బుల్లో మిళితమైపోయేయి.

ఆబరువైన మేఘాలధోరణి చూస్తే ఏనిముషానైనను వర్షరూపందాల్చి కిందకుజారిపోయేటట్లుంది. రెండుమూడు మాసాలబట్టి తీక్ష్ణమైన ఎండల్లో వేగిపోతున్న ప్రజలకు ఆ

చల్లని నీటిగాలీ, దర్శనీయమైన మబ్బులూ, కాలాన్నికూడా పావనంచేసే అందమైన ఆదినం ఎంత అమూల్యమైనది ? ఈ పవిత్రదివసానికి, ఈ మేఘదూతకు ఉజ్జయినీ మహాకవి కాళిదాసు స్వాగతమొసగీ ఎంతకాలమైంది ? ప్రతి సంవత్సరంలోనూ ఆదినము చుక్కలమధ్య చంద్రునివలె అంత ఆకర్షణీయంగానే, అంత శోభతోనే ప్రకాశిస్తూంది. ఈరోజునకూడా ఎంతమంది ప్రజలు అతికుతూహలంతో ఎత్తినతలలు దించకుండా ఆకసమువంక తిలకిస్తూ స్వాగతమిస్తున్నారు ఆమేఘోదయానికి ? అటువంటి సమయంలోకూడా మానవనిర్మితమైన ఇటికిపెట్టెలమధ్య నలుక్కుపోయే వింతప్రకృతులు కొందరుంటారు. వెలుపలికి వస్తే ఒకవేళ చల్లనినీటిముత్యాలుపడి శరీరం తడిసిపోతే—? ఎంతప్రమాదం !

నాకుమాత్రం చీకటిగదిలో ఒంటరిగా కూచోడం దుర్భరమైంది. జానకిగారింటికి బయల్దేరాను. నేనూ వాళ్ళగుమ్మం ఇంకా ఎక్కానో లేదో దడదడా చినుకులు ప్రారంభమయేయి. వీధితలుపు జార్లవేసిఉంటే మెల్లగా తెరిచి లోనికివెళ్లాను. లోన ఎవ్వరూ కనబడలేదు. ఇల్లంతా నిశ్శబ్దంగా నిద్రపోతున్నదా అనిపిస్తూంది. గదిలోనున్నారేమోనని గదితట్టువెళ్లి 'వొదినా' అనిపిలిచాను. అబ్బాయి కంఠస్వరం జబాబిచ్చింది. 'ధర్మంగారింటికి వెళ్లారు. ఇప్పుడే వస్తారు.' పైన హోరునవాన. అయినను వెళ్లిపోబోయాను.

ఆహోరులో 'ఉమా' అని ఏదోపిలుపు వినబడినట్లయింది. అసంభవమనుకున్నాను. 'ఉమా, ఉమా!' ఇంకా మెల్లగా మృదువుగా వినబడింది. సంశయంలేదు. ఎంతహోరులోనైనా, ఎంత మెల్లగాఉన్నా ఆ గొంతుకెవరిదో పోల్చుకోడం నాకేమీ కష్టంకాదు. నిద్రలోనూ, కలలోనూ, వెయ్యి కంఠస్వరాల మధ్యనుకూడా ఆగొంతుకెవరిదో స్పష్టంగా గుర్తించగలను. నాహృదయం దడదడా కొట్టుగుంది. అవ్యక్తమైన ఆనందమూ,సిగ్గూ నన్నొకేసారి ముంచేశాయి. ఎటూకదలలేక గోడకానుకుని ఉండిపోయాను.

అబ్బాయేవచ్చి మృదువుగా నాచెయ్యి పట్టుకున్నాడు. సిగ్గుచే నాప్రాణాలు నిలువునఎగిరిపోయాయి. ఏమీమాటాడకుండానే మెల్లగా, అతిచనువుగా నన్ను గదిలోకి తీసుకువెళ్లి కుర్చీలో కూచోబెట్టి పక్కకుర్చీలో తను కూచున్నాడు. అవ్యక్తమైన బెదరుతో, సిగ్గుతో నాశరీరం వణికిపోతూంది. కళ్లు మూతలుపడిపోతున్నాయి. తీయనిస్వరంతో అబ్బాయి పలుకులు :

'ఉమా ! నీమీద నాకెంతప్రేమో నీకు తెలీదుకదూ ! ఒక్కరోజు నీముఖం కనబడకపోతే బతకలేను.'

అది నిజంగా అబ్బాయి కంఠస్వరమేనా ? అమృతవృష్టి నామీద కురిసినట్లయింది.

మళ్లీ అబ్బాయి కంఠస్వరమే :

'నీకు నాతలంపే ఉండదుకదూ !'

ముఖమెత్తి చూశాను. అతనికళ్లు కుతూహలంతో 'చెప్పవూ!' అని లాలిస్తున్నట్టు నావంకచూస్తున్నాయి. ఊరుకుందికి నామనస్సొప్పలేదు. సిగ్గుతో, చిరునవ్వు పెదవులతో, వణకుతున్న గొంతుతో అన్నాను :

'ఉందో లేదో నీకు తెలీదూ!'

అతనిముఖ మొక్కసారి బాలకుని ముఖంవలె కెంపుబారి వికసించిన గులాబీలాగు ప్రకాశిస్తూంది. ఏదో మాటాడాలని ప్రయత్నించాడు కాని, పెదవులు అడ్డుపడ్డాయి. నాకళ్లు అతని ముఖంవంకే చూస్తున్నాయి. నన్ను సేవించేస్తూ, నామీద అధికారంచూపుతూ, నన్నాజ్ఞాపిస్తూ, నిత్యమూ నాలోపాలనే ఎంచిచూపాలని ప్రయత్నించే అబ్బాయిలాగు లేడప్పుడు. నామాటలనూ, చూపులనూ, ప్రేమనీ ఆరాధించే భక్తునివలె కనబడ్డాడు. ఇరువురమూ మాట్లాడకుండానే, ఏమిచేస్తున్నదీ తెలీకుండానే ఒకరివంక వొకరం చూస్తూ అలా ఉండిపోయాము.

అతని నేత్రాలు అంతకంతకూ ఏమో వింతగా వెలిగిపోతున్నాయి. నాకళ్లు వాటంతటవే మూతలుపడ్డాయి. ఏవో ఆలోచనలు నామనస్సులో పరిగెత్తుతున్నాయి. ఇంతలో అబ్బాయిచెయ్యి మెత్తగా, గులాబిపువ్వుంకంటె కోమలంగా నాబుజాన్ని తాకింది. అ...బ్బ! ఆస్పర్శ ఎంత మృదువుగా, ఎంతమధురంగాఉంది! నాశరీరం పులకరించింది. ఒక్కక్షణం నేను సర్వమూ మరిచిపోయాను. నేనున్నది భూమో స్వర్గమో కూడా నాకు తెలీలేదు.

అబ్బాయిచెంత సంతసనువుగా కూచున్న దినాలు, అతనిస్పర్శ ననుభవిస్తూ చెట్టాపట్టాలు వేసుకుని అతనితో స్వేచ్ఛగా తిరిగిన నిముషాలు, ఇరువురమూ ఎంతో సరదాగా కబుర్లు చెప్పుకుంటూ, చదువుకుంటూ, ఆడుకుంటూ, ఒకరిమాటల్లో ఒకర మానందించుకుంటూ గడిపిన బాల్యనాటకంలోని ముఖ్యమైన ప్రకరణాలు అన్నీ ఒక్కసారి ఫిల్ము తిరిగినట్టు నాకళ్లముందు గిర్రున తిరిగాయి.

ఆతని కింత చేరువగా అతని హృదయస్పందము నాహృదయస్పందమో అన్నట్టు వినబడేటంత చేరువగా కూచుని ఎంతకాలమైంది? అన్నాళ్లకు మళ్లీ ఈనాడు అబ్బాయికి, నాబాల్యస్నేహితుడికి ఇంత దగ్గరగా కూచోగలిగే అదృష్టం నాకు లభించింది. ప్రియతములలో కల్లా ప్రియతముడైన అబ్బాయి, నా ఆనందంలో, ఆటల్లో, పాటల్లో, కష్టసుఖాల్లో భాగస్వామి అయిన అబ్బాయి, ప్రపంచమంతటికంటె నాకు సన్నిహితుడైన అబ్బాయి మళ్ళీ ఈనాడు నాపక్కకు వచ్చాడు. నేడు అతనిపక్కని నేనుతప్ప ఇంకెవ్వరూ లేరు——

ప్రపంచమంతటా చీకటికమ్ముకుంది. అంతటా నిశ్శబ్దం - శాంతి! ఆనిశ్శబ్దంలో మేమిద్దరమే! మే మిప్పు డేమి చేసినా ఎవరికీ తెలీదు. ప్రమాదమేమీ లేదు. అబ్బాయి చెయ్యి గట్టిగా, ఇంకాగట్టిగా నాబుజాన్ని అదుముతూంది. ఆహా! ఎంతహాయి!! అతనిముఖం, నేత్రములూ ఉద్రేకంతో వెలిగిపోతున్నాయి. లోకం, శరీరం కూడా మరిచిపోయేటప్పుడు కలిగే ఆనందం ఒక్కసారి నాకు కలిగింది. కాని——అటువంటిస్థితి ఎంతోకాలముండదు... హఠాత్తుగా స్వర్గసౌధంనుంచి ఎవరో నన్నొక్కసారి అమాంతంగా కిందకుతోసినట్లయింది. నా ఆనందమంతా ఒక్కసారి మాయమై అవ్యక్తమైన బెదురుగా, దిగులుగా మారిపోయింది. మేమిరువురమూ ఏదో తప్పుపని చేస్తున్నట్లు నాహృదయంలో ధ్వనించింది. వాయువేగాన పరిగెత్తుతున్న స్త్రీహృదయంలాగు నాహృదయం కొట్టుకోవడం మొదలుపెట్టింది.

# చిన్న కథ రచనకు కొన్ని సలహాలు

ఈకాలంలో అనేకపత్రికలలో అనేక చిన్నకథలు ప్రకటించబడుతున్నాయి. చిన్న కథలు రాయడంలో కొందరు పేరుప్రతిష్ఠలు గణించారు. తక్కినవారి రచనలకంటే వీరి రచనలు చాలా బాగుంటాయి. కాని సామాన్యంగా యిప్పటి చిన్న కథలన్నిటిలోనూ కొన్నిలోట్లు కనబడుతున్నాయి. ఈలోట్లు లేని కథలెక్కడోగాని కనపడవు. పేరుపొందిన రచయితల కథలలో కూడా ఈలోట్లు తరుచు కనబడుతూనే వుంటాయి. ఈలోపాలు బహుస్వల్పమైనవేకాని గాఢమైనవికావు. ఇవి బహుసులువుగా సవరించుకోవచ్చు. సవరించుకుని కథలు ఎంతోరసవంతంగా చేసుకోవచ్చు. పేరుపొందిన పాశ్చాత్యకథకుల కథలు చదివి మనకథలకూ వాళ్ళకథలకూ వుండే భేదాలు చూశాను. చూసినమీదట మన కథలలో కనబడుతూన్న లోపాలు తెలుపుతున్నా.

మనకథలు సాధారణంగా చాలా టూకీగా వుంటాయి. దీనికికారణం కథకుని భావనలోనిలోపమే. కథకుడు తానురాసేకథ లోకంలో నిజంగా జరిగినట్టు నమ్మాలి. అతనిభావన అంత తీవ్రంగావుండాలి. అప్పుడే కథ రసవంతంగా రాయగలుగుతాడు. తాను నమ్మని ఒక వ్యూహం పాఠకులచేత అసలే నమ్మించలేడు. అటువంటి రచన రసహీనంగా వుంటుంది. తాను సృష్టించిన పాత్రలు సజీవ వ్యక్తులేగాని దయ్యాలలాగ శరీరంలేనివారని అనుకోకూడదు. ఎప్పుడైతేవారు సజీవవ్యక్తులని అనుకుంటాడో అప్పుడే ఒకడి ఆకారానికీ మరొకడి ఆకారానికీ భేదం—ఒకడిమనస్సుకీ, నడతకీ, మరొకడిమనస్సుకీ, నడతకీ భేదం కనబడుతుంది. పాత్రలలోని తబిసీళ్లు కూడా విశదంగా వర్ణించగలుగుతాడు. ఇటువంటి పాత్రలను సంచరింపచేసే ప్రపంచం కూడా అంత సహజంగానూ వుంటుంది. అటువంటి సహజవ్యక్తులూ, సహజప్రపంచంగల కథలు ఎన్నడూ టూకీగా వుండవు. లోకంలో ఏదేనా టూకీగా జరుగుతుందా? ఈలోకానికి కొంత ప్రతి అయిన కథాలోకంలో మాత్రం టూకీగానూ, అసహజంగానూ ఎలాగ జరుగుతుంది? ఈమార్పు కనక మన చిన్నకథలలో చేసుకున్నట్లైతే, ఇప్పటి టూకీకథలిచ్చే ఆనందంకంటే ఆకథలు పదిరెట్లు ఎక్కువ ఆనందం యిస్తాయి.

ఈకాలపు చిన్నకథలను గురించి మరొక ముఖ్యమైన సంగతేమిటంటే—ఈ అంశం చూస్తే తెలుగులో ఇంకముందు చిన్నకథ వాఙ్మయం నశించిపోతుందా అనిపిస్తూంది. ఇప్పుడు కొంతకొంతమంది పట్టి సంభాషణలే రాస్తున్నారు. ఇవి చిన్నకథలని భ్రమపడుతున్నారు. ఈసంభాషణలు చిన్నకథలూకావు, చిన్న నాటకాలూకావు, సాహిత్యచిత్రాలూకావు, ఏవీకావు. ఇవి రసవంతమైనవి ఏవీకావు. మరేమిటంటే, ఇవి చిన్నకథ వాఙ్మయాన్ని నాశనంచేసే ఒకవాక్యసముదాయం. ఈ సంభాషణలు వ్యూహంలేని కొన్ని రచనలకు బాగుంటాయికాని వ్యూహంవున్నవాటికి ఏమాత్రమూ పనికిరావు. ఈసంభాషణపద్ధతిని సృష్టించినవారు శ్రీ శ్రీపాద సుబ్రహ్మణ్య

శాస్త్రిగారు. ఆపద్ధతినే ఇప్పుడు అనేకమంది అవలంబిస్తున్నారు. ఈ పద్ధతికి మూలపురుషులు శ్రీ సుబ్రహ్మణ్యశాస్త్రిగారు కాబట్టి వారి రచనలలోంచే వీటికి వుదాహరణ లిస్తాను, వ్యూహంలేని రచనలకు సంభాషణలు సరిపోతాయికాని వ్యూహంవున్నవాటికి సంభాషణలు పనికిరావు అంటిని. శ్రీసుబ్రహ్మణ్యశాస్త్రిగారు రచించిన 'యావజ్జీవంహోష్యామి' (1926 సం॥ భారతిలో పడింది) 'బ్రాహ్మణాగ్రహారం' (భావ సం॥ ఆంధ్రపత్రిక సంవత్సరాదిసంచికలో పడింది) చూడండి. ఎంతో బాగుంటాయి. అత్యద్భుతంగా వుంటాయి. ఆ రెండు రచనలలోనూ వ్యూహం లేదు: వివిధాలైన దృశ్యాలు మాత్రమే చిత్రించబడ్డాయి. ఇటువంటి రచనలకుసంభాషణలు ఎంతేని బాగుంటాయి. కాని శ్రీ శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రిగారు ఇటీవల ప్రకటించే సంభాషణలు చూడండి. ఇవి చిన్న కథలని చాలమంది భ్రమ. ఇవి కథలూకావు, ఏవీ కావు. కథావాఙ్మయానికి విపత్తు కలిగించేటటువంటి వాక్యసముదాయాలు మాత్రమే. ఇటీవల సంభాషణలకు వ్యూహాలున్నాయి. వ్యూహాలున్నవాటికి ఈ సంభాషణలు పనికిరావు అంటాను. ఈమోస్తరుగా చిన్నకథలనుకుని సంభాషణలురాసే కథకులంతా తాము కథావాఙ్మయానికి చేస్తూన్న అపకారాన్ని గ్రహించ కోరుతాను. వ్యూహాలుగల కథలను సంభాషణలుగా రాయవద్దు.

మరొకవిషయం. ఇద్దరు మనుష్యులు మాట్లాడుతున్నారనుకోండి. వారిద్దరూ మాటలను మాత్రమే వుచ్చరించి వూరుకోరు. ఆమాటలనైనను ఒకమాటు వుచ్చరించినట్టుగా మరొకమాటు వుచ్చరించరు. వుచ్చరించడానికి పూర్వం మనస్సులో భావాలుగాని, స్పందనములుగాని వుంటాయి. ఎదుటివాడి మాటలు విన్నప్పుడు మళ్లా ఏవేవో మార్పులు కలుగుతాయి. కథకు అవసరమైనంతమట్టుకు ఇవి అన్నీకూడా కథలో చేర్చవలసిందే. కథయొక్క ఆనందానికి అడ్డురాకుండేటట్లా వాటిని జాగ్రత్తగా చేర్చాలి. పాశ్చాత్యకథకులు ఈ అంశాన్ని ఎంతో జాగ్రత్తగా గమనిస్తారు. ఉదాహరణకు హెచ్. జి. వెల్సుఅను ఒక ఆంగ్లకథకుని ఒక చిన్నకథలోని ఒక చిన్నముక్కను ఇక్కడ అనువదిస్తాను.

. . . . . . . . . . . . . . . . . . . . . . . . . .

మచ్చవున్న పెదిమిగల సన్నటి మనిషి మొట్టమొదట మాట్లాడాడు. 'ఎక్కడాలేరు' అని నిస్పృహ తెలిపే గొంతుకతో అని 'కాని, ఎంతా, ఒక్కరోజేకాదూ వాళ్లు ముందు బయలుదేరారు' అన్నాడు.

'వాళ్ళవెంట మనం వస్తున్నామని వాళ్ళకు తెలియదు' అన్నాడు తెల్లగుర్రంమీద వున్న ఒక పొట్టిమనిషి.

అప్పుడు నాయకుడు 'ఆమెకు తెలుసు' అని తనలో మాట్లాడుకుంటూన్నట్లుగా పలికాడు.

'అయినను వాళ్లు వేగిరం వెళ్ళలేరు. వాళ్ళదగ్గిర గుర్రంలేదు, కంచరగాడిదేగాని. ఆ అమ్మాయికాలు రక్తంకారుతూనే వుంది—'

వెండికళ్లెం పట్టుకున్నమనిషి (నాయకుడు) వాడివైపు తీవ్రంగాచూసి 'నేను చూడలేదనుకున్నావా' అని కోపంతెలిపే స్వరంతో అన్నాడు.

# ఆమెకళ్ళల్లోని తేజస్సు నాఫోటోలోకి ఎలావచ్చింది

"మొదటిమాటు రాజ్యాన్ని చూడటంతోటే కిశోర్ హృదయంలో చల్లనంకలిగింది... రాజ్యంలో అందంలేదు. ఆమెవి విశాలమైన కళ్ళుకావు. చప్పున ఆకర్షించే కోలముక్కు కూడా లేదు. ఆ శరీరంలో గొప్ప అవయవాల సౌష్టవంకూడాలేదు. ఆమె ఆచిన్నని రొమ్ము కూడా యితరులని బాహాటంగా ఆకర్షించదు. కాని ఆమె తలవెంట్రుకలుమాత్రం చిన్ని కెరటాలు కడిగిన సముద్రపు నున్నని యిసుకకి మల్లె నొక్కులు నొక్కులు పడివుంటాయి. ఆమె ముఖాన్ని యేదో పూజ్యమైన పవిత్రత, శాంతత ఆవరించి వుంటాయి. ఆమె చిరునవ్వు నవ్వినప్పుడల్లా ఆమె నున్నని వెన్నెల చెంపల్లో సన్ననిగుంటలు పడతాయి. కిశోర్ ఆచల్లని చూపులకోసమే, ఆవెన్నెల గుంటలకోసమే నిరంతరం తాపత్రయపడేవాడు."

## క

'రా! లోపలికి రా.'

కిశోర్‌హృదయమంతా ఆమూడు మాటలకోసమే పరితపించేది. అగాధమైన శూన్యాన్ని అప్రయత్నంగా దూసుకుపోతోన్న గుండుకుమల్లె ఆమాటలు సూటిగా అతని గుండెలకి తగిలేవి. ఆమాటల్లో ఏదో కలకాలం అవగాహనకాని వోమహత్తరశక్తి యిమిడుందనిపించేది. తనహృదయకుహరాల్ని విప్పి ఆప్యాయంగా సుస్వాగతమిస్తోన్న ఆవ్యక్తి అతని దృష్టిపథంలో నిరంతరం నివసించేది. ఆ మూడుమాటలకోసమే అతని బ్రతుకంతా. ఆమాటల్తోసహా అతనికి ఆకళ్ళు జ్ఞాపక మొచ్చేవి. ఆకళ్ళలోని ఆ ఆజ్ఞ—ఆచల్లనితనం—అబ్బా! అవన్ని యెప్పుడూ ఆతనికి మరుపుకురావు. అతని జీవితంలోని మంట ఆమె వొక్కచూపుతో నిర్మూలమైపోయేది. ఆ కళ్ళల్లోని ఆచల్లనితనం ఆతని జీవితాన్నంతా తారుమారుచేసింది. ఆ జీవితంలోని ఆ యెడతెగని ప్రయత్నం, ఆహృదయంలోని ఆతపన అవన్నీ లాగేసింది ఆ రెండుకళ్ళే.

కిశోర్ బి.ఏ. చదువుతుండగా వోమాటు రాజ్యమింటికెళ్ళాడు. రాజ్యం కిశోర్ మేనమామ రెండోభార్య. ఆతను చదువుకోసం కలకత్తా కెళ్ళిన కొద్దిరోజులకే ఆతని మేనమామకి పెళ్ళైంది. పరిక్షలు దగ్గరపడుతోండటంవల్ల అతను పెళ్ళికి వెళ్ళలేక పోయాడు. పెళ్ళైన రెండునెల్లకే అతను ప్లేగువల్ల చనిపోయిన వార్తకూడా తెలిసింది. పరిక్షలు మరీ దగ్గరపడుతుండటంవల్ల అప్పుడుకూడా కిశోర్ మేనమామఆఖరుచూపులకోసం వెళ్ళలేక పోయాడు. భర్త కాలంచేయడంతోటే రాజ్యాన్ని కలకత్తా తల్లిగారింటికి తీసికెళ్ళారు. దీనివల్ల కిశోర్‌కి ఎప్పుడూ రాజ్యాన్ని చూడటం తటస్థించలా. కాని సూర్యం అతనిమిత్రుడు తనబంధువు లెవరింటికో వోమాటు కిశోర్‌ని తీసికెళ్ళాడు. తరవాత తెలిసింది అది సూర్యంపినతండ్రి యిల్లని. రాజ్యం తనపినతండ్రికూతురని ఏదో సంధర్భంలో సూర్యమే చెప్పాడు కిశోర్‌కి. అతను బి.ఏ. చదువుతోండగా మొదటిసారి వాళ్ళతో పరిచయంకలిగింది. వాళ్ళు కిశోర్‌ని చాలా ఆదరించారు. రెండుమూడుసార్లు తప్పని

సరిగా సూర్యంతో కలిసి వాళ్ళింటికి వెళ్ళడం వల్ల రాజ్యం తన మేనమామభార్యని తెలిసి పోయింది కిశోర్‌కి.

మొదటిమాటు రాజ్యాన్ని చూడటంతోటే కిశోర్ హృదయంలో చలనం కలిగింది. అతనికి అర్థంకాని ఆవేదనేదో ఆతని జీవితంలో ప్రవేశించింది. అచల్లని చూపులు అతనికి తెలియకండానే ఆతనిదృష్టిపథంలో నిరంతరమూ నివసించడం మొదలెట్టాయి. తరచుగా ఆతను ఆయింటికి వెళ్ళడానికి అలవాటు పడ్డాడు. రామబ్రహ్మం-రాజ్యంతండ్రి-అక్కైఇంట్లో వుండేవాడుకాడు. ఆతని కెప్పుడూ యింటి గొడవే పట్టదు. ఇంట్లో యింకో ఆడదిక్కు లేకపోవడంవల్ల ఇంటిభారమంతా రాజ్యం పైన పడింది. పాపం రాజ్యం చిన్నపిల్ల అయినా తనకర్తవ్యాన్ని శాంతంగా నిర్వహించేది.

రాజ్యంలో అందంలేదు. ఆమెవి విశాలమైన కళ్ళుకావు. చప్పున ఆకర్షించే కోల ముక్కుకూడాలేదు. ఆ శరీరంలో గొప్ప అవయవాలసౌష్టవంకూడా లేదు. ఆమె ఆ చిన్నదిరొమ్ముకూడా యితరులని బాహాటంగా ఆకర్షించదు. కాని ఆమె తలవెంట్రుకలు మాత్రం చిన్ని కెరటాలు కడిగిన సముద్రపు నున్నని యిసుకకి మల్లె నొక్కులునొక్కులు పడివుంటాయి. ఆమె ముఖాన్ని యేదో పూజ్యమైన పవిత్రత, శాంతత ఆవరించి వుంటాయి. ఆమె చిరునవ్వు నవ్వినప్పుడల్లా ఆమెనున్నని వెన్నెలచెంపల్లో సన్ననిగుంటలు పడతాయి. కిశోర్ అచల్లనిచూపులకోసమే, ఆవెన్నెల గుంటలకోసమే నిరంతరం తాపత్రయపడేవాడు.

౩

'రా! లోపలికి రా.'

ఈమాటలే రోజూ యింటిముందరి పొగడ చెట్టు కమ్మని సౌరభాలతో ఉయ్యాల్లూగుతూ కిశోరికి స్వాగతమిచ్చేది.

వొనాటి సాయంత్రం కిశోర్ రామబ్రహ్మం యింటికెళ్లాడు. రామబ్రహ్మం యింట్లో లేడు. సన్నని మడిబట్ట చుట్టుకు రాజ్యం వొంట చేస్తోవుంది. రవిక వేసుకోకపోవడంవల్ల ఆ గుండ్రని స్థనాలు ఆవిశాలవక్షంలో స్వేచ్ఛగా విహరిస్తోన్నాయి. వాటి చలనంవల్ల పైబట్ట అమాంతంగా కదిలిపోతోంది. కిశోర్ దృష్టికూడా అటువేపే ఆనింది. రోజుల తరబడి బలవంతంగా హృదయపేటికలో అణచుకున్న భావాలన్నీ ఒక్కుమ్మడిగా రెక్కలు కట్టుకు లేచాయి.

'కాసిన్ని మంచినీళ్ళు.'

గ్లాసూ, చెంబూ తీసుకువిలాసంగా ముందుకు సాగుతోన్న ఆ ఆనందమయస్వరూపాన్నిచూచి కిశోర్ గుండెలు దడదడ కొట్టుకోవడం మొదలెట్టాయి. మిసమిసలాడుతోన్న ఆ నిండుయవ్వనం సమీపిస్తోన్నకొద్దీ ఆతనితల తిరిగిపోయింది. మేఘావృతమైన ఆ జీవితంలో మెరుపుకుమల్లె ప్రవేశించిన ఆతేజస్వినికోసం ఆతనిహృదయం తహతహలాడటం మొదలెట్టింది. ఏమైతేనేం—ఆ అమ్మాయే అతనికి కావలిసింది—ఆమెతోడిదే ఆతని లోకం—యెన్నడన్నా దయదలచి అనుగ్రహిస్తుందేమోననే ఆతను జీవచ్ఛవానికి మల్లె నేడు బ్రతికిఉండడం.

ఆమె అతన్ని సమీపించి, తాను మడిలో వున్నాననేస్థితి మరిచి నీళ్ళతో తొలికాడు

'అది ఎలాగయినా సాయపడుతుంది' అని పొట్టిమనిషి నెమ్మదిగా జారవిడిచాడు.

'మచ్చపెదిమిగల సన్నటిమనిషి భావరహితంగా చూసి 'వాళ్లు ఈలోయ దాటిపోరు, మనం వేగిరం స్వారిచేసి వెళితే—' అని తెల్లగుర్రంవైపు చూసి వూరుకున్నాడు.

వెండికళ్ళెం పట్టుకున్నమనిషి 'వెధవ తెల్లగుర్రాలు' అని తాను తిట్టిన గుర్రాలలోనే చేరిన ఆతెల్లగుర్రంవైపు చూశాడు.

పొట్టిమనిషి తన గుర్రంయొక్క చెవులమధ్య దృష్టినిలిపాడు. నిలిపి 'నాశాయశక్తులా చేశాను' అన్నాడు.

తక్కిన యిద్దరూ లోయవైపు కొంతసేపు చూశారు. సన్నటిమనిషి మండతో మచ్చపెదిమిమీద రాసుకున్నాడు.

..................................

పాత్రలు సజీవవ్యక్తులనీ, వారు సంచరించే ప్రపంచం యదార్థమైనదే అనీ అనుకున్నవారి రచనలో సంభాషణలు ఆమోాస్తరుగా వుంటాయి. ఇంక మన తెలుగువాఙ్మయంలోనే పేరుపొందిన ఒక ఆధునికకథకుని కథలోని చిన్నభాగం ఇక్కడ చూపిస్తాను.

...................... ..............

'ఆయనా. రెండుపంచలేవున్నట్టున్నాయి పాపం,'

'పొట్టి మొగమాటంమనిషిలాగ వున్నాడు రామచంద్రం. నిన్నరాత్రి విన్నావా జీతం యెంతకావాలో తేల్చమంటే యేమన్నాడోనూ ?'

'ముందు బట్టలు కొనిపెట్టండీ పాపం!'

'అయితే బజారుకివెళ్ళి నీకు నచ్చినవి కొని పట్టుకురా.'

'...............'

'హాస్యంకాదు.' నీకథలు అతను దిద్దిపెడుతున్నాడు. అతనికి నువ్వు బహుమతీ చెయ్యాలి.'

'.........'

'నీయిష్టంవచ్చినంత సొమ్ము పుచ్చుకుని బజారుకి-జానీకూడా వస్తుంది వెళ్లు.'

'.........'

'నుంచోకు మరి. అతను పంచెవుతుక్కుని ఆరేశాటప్పటికి నువ్వు బట్టలుతెచ్చి అతనికివ్వాలి. వెళ్లు మరి.

'.........'

'ఆబట్టలతో నాతోకూడా మోటారులో కూచోడానికి బిడియపడుతున్నాడతను. సేలంచాపులు తేవాలిసుమా.'

'పిన్నితోకూడా చెప్పండి.'

చెబుతానులే. నువ్వు సొమ్ముతీసుకురా.'

'.........'

'నీయిష్టం అన్నాను కాదూ.'

'.........'

'చొక్కాలుకూడా కుట్టించాలి సుమా.'

'.........'

...............

పై సంభాషణలో పాత్రలయొక్క స్పందనాలూ, చేష్టలూ ఎన్నో తెలపవలసి వుంది. అటువంటివి ఎన్నో తెలిపి రసవంతంగా రాయవలసిన ఈభాగంలో వట్టిచుక్కలుపెట్టి రసహీనం చెయ్యబడింది. పాత్రల సంభాషణాలను వట్టి పొడిమాటలుగా రాస్తే రసహీనంగా వుంటుంది. ఎంతో కొంత తెలియచెయ్యవలసి వుందని అవసరమున్నచోటా లేనిచోటా అతిచాదస్తంగా చెప్పవద్దు. కథలోని ఆసక్తి, వేగం తగ్గకుండా వీలైనంతమట్టుకే ఆ అంశాలు తెలియ చెయ్యాలి.

కథా[illegible]ల్పనను గురించి ఒక చిన్నసంగతి. ఒకకథకు[illegible] ఎంతముఖ్యమో, కథలకు వైవిధ్యం అంతముఖ్యం. ప్రేమ ఒక్కటే చిన్నకథకు ఆధారంకాదు. కథ ఎంతసేపూ సాంఘికంగా వుండాలనీ నియమంలేదు. కథకు పనికిరాని వస్తువేలేదు. శాస్త్రజ్ఞులూ, వర్తకులూ, దొంగలూ, విదేశయాత్రీకులూ, విదేశానుభవాలూ, భూతాలూ, దయ్యాలూ, పక్షులూ, జంతువులూ, నిర్జీవపదార్థాలూ అన్నిటినిగురించీ చిన్నకథలు రాయవచ్చు. అంతా కథకుని కల్పనలో వుంటుంది. చరిత్ర కథలనుగురించి ఏమిటంటే—చరిత్ర కథలు రాయడం బహుకష్టం. వెనకటి కాలపు మనుష్యుల జీవితం, పద్ధతులూ, ఆచారాలూ మొదలైనవి అన్నీ కళ్ళకు కట్టినట్టుగా వుంటేగాని చరిత్రకథలు రాయలేము. వెనకటికాలపు చరిత్ర ఆమూలాగ్రంగా తెలియచేసే గ్రంథాలు వున్నాయా? ఉంటే చరిత్రకథలు రాయండి.

నేనుచెప్పిన పై అంశాలు కథకులంతా సులువుగా ఆచరించగలిగినవే. సామాన్యకథకుడుగాని, గొప్పకథకుడుగాని వీటిని ఆచరించి కథావాఙ్మయాన్ని అభివృద్ధిచెయ్యవచ్చు. లోకపరిశీలన, కథలో మౌలికత్వం ఏ కథకునికీ నేర్పిపెట్టలేముగాని ఈ సామాన్య అంశాలు అందరూ ఆచరించవచ్చు. ఈ అంశాలను ఆచరించి కథకులు కథవాఙ్మయాన్ని వృద్ధిచేస్తారు గాక!

[ఈవ్యాసం 1935 సంవత్సరం ఏప్రిల్ నెలలో రచించబడింది.]

—టేకుమళ్ళ కామేశ్వరరావు బి.ఏ.,బి.ఇడి.





స్థాపితం. 1920.

# అత్యద్భుత కుష్ఠరోగనివారిణి

(రిజిష్టర్డు)

గుణములేదని ఋజువుచేయువారికి రు 500 లు బహుమానము.

**18** రకముల కుష్ఠులు, శ్వేతకుష్ఠు, తదితర చర్మవ్యాధులు యెంతకాలమునుండి జీర్ణించి యున్ననూ గ్యారంటీగా బాగుచేయబడును. 'అత్యద్భుత కుష్ఠరోగనివారిణి' యను దివ్యౌషధము వలన అనేకవేల రోగులు పూర్ణారోగ్యమును బొంది సంసారసుఖము ననుభవించుచున్నారు. చిరకాలమునుండి ప్రసిద్ధి కెక్కిన కంపెనీ రెడ్డికంపెనీయే. యింజక్షనులవలన ఫలితముపొందని రోగులనేకులు మాయొద్ద చికిత్సబొంది పూర్ణారోగ్యమును బడయుచున్నారు. పైవ్యాధులకేగాక శెగ, సవాయి, శుక్లనష్టము, మూర్ఛ, మూలశంక మొదలగువ్యాధులకు మాయొద్ద గ్యారంటీ ఔషధములున్నవి.

"నకలు మందులనుచూచి మోసపోకుడు"

పూర్తివివరములకు యీక్రింది యడ్రసునకు వ్రాయుడు.

| | | |
|---|---|---|
| గోపాలపురము పోస్టు (వయా) కొత్తపేట, తూర్పుగోదావరి జిల్లా. | రెడ్డి అండ్ కో (రిజిష్టర్డు) | బ్రాంచి ఆఫీస్: (కుష్ఠరోగ చికిత్సానిపుణులు) వాల్తేరు.ఆర్.యస్.పోస్టు. |

తోన్న గ్లాసును అందించపోయింది. ఆతనికి జీవనపు మాధుర్యపు నిగ్గునంతా బంగారు పాత్రలో పోసి అందిస్తోన్నట్టనిపించింది. కిశోర్ వొణికిపోతూన్న తన హస్తాన్ని గ్లాసువేపుకు సాగించాడు. అతనికి తెలియకుండా ఆచెయ్యి ఆమె మృదుమధురహస్తాన్ని గట్టిగా నొక్కిపట్టుకుంది. ఆతని గందరగోళమంతా ఆమెకి విశదంగా అర్థమైంది.

మెల్లగా ముఖాన్ని పైకెత్తి ఆ చల్లని దృక్కుల్ని ఆతనిపైని వొకమారు సారించింది. ఆచూపుల్లోంచి వొకమహత్తరశక్తి బయల్దేరి కిశోర్ కళ్ళగుండా ఆతని శరీరమందుప్రవేశించి, వొక్కమారు గట్టిగా ఆతనిశరీరాన్నంతా వొక్కవూపు వూపేశింది. పాడుకలగని మేల్కాంచిన రోగికిమల్లె, స్త్రీకన్నా గొప్పగా ఆక్రందనంచేస్తూ అట్లానే ఆమె పాదాలమీద తెప్పరిల్లి పడిపోయాడు.

౮

కిశోర్ జీవితమందు ఏదో వొక గొప్ప మార్పు కలిగింది. జీవితంలోనిఉత్సాహం యెండ కాలపు నీడకు మల్లె తరలిపోతోందని ఆతనికి స్ఫూడా అవగాహన అయింది. కారణంకోసం పరిపరివిధాలా ఆలోచించాడు. యెందుకోసమో జీవితంలో నైరాశ్యం, నిస్పృహ కలిగింది. భౌతికప్రపంచపు ప్రతివస్తువపై అసహనభావమూ, రోత కలుగుతోంది. శరీరం అసహ్యపు మాంసముద్దని; అది కామ, క్రోధ, మద, మత్సరాలకి వునికిపట్టని యిల్లాంటివే యేవేవో పిచ్చిభావాలన్నీ ఆతని మస్తిష్కమందు రేకెత్తుతోన్నాయి. ఈదుష్టప్రపంచాన్నంతా వొదిలి యెక్కడికో, యే నిర్మానుష్యమైన ప్రశాంతస్థలానికో, వెళ్ళిపోవాలనిపించేది ఆతని ప్రాణానికి.

అబ్బా! రెండుసంవత్సరాలక్రితం ఆతనెట్లా కాలంగడిపేవాడని! అబ్బా—ఎన్నిపుస్తకాలు చదివేవాడని! పగలనకా, రాత్రనకా యెప్పుడూ చదువుతోనే వుండేవాడు. చదువరి తనవ్యక్తిత్వాన్నంతా అమూల్యగ్రంథాలందు లీనంచేసి మిగిలిన అస్తిత్వాన్ని ఆగ్రంథాలందలి ఏపాత్రయందన్నా లీనంచేసి తన్మయత్వం పొందడం యెంత సుఖప్రదాయకం! ఆరోజుల్లో ఆతని హృదయవీణయొక్క తంత్రులు ప్రతిచిన్నమీటుకి యెట్లా ఆప్యాయంగా ఘోషించేవని. ప్రతిచిన్నవిషయం, శాశ్వతంగా చెరపడానికి వీలులేకుండా చిత్రించుకుపోయేది ఆతనిహృదయకుహరమందు. అబ్బా! ఆరోజుల్లో యెన్నెన్ని ప్రేమగీతిక లల్లాడని. యెన్నెన్ని ప్రేమకథలు రాశాడని. ఆరోజుల్లో అతనికీర్తి నలుగడల యెంతని మారు మ్రోగింది. ఆధునికకవులందరూ ఆతన్ని కవిత్వానికి ఆదర్శంగా పెట్టుకొని యెంతెంత కీర్తించారని. అబ్బా! ఆరోజులన్నీ మటుమాయమైపోయాయి. ఆరోజులందు ఆతన్ని దేవేంద్ర సింహాసనాన్ని అధిష్టింపజేసిన కవిత్వం ఈ రోజులందు ఒక్క స్త్రీహృదయఫలకమందు ఆతనిపట్ల వున్నతభక్తినీ, ప్రేమనూ వెలిగించలేక పోయింది.

అబ్బా!—కాలమహిమ

౯

కిశోర్ జీవితం దుర్భరమైపోయింది.

'రా! లోపలికి రా' అన్నమాట లెప్పుడూ ఆతనిచెవులందు గింగురుమనడం మొదలెట్టాయి. జీవితమందు ఆశ, వుత్సాహమూ అన్నీ నశించిపోయాయి. బ్రతుకంతా వొక యెడతెగని బాటలా, అగాధమైన ఎడారిలా కనపడటం మొదలెట్టింది.

సాహానాడు కిశోర్ ఏమీఆలోచక పోవడంవల్ల తిన్నగా సినిమాహాలుకు బయల్దేరాడు. ఫిలిం మొదలయ్యేందుకు అట్టే వ్యవధి కూడాలేదు. హాలుపద్ద బొమ్మలుచూస్తోండగా రాజ్యం, ఆమెతండ్రి కనపడ్డారు. ఫిలిం చూచేందుకు వెడుతున్నారని తెలిసింది. చప్పున బుక్కింగుఆఫీసుదగ్గరికెళ్ళి రామబ్రహ్మాన్ని ఆపి కిశోర్ మూడు సోఫాటిక్కెట్లు కొన్నాడు. కిటికీలోంచి గిరవాటువేసిన టిక్కెట్లని అందుకొని మేడమీదికి వెడుతుండగా ఫిలిం మొదలైంది.

హాల్లో అంతా చీకటిగావుంది. చేతితో తడుముకొంటూవెళ్ళి సోఫాలో రాజ్యం, అతనూ కూర్చున్నారు. చోటులేకపోవడంవల్ల రాజ్యంతండ్రి వెనకాల యింకోసోఫాలో కూచున్నాడు. సుస్వాగతమన్నట్లు సోఫాస్ప్రింగులు కిరకిరలాడాయి.

ఫిలింపేరు 'పెయింటెడ్ వీల్.' గ్రేటాగార్బొ కథానాయిక. కథ చాలా బాగావుంది. కథేకాదు, డైరెక్షన్, ఫొటోగ్రఫయింకా మిగిలినవన్నీ కూడా బాగానేవున్నాయి. గార్బొ నటన, లిప్‌స్టిక్ యాక్టింగు, ఆ కళ్ళ తిప్పులూ— ప్రేక్షకు లందరిలో గొప్పవుద్రేకాన్ని రేకెత్తించింది. పిలిచి స్నేహంచేసుకునే ఆపెదిమెలు, ఆకోరచూపులు, ఆఉద్రేకపూరితమైన ప్రియులసంభాషణ కిశోర్‌ని కూడా వొక్కవూపు వూపేశాయి. ఆపొళ్ళు తెలియని దూకుడులో ఆతను తనసమస్తాన్ని మరిచి రాజ్యాన్ని ఆజానుబాహువులందు బంధించి ఆమె వెచ్చనిపెదిమల్ని తన వొణుకుతోన్న పెదిమల్తో గట్టిగా, వూపిరి తెమలకండా వొత్తాడు. భీషణమోహప్రజ్వలితములైన ఆరెండు నిమిషాలు రాజ్యం తెప్పరిల్లిపోయింది. ఆ ఆనందమయక్షణికసుఖస్పృశనుంచి ఆభ్రాంతిపాటున మేల్కొని సూటిగా ఆతని కళ్ళల్లోకి చూచింది. ఆమె తీవ్రదృక్కులు మోహపారవశ్యాన్ని మేళవించేందుకు ఉవ్విళ్ళూరుతోన్న కిశోర్ హృదయాన్ని వొక్కమారు కలిచివేశాయి. అబ్బా! ఆ చూపులందు ఏదో వొహాఅద్భుతశక్తి యిమిడుంది. నిమేషకాలమైనా కిశోర్ ఆమెకళ్ళల్లోకి ఏకాగ్రంగా చూడలేకపోయాడు. ఆ కళ్ళల్లోంచి విద్యుల్లతలు బయటపడి సూటిగా కిశోర్ కళ్ళలోకి ఆమసకచీకటిని దూసుకొంటూ వెళ్ళాయి. కళ్ళు తిరిగిపొయినాయి. తల క్రిందికి జారింది.

౮

రెండునెల్లు గడిచాయి.

సాహానాడు కిశోర్ తనగదిలో బల్లముందు కూచుని అవసరమైన కాగితాలేవో చూచుకొంటూండగా రాజ్యం అవసానకాలంలోవుందని రామబ్రహ్మంగారి నౌకరొచ్చి చెప్పాడు. జబ్బుసంగతడిగితే నిమోనియా అని చెప్పాడు. కిశోర్ ఏమీ ఆలోచించకుండా చప్పున కోటేసుకొని మెకానికల్‌గా బయల్దేరాడు. ఎక్కడికెడుతున్నాడో ఆతనికే తెలియదు. కాళ్ళుమాత్రం ముందుకు సాగుతోన్నాయి. మెట్లూనో టాంగా అద్దెకు కుదుర్చుకొని 'టాంగావాలా'కి రాజ్యంయింటిపత్తా చెప్పాడు. గుఱ్ఱం అతివేగంగా పరుగెత్తుతున్నా బండిమెల్లగా అడుగులో అడుగేసుకొంటూ వెడుతోన్నట్టనిపించింది కిశోర్‌కి. చివరకి భగీరథప్రయత్నంవల్ల యిల్లుచేరుకుని రాజ్యంపడుకున్న గదిగుమ్మంలోకి ప్రవేశించాడు.

'రా! లోపలికి రా'

అబ్బా! మళ్ళీ ఆశూన్యనికుంజంలోని సుస్వాగతమే!

తడబడుతోన్న కాళ్ళతో లోపల ప్రవేశించి వొళ్ళు తెలియని దూకుడుతో రోగి మంచాన్ని సమీపించి ఆమెమరణశయ్యలో జేర్లగిల పడ్డాడు.

రోగి మెల్లగా కళ్ళువిప్పింది.

ఆనందం—కిశోర్‌కి ప్రపంచమంతా పరమానందమయంగా తోచింది. తనరాజ్యం తనకోసం మళ్ళీవోహమాటు కళ్ళువిప్పింది. వొళ్ళు తెలియని ఆనందం—అట్లానే అమాంతం రోగిపైకి వొరిగి ఆకళ్ళని, ఆచెంపల్ని, ఆచెంపలలో సన్నని గుంటల్ని యితరులు గమనిస్తోన్నారనికూడా లెక్కచేయకుండా ముద్దెట్టుకున్నాడు. ఆవెచ్చనివూపిరికి రోగి మళ్ళీ వోహమాటు కళ్ళువిప్పింది. నిశ్చలంగా, సూటిగా రాజ్యం ఆఖరుసారి కిశోర్‌కళ్ళలోకి చూచింది. కిశోర్ కళ్ళు ఆకళ్ళలోని తీవ్రతని ఓర్చలేక చెమ్మగిల్లిపోయినాయి. స్త్రీకన్నా ఎక్కువగా ఆక్రందనంచేసి రోగిపైన అట్లానే పడిపోయినాడు కిశోర్........మరుక్షణంలోనే అతని ప్రేమప్రాభృతానికి, జీవితంలోని యెడతెగని మంటకి శాశ్వతమైన అంతం...

..................

రెండేళ్ళు గడిచాయి.

వోహమాటు కిశోర్ తనగదిలో బల్లముందు కూచుని తనతలని చేతుల్లో దూసుకు యేవో ఆలోచనలలో మునిగిపొయ్యాడు. మెల్లగా కిశోర్‌భార్య, గదిలోకి ప్రవేశించింది. తనభర్తని అట్లాంటిస్థితిలో చూచి ఆమెహృదయం తరుక్కుపోయింది. ఆతన్ని అట్లాంటిస్థితిలో చూడటం ఆమె కిది మొదటిసారికాదు. మెల్లగా అతన్ని సమీపించి తనవ్రేళ్ళని సాదరంగా అతని క్రాపులోంచి పోనిచ్చి అతనితలని పైకి లేవనెత్తింది.

హృదయంలోని తత్తరపాటుని సూచిస్తోన్న చేతుల్ని మరీగట్టిగా పిండుకోంటూ 'చెప్పరూ! మీ హృదయంలో ఏంబాధో!'

'...............'

కిశోర్‌కి తనబాధంతా భార్యతో చెప్పెయ్యాల్లనిపించింది. కాని తనేమిబాధ అనుభవిస్తున్నాడని? ఏమీ లేదే! మరి చెప్పివెయ్యడమేమిటి?

తలెత్తి తనదృక్కుల్ని భార్యపై నెమ్మదిగా ప్రసరించాడు.

అశ్రుపూరితనయనాలతో

'అబ్బా! మీలో యెదో గొప్ప పరివర్తనం జరిగింది. మీనడకలో, మీశరీరంలో, చివరకి మీచూపుల్లోకూడా అంతామార్పే.'

కిశోర్ అశూన్యదృక్కులతోనే, అశూన్యహృదయంతోనే 'మార్పు! మార్పు! మార్పు!' అని మూడుసార్లు అస్పష్టంగా గొణిగి మేజా 'డ్రాయర్' లాగాడు. తడబడుతోన్న చేతులతో 'డ్రాయర్' నుంచి రెండుఫోటోలు పైకితీసాడు. దాంట్లో ఒకటి తనది, రెండోది రాజ్యంది.

రెండింటిని కిశోర్ బాగా పరికించి 'అవును, మార్పు-గొప్పమార్పు. ఈ ఫోటోలో కూడా గొప్పమార్పు కలిగింది. అబ్బా! ఆమె కళ్ళల్లోని, ఆతేజస్సు, ఆకాంతి, ఆ తీవ్రత నాఫోటోలోకి యెల్లా వొచ్చాయి?

రెండు ఫోటోల్ని కిశోర్ మేజాపై గిరవాటువేసి ఆగదిలోనే బీరువా నానుకొని వున్న నిలుటద్దందగ్గిరికి చప్పున పరుగెత్తి వెర్రిగా తన ప్రతిబింబాన్ని ఏకాగ్రంగా అవలోకించి మార్పు, మార్పంటూ బిగ్గరగా కేకేసి పరధ్యాన్నంగా కూలబడ్డాడు—అట్లానే—ఆనిలువుటద్దం పక్కనే—

—భాస్కరభట్ల కృష్ణారావు.

## భారతదేశ సంస్థల ప్రోత్సాహింపుడు

సల్పప్రీమియములు | ప్రత్యేకసౌకర్యములు | ఆధునిక పద్ధతులు.

1. 'ఏ' మొదలు 'జడ్' వరకు గల స్కీములు, 2. బిడ్డల విద్యావివాహముల స్కీము, 3 సమిష్టి జీవితభీమా, 4 స్త్రీలభీమా, 5. యావజ్జీవితపు ఫించను ఏర్పాటు, 6. భార్యాభర్తల జాయింటు లైఫ్ స్కీము ప్రత్యేకసౌకర్యము.

అదియు నిదియు అననేల ? వీరువారననేల ? ఎల్లరకును అందుబాటులోనున్న జీవితభీమాపాలసీని పొంది మీపోష్యవర్గమును పోషింపుడు.

కంపెనీ ఆర్థికస్థితి గాంచనగును.

గవర్నమెంటు సెక్యూరిటీ రు 2 లక్షలు.
జీవితమూలనిధి రు 6 ,,
చెల్లించిన క్లెయిములు రు 14 ,,
1933-34 లో చేసిన వ్యాపారము రు 35 ,,

ధారాళమైన కమీషన్, వేతనములపై పలుకుబడిగల ఏజెంట్లు కావలెను.

ఇట్టి విశేషసౌకర్యములు కలవు కాన నేడే వివరములకు సూపరింటెండెంటు

### ది వీనస్ అష్యూరెన్సు కంపెనీ, (ఢిల్లి)

The Venus Assurance Company Ltd., Delhi.

బ్రాంచి ఆఫీస్ : 22, సెకండులైను బీచ్, మదరాసు.

లేక మీకు సమీపమునగల ఏ బ్రాంచి ఆఫీసుకైన వ్రాసి తెలిసికొనుడు.



## ఐరావతి

లక్ష అరువదివేల బర్మాఆంధ్రుల క్షేమాభివృద్ధులకు ప్రతి శనివారము వెలువడు ప్రజాహిత పత్రిక. 7 సంవత్సరముల నుండి బర్మాఆంధ్రుల శ్రేయోభివృద్ధికై పాటుపడుచున్నది. ఇది ఆంధ్రులకు అండ. కార్మికులకు పట్టుకొమ్మ. యువజనోద్యమమునకు ఉనికి. నిర్మొగమాటముల నిప్పు. అన్యాయముల నంతరింపజేయుటకు బ్రహ్మాస్త్రము. అంతర్యమెరిగినవారికి హాయి, చదివినవారికి మిఠాయి.

సంవత్సరపు చందా రు 3. పై గ్రామస్థులకు రు 3-12-0.

చిరునామా :

ఐరావతి పత్రికా కార్యాలయము, 233 బార్ స్ట్రీట్, రంగూను. (బర్మా.)

# 'మామిడిచెట్టు కప్పల్ని కాస్తే'

తనగదిలో ఒకమూలనుంచి యింకొక మూలకి పచారుచేస్తూ, ముసలిషాహుకారు పదిహేనుసంవత్సరాలక్రితం జరిగిన ఒక సంగతినిగూర్చి జ్ఞప్తికి తెచ్చుకుంటున్నాడు...

అప్పుడు, తన పుట్టినరోజున, ఒకగొప్ప విందు చేశాడు. ఆవిందుకి అతని స్నేహితులంతా వచ్చారు. అనేకవిషయాలు ప్రస్తావింపబడ్డాయి. అతిథులు ఉరిశిక్షని గురించి ప్రసంగంలోకి దిగారు. కొందరు ఉరిశిక్షని నిరసించారు. ఇంకాకొందరు ఉరిశిక్ష బదులు జన్మాంతపుఖైదు విధిస్తే ఫరవాలేదన్నారు. షాహుకారన్నాడు :—

ఉరిశిక్షన్నా, జన్మాంతపుఖైదన్నా నాకు అనుభవంలేనిమాట నిజమేగాని ఉరిశిక్షే నీతిమార్గాన్ననుసరించి మంచిదని నా అభిప్రాయం. ఉరిశిక్ష మనిషి ప్రాణాన్ని ఒక్కసారి లాగేస్తుంది. అంతే. జన్మాంతపుఖైదు ప్రాణాన్ని క్రమక్రమంగా పీల్చి పిప్పి చేస్తుంది. ఇంకోఅతిథి అన్నాడు :—

నన్నడిగితే, రెండుశిక్షలు కూడా దుర్మార్గాలే అంటాను. ఎందుచేతనంటే రెంటి ఉద్దేశముకూడా ప్రాణం తీసివెయ్యడమే. రాష్ట్రమంటే భగవంతుడుకాదు. అందుచేత తానుమరల యివ్వాలిఅని తోస్తే యివ్వలేని ప్రాణాన్ని తీసివెయ్యడానికి రాష్ట్రానికి హక్కులేదు—అని.

అతిథులలో 25 ఏళ్లుగల ఒక న్యాయవాది ఉన్నాడు. అత డిల్లా చెప్పాడు :—

ఉరిశిక్ష, యావజ్జీవపుఖైదు కూడా చెడ్డవే. కాని, ఈ రెండింటిలోను యావజ్జీవపుఖైదు మంచిదని నా ఉద్దేశము. జీవించకపోవడంకంటె, ఎట్లాగో జీవించడం మంచిది కాదూ?

చాలసేపు వాగ్వాదాలయ్యాయి. అప్పుడు యువకుడుగా ఉన్న షాహుకారు కోపమాపుకోలేక, ప్లీడరువంకతిరిగి :

'నీవు చెప్పేది ఒట్టి అబద్ధము. ఖైదులో నీవైదేళ్లుంటే 20 లక్షలు ఓడుతాను.'

'వేళాకోళంకాదు, పదిహేనుఏళ్లుంటాను. —పందెంకలుపు' అన్నాడు ప్లీడరు.

"సరే, పదిహేనుఏళ్ళకి ఒక్కయిదు నిముషాలు తక్కువగా ఉన్నప్పటికి ఒక్కదమ్మిడీ యివ్వను" అన్నాడు షాహుకారు.

షాహుకారుతోటలోనే, అతని అదుపులోనే ప్లీడర్ని ఒక కొట్టులో బంధించి తలుపులకి సీళ్లువేశారు. ఆగదిదాటడానికి గాని, ఎవరితోనూ మాట్లాడడానికిగాని వీలులేదు. ఉత్తరాలు పత్రికలు చూడడానికి వీలులేదు. అత డితరులకి వ్రాయవచ్చునుగాని, యితరు లతనికి ఏమీ వ్రాయకూడదు. వాయించుకోవడానికి ఒకవీణ, చదువుకోవడానికి పుస్తకాలు, వ్రాయడానికి ఉత్తరాలు, సిగరెట్లు యిచ్చేడు షాహుకారు. ఆకొట్టులోని ఒక చిన్నకిటికీద్వారా చీటీవ్రాస్తే పుస్తకాలిస్తారు. ఇట్లా ఏకాంతముగా నవంబరు 14-1870, తెల్లవారి 5 గంటలు మొదలు—నవంబరు 14-1885 తెల్లవారి 5 గంటలవరకు గడపాలి. ఒక్క రెండు నిముషాలు ముందు గదివదిలినా షాహుకారు దమ్మిడి యియ్యనక్కర్లేదు.

ప్లీడరు వ్రాసిన ఉత్తరాల్నిబట్టి మొదటి సంవత్సరం అతనికి విసుగుతోచినట్లు కనబడు

తుంది. పగలు రాత్రి విరామములేకుండా వీణవాయించాడు. రెండవసంవత్సరం వీణ ఆగిపోయింది. రామాయణం, భాగవతం మొదలైన పురాణాలు తెప్పిస్తున్నాడు. ఐదవ సంవత్సరం మరల వీణ వినబడింది. సిగరెట్లు ఎక్కువగా కాల్చాడు. తినడం, పడుకోడం, ఏదో కోపంగా తనలో తాను మాట్లాడుకోడం మొదలుపెట్టాడు. పుస్తకాలు ముట్ట లేదు. చాలసార్లు ఏడ్చినట్లుకూడా వినబడింది.

ఆరవసంవత్సరంఅన్ని భాషలు, వేదాంతం, చరిత్ర ప్రారంభించాడు. కోరిన పుస్తకాలివ్వ లేకపోయాడు షావుకారు. నాలుగేళ్ళలో ఆరువేల పుస్తకాలు చదివేశాడు. షావుకారికి ఒక ఉత్తరంవ్రాశాడు :—'నేను ఆరు భాషలలో వేదాంతంవ్రాశాను. ప్రముఖులకి చూపించి వారు నావ్రాత బాగున్నదని చెప్పినట్లైతే, ఒక తుపాకి పేల్చవలసింది. సంతోషిస్తాను. నాకిక్కడ ఎంతో హాయిగా ఉన్నది'—అతనికోర్కె నెరవేర్చబడ్డది.

పదకొండు, పన్నెండవ ఏళ్ళలో కుర్చీమీద కూర్చుని భగవద్గీతతప్ప మరేమీ ముట్ట లేదు. తరువాతి మూడుసంవత్సరాలు మళ్ళా అన్ని పుస్తకాలు తిరగవేశాడు.

ఇంకొక్కరోజుతో పదిహేను సంవత్సరాలు నిండుతాయి.

ఈసంగతులన్నీ జ్ఞాపకం తెచ్చుకొని షావుకారు అనుకున్నాడు:

"రేపు 5గంటలకి ప్లీడరుపిశాచాన్ని వదిలెయ్యాలి. 20 లక్షలు నేను ఇవ్వవలసి వస్తుంది. తర్వాత ముష్టెత్తుకోవాలి. వెధవ పందెం, ప్రపంచాన్ని ఉద్ధరిస్తుందా, ఏడుస్తుందా? ప్రభుత్వమెట్లాగు శిక్షాస్మృతి మార్చదు... ఎందుకు చచ్చాడు కాదు వీడు?...నాడబ్బుతో వాడు హాయిగా పెళ్లిచేసుకుని కులాసగా ఉంటే నేను ముష్టెత్తుగోనా? నామీద దయదలచి వా డేమైనాయిస్తే బ్రతకవలసి వస్తుందేమో? ఏమైనాసరే, వాణ్ణి బతక నివ్వను..."

గడియారం రెండుకొట్టింది. ఇంకో మూడు గంటలలో ప్లీడరు పైకివస్తాడు. ఖైదీగదితాళముతీసుకొని షావుకారు బయలుదేరాడు. బంట్రోతుని పేరుపెట్టి పిలిచాడుగాని సమాధానం లేదు. అనుమానం బంట్రోతుమీద ఉంటుందనుకున్నాడు. తిన్నగా జైలుకిటికీ దగ్గరకి వెళ్లి లోపలికిచూచాడు.

దీపం సన్నంగా వెలుగుతోంది. ఖైదీ బల్లముందు కుర్చీలో కూర్చునిఉన్నాడు. వీపు మాత్రం కనబడుతోంది. నేలమీద పుస్తకాలు చెల్లాచెదరుగా పడిఉన్నాయి. షావుకారు 10 నిముషాలు అల్లా నిలబడి చూచాడు. పదిహేనుఏళ్ళనుంచి కలిగిన అనుభవంవల్ల ఖైదీ అల్లానే కదలక కూర్చున్నాడు. ఉంగరముతో కిటికీతలుపుమీద షావుకారు కొట్టాడు. ఖైదీ కదలలేదు.

షావుకారు జాగ్రత్తగా తలుపుతీశాడు. తుప్పుపట్టిన ఇనపబందులు 'గర్' మని చప్పుడుచేశాయి. ఖైదీ కదలలేదు. బల్లముందు ఎముకలవరకు దిగుకుపోయిన పాలిపోయిన చర్మంతో, పొడుగుపాటి జుట్టు గడ్డంతో ఖైదీ కన్పడ్డాడు.

"పిచ్చిముండావాడు, 20 లక్షల డబ్బుని గురించి కలగంటున్నాడు కాబోలు. వీక నొక్కేసి పరుపుమీద పడుకోపెట్టితే మామూలుగానే చచ్చిపోయాడనుకుంటుంది మాయలోకం" అనుకున్నాడు షావుకారు. బల్లమీద తెల్లకాగితమేమిటా అని చూ

చాడు—అది షాహుకారుకి వ్రాయబడ్డది. దానిలో ఇల్లా ఉంది :—

"రేపు పగలు 5 గంటలకి నాకు స్వేచ్ఛ వస్తుంది. ఈగది వదిలేముందు నీకోసంగతి తెలియపర్చాలి.

భగవంతుడు సాక్షిగా నాకు స్వేచ్ఛఅనినా, జీవితమనినా, జీవితంలోని సౌఖ్యాలనినా ద్వేషిస్తున్నాను. నీడబ్బు ఒక లెక్కా ?

పదిహేనుసంవత్సరాలు మనుష్యులతో కలసి ఉండకపోయినా, నీవు పంపిన పుస్తకాలనిబట్టి ప్రపంచపుతీరు అంతా కనిపెట్టాను; ప్రపంచమంతా చూచాను, దేవతల్ని చూచాను, దెయ్యాల్ని చూచాను.'

నీ పుస్తకాలు నాకు జ్ఞానం ప్రసాదించాయి. నాచిన్నిబుఱ్ఱలో ప్రపంచంలోని జ్ఞానమంతా యిమిడిఉన్నది. మీ అందరికంటె నేను జ్ఞానవంతుణ్ణి.

ప్రపంచమంతా మిథ్య; నీవు పంపిన పుస్తకాలు, వాటిని వ్రాసిన కవులకీర్తి, యిక ముందువచ్చే సకలముకూడా మిథ్య.

నీవు పిచ్చివాడవు. అన్యాయాన్ని న్యాయంగాను, కురూపమును సౌందర్యముగాను తలుస్తున్నావు. మామిడిచెట్లు కప్పల్ని కాస్తే నీకెంత గాబరాగా ఉంటుందో, నిన్ను చూచి నేను అంత గాబరాపడ్తున్నాను. నీవంటే నాకసహ్యం. నీవంటే నాకెంత అసహ్యమో చూపించడానికి నీవు నాకిస్తానన్నటువంటి, నేను స్వర్గమని ఒకప్పుడు తలచినటువంటి 20 లక్షలని తృణీకరిస్తున్నాను. ఆడబ్బు మీద నాకుగల హక్కు వదులుకున్నట్లుగా రేపు 5 నిముషాలు ముందు ఈగది విడిచి పోతున్నాను.

ఈసంగతి నీకొక్కడికే తెలియగలందులకు ఈ ఉత్తరం వ్రాశాను. నే నెవరితోను ఈసంగతి చెప్పదలచుకోలేదని వేరే చెప్పవలెనా ?"

ఈ ఉత్తరం చివరికి చదివేసరికి షాహుకారుకి కళ్ళవెంబడి నీళ్లుకారాయి. నిద్రపోతున్న ఆత్యాగమూర్తిని ఒక్కసారి ముద్దుపెట్టుకొని కాగితము జేబులో పెట్టుకొని ఇంటికి పోయి పండుకున్నాడు.

5 గంటలకి 5 నిముషాలు ముందుగా గది వదలి పైకి వెళ్ళిపోయాడు ప్లీడరు.

నియమము తప్పాడు కాబట్టి పందెము డబ్బు యివ్వనక్కరలేదని షాహుకారు వెల్లడి చేశాడు.

(అనువాదము.)

—మలపాక వెంకటాచలపతి, బి.ఏ.

ఆంధ్రజ్యోతి

మోల్మేన్—వారపత్రిక

సాలు చందా రు 3. విడి పత్రిక 9 పైసలు.

బర్మాలోని 1,60,000 ఆంధ్రుల క్షేమానికి పాటుబడుచున్న వారపత్రిక. ఇందు కార్మిక, సాంఘిక, రాజకీయ, వాణిజ్య విషయాములు నిష్పాక్షికముగ చర్చించబడును. దీనికి బర్మాఅంతట ప్రచారము గలదు. వర్తకులు తమ సరకులను ప్రకటించిన మంచి లాభము పొందగలరు.

వివరములకు :—

ఎడిటర్, "ఆంధ్రజ్యోతి"
185, లోవర్ మెయిన్ రోడ్డు,
మోల్మేన్—అని వ్రాయుడు.

# ఆంధ్రభూమి బుక్కుడిపో—వేపేరి, మదరాసు

## విపంచి — 80 పుటలు — నాలుగు అణాలు.

తన మృదుమధురరచనములచే నవ్యాంధ్రభారతిని సేవించుచున్న యువకవులలో నొకరగు శ్రీయుత బొడ్డు బాపిరాజుగారి సుమధురకావ్యముల సంపుటి. పత్రికలు, ప్రముఖులు విశేషముగ కొనియాడినది. ముద్దుల కూర్పు. రసముల ఊట. పాలవెల్లని ఆంటిక్ కాగితములు. నాలుగైదు రేఖాచిత్రములు. మొత్తమున కొక అందముల బరిణె

## వైద్యయోగరత్నావళి — 382 పుటలు — రెండు రూపాయిలు.

మద్రాసు సెంట్రల్ బోర్డు ఆఫ్ ఇండియన్ మెడిసిన్ మెంబరు బ్రహ్మశ్రీ పండిత ములుగు రామలింగయ్యగారిచే సంపాదితము. ఇందు గవర్నమెంటు **1929** వ సంవత్సరపు జీ. ఓ. **2411** నెంబరు గల పుస్తకమందు సర్వప్రక్రియములను చేయుపద్ధతి వివరముగ వ్రాయబడినవి. సాంప్రదాయ యోగములు, అవసరమైన పరిభాష చేర్చబడినవి. ఆయుర్వేద మెడికల్ ఆఫీసర్లకు, ఫార్మసీల వారికి మిక్కిలి ఉపయోగమైనది. చాల పరిశ్రమచేసి వ్రాసిన గ్రంథము. ఇండియన్ మెడికల్ స్కూలు ప్రిన్సిపాల్ శ్రీయుత వైద్యరత్న కెప్టెన్ జి. శ్రీనివాసమూర్తి గారి పీఠికతో అలరారుచున్నది. చక్కని గ్లేజు కాగితములు.

## రామప్రియ — 150 పుటలు — పండ్రెండు అణాలు.

ప్రసాదమైన హాస్యమునకు పేరుకెక్కిన తోట కృష్ణమూర్తి (బి. ఏ యల్. టి) గారిచే సులభశైలిని వ్యావహారికభాషలో వ్రాయబడిన స్వతంత్రకల్పనాకథలపుస్తకము. 'కథలు మిక్కిలి ముచ్చటలూరుచున్నవి' అని పత్రికారాజమగు భారతి, 'హాస్యరసగర్భితము' అని విశేషప్రచారము గల వినోదిని పత్రికయు ప్రశంసించినవి.

## తర్కసంగ్రహము — పోకెట్ సైజ్ — ఒక రూపాయి.

తర్కశాస్త్రపారంగతుడగు అన్నంభట్టు సులభార్థబోధకముగ సంస్కృతములో రచియించిన గ్రంథమునకు ఆంధ్రతాత్పర్యమును రచించి చరకమతదీపికాఖ్యాయుర్వేదమతవివరణముతో ఆయుర్వేదాచార్య డాక్టరు ములుగు విశ్వేశ్వరశాస్త్రి, యల్.ఐ.యమ్.; హెచ్.పి.ఐ.యమ్. గారు వెలువరించియున్నారు. ఆయుర్వేదమునకు అత్యావశ్యకమైన పదార్థవిజ్ఞానపటముకూడ కలదు. ఆయుర్వేదానుబంధముతో వ్రాయబడిన ఈగ్రంథము ప్రతి ఆంధ్రాయుర్వేదవైద్యునకు ఎంతయు ఉపకరించుటయే గాక ఆంగ్లలాజిక్ విద్యార్థులుకూడ చదువతగినది.

## కామశాస్త్రము — 150 పుటలు — ఒక రూపాయి.

ఇది వాత్స్యాయన మహర్షి సంస్కృతభాషలో వ్రాసిన సూత్రములకు కొత్త సత్యనారాయణ చౌదరిగారు గావించిన చక్కని తేటతెల్లమగు తెలుగుసేత. శైలిలో అమ్ముడు పుస్తకాలవంటిది కాదు. సరియైన శాస్త్రగ్రంథము. కామపురుషార్థమునకుగల ప్రాముఖ్యము, ప్రాభవము ఇది చదివినచో తెల్లమగును.

# ఇటలీ రాజు ఇమాన్యూల్ మౌనవ్రతము

ఇటలీ అబిసీనియాపై దండయాత్ర సాగించుచున్నది. యుద్ధవార్తలందు ఇటలీమంత్రి ముసోలినీని గూర్చియే ఎప్పుడును వినుచున్నాము. ఇటలీరాజు ఇమాన్యూయల్‌ను గూర్చి ఒక ముక్కయేని వినిపించుటలేదు.

అబిసీనియాదండయాత్రను గూర్చి అతని అభిప్రాయమేమి? యుద్ధము ప్రారంభించుటకు పూర్వమును తరువాతనుగూడ ఎన్నియో ఇటాలియన్ సైనికదళములు ఇటలీ నుండి అబిసీనియాకు వెడలియున్నవి. అందలి ఒక్కదళమునైనను ఇటలీరాజు ఇమాన్యూల్ సింహావలోకనము చేయలేదు. ఇటలీ అబిసీనియా యుద్ధమునుగూర్చి ఆతడొక్కవాక్యమునైనను ఉచ్చరింపలేదు.

ఈ మౌనవ్రతమునకు కారణమేమి? ఆతడు యుద్ధమనిన భయపడు పిరికిపందయా? కాదు. ముమ్మాటికిని కాదు. ముసోలినీకంటె కూడ సైనికుడుగా ఇమాన్యూలే హెచ్చు ప్రతిష్ఠ నార్జించినాడు. ఇమాన్యూల్ పెక్కు యుద్ధములందు పాల్గొనియున్నాడు. స్వయముగ సేనలను నడిపియు ఉన్నాడు. ఆతని యుద్ధకౌశలము అద్వితీయమైనది. కాగా ఆతని మౌనము ఆశ్చర్యధుర్యమగుచున్నది.

కావుననే పలువురు 'ఇటలీరాజు విక్టర్ ఇమాన్యూల్ సంగతియేమి?' అని అడుగుచున్నారు. ఇపుడేకాదు. పండ్రెండు పదమూడు సంవత్సరములుగ ఇమాన్యూల్‌నుగూర్చి మనము విశేషముగ వినుటలేదు. ముసోలినీ నాయకత్వమున ఇటలీయందు ఫాసిస్టు రాజ్యము స్థాపింపబడిన నాటినుండియు అతని నామము వెనుకబడియే యున్నది.

విక్టర్ ఇమాన్యూల్‌నకు చూపఱదృష్టిని శీఘ్రముగ ఆకర్షింపగల విగ్రహపుష్టి లేదు. కుదిమట్టమైన ఆకారము. స్వభావముచే ఆతడు చాల ముభావముగ నుండును. ఐరోపా మహాసంగ్రామమునకు పూర్వమును, తరువాతను గూడ ఇటలీరాజ్యాంగము నిరంతరము కష్టముల నెదుర్కొనవలసివచ్చుచుండెను. ఈ కారణములచే ఇమాన్యూల్ జీవితము క్లేశబహుళమయ్యెను. నిరంతరము కష్టములనే కొనివచ్చుచుండిన ఇటలీ కిరీటధారణముతో నాతడు విశేషముగా క్రుంగిపోయెను.

విక్టర్ ఇమాన్యూల్‌నకు ఇప్పుడు అరువదియొకటవ వత్సరము. 1900 నుండియు అనగా ముప్పదియైదు వత్సరములనుండి ఇమాన్యూలు రాజైయున్నాడు. తండ్రిపేరు యుంబర్టు; తల్లిపేరు మార్గరిటా. వంశనామము శావాయ్. జన్మస్థానము నేపిల్సు.

ఇరువదియొక్క వత్సరము నిండకపూర్వమే అతడు సైనికవృత్తి నవలంబించెను. చదువుకొను రోజులలో ఆతని మేధాశక్తి ఉపాధ్యాయుల మెచ్చుకోలునకు గురియయ్యెను. సైనికశిక్షణమునకూడ ఆతడు తోడివారిలో పై చేయిగానే ఉండెను. తనక్రిందిసైనికుల భక్తిని, అభిమానమును చూరగొనిన మొదటితరగతి రెజిమెంటల్ ఆఫీసరుగా మాత్రమేగాక ఆతడు గొప్పకార్యధురంధరుడుగా కూడ పేరుపొందెను. ఉద్యోగరీత్యా ఆతడు పొందిన అభివృద్ధిఅంతయు రాజపుత్రుడగుటచేత గాక స్వయము సమర్థుడగుటచేతనై యుండెను. సైనికశాఖలో నాతడు ఒక ఉద్యోగమునుండి మఱియొక ఉన్నతోద్యోగ

మునకు శీఘ్రగతిని ప్రాకువెట్టెను. ఆతడు తన ఇరువదియేడవ జన్మదినోత్సవము సప్పుకొను సరికి నేపిల్సునందు సైనికాధ్యక్షుడయ్యెను.

మరినాలుగేండ్లు గడచెను. సైనికాధ్యక్షుడుగా ఆత డింకను నేపిల్సునందే యుండెను. అంతలో తనతండ్రి యుంబర్టో వధింపబడినట్లు వార్తవచ్చెను. ఇట్లు అనుకోని సమయమున ఇటలీసింహాసనాధిపత్యము ఆతనిపై బడెను.

సింహాసనాధిపత్యము లభించిన సంతోషమాతనికి ఇసుమంతయు లేకపోయెను. తన తండ్రివధ ఆతనికి తెవులులేని వేదన అయ్యెను. దానితో ఆతని జీవితపధమే పూర్తిగ మారిపోయెను. రాజు అయ్యె ఆతడు తన సైనికధర్మములను కూడ యధాపూర్వకముగ నిర్వహింపవచ్చును. కాని పితృమరణము ఆసైనికుని వేదాంతిని చేసినది. ఆత డిప్పుడు కరమున కత్తిని గీలించుట మానినాడు. పుస్తకములు అతని హస్తభూషణములైనవి.

ప్రపంచమునందలి పాతరాజుల నాణెములను సంపాదించుటయందును, అమూల్యగ్రంథములను సంగ్రహించుటయందును ఆరాజు తనకాలము వినియోగించువాడు. ప్రపంచమునందలి నాణెముల చరిత్రలో ఆరాజు నిధి; ఆతనివద్ద ఉన్న నాణ్యములు నిరుపమానమైనవి, ఆతని గ్రంథభాండాగారము సాటిలేనిది. ఇట్టిపనులతో ఆ సైనికుడు శాంతముగ రాజ్యముచేయుచుండెను.

ఇంతలో ఐరోపామహాసంగ్రామము ప్రారంభమైనది. 1915 లో ఇటలీ యుద్ధమున ప్రవేశించినది. ఇమాన్యూల్ శాంతిసమాధిని వీడి తిరిగి సైనికుడైనాడు. ఇటలీసేనలు కాపోరెట్టోవద్ద ఓడిపోయినవి. అంత ఇమాన్యూల్ ఇటలీసేనలను స్వయముగ నడుపుటకు పూనుకొనెను. ఆసమయమున ఆతడు ప్రదర్శించిన ప్రజ్ఞ, ప్రతిభ లోకమువారిచే విశేషముగ కీర్తింపబడినవి. అప్పటి ఇమాన్యూల్ ధైర్యమును, స్వార్థత్యాగమును లాయడ్ జార్జి, లార్డుప్లూమర్ వంటి భిన్నస్వభావులుకూడ ఏకముఖముగ కీర్తించిరి. శావాయ్ రాజవంశీయులు భయమనునది ఎఱుగరను జనవాక్యమును రూఢిపఱచి ఇమాన్యూల్ స్వయముగ యుద్ధరంగమునకు దుమికెను. తనసేనలా? ఇంతక్రితమే యుద్ధమున ఓడి వెనుకంజవైచివచ్చిన మూక. ఎదిరిసేనలా? విజిగీషతో ఒడలుమఱచి వచ్చుచున్న జర్మను, ఆస్ట్రియా దేశములవి. మిత్రమండలివారి సహాయమా? ఇంకను అందుబాటునకు రాలేదు. అయినను రాజు తన సైనికులలో ఉత్సాహమును పూరించినాడు. 'పియివి'ని కాపాడినాడు. జర్మను, ఆస్ట్రియా సేనల దాడిని నిలవరించినాడు. ఇటలీదేశపు సైనికవ్యవస్థనంతటిని అత డాదినములలో పూర్తిగ పునర్నిర్మాణము గావించినాడు.

యుద్ధమున ఇటలీ విజయముగాంచినది. కాని దేశమున రాజకీయరంగమునందు కల్లోలము పుట్టినది. పార్టీప్రభుత్వము పనిచేసినది కాదు. కక్షలు, కలహములు మితిమీరినవి. ముసోలినీనాయకత్వమున ఫాసిస్టులు విజృంభించిరి. అప్పటి ఇటలీ ప్రధానమంత్రి 'ఫాక్టా' ఇటలీయందంతను సైనికశాసనము అమలు జరుపుటకు కృతనిశ్చయుడయ్యెను. ఈ విషయము ప్రచురణార్థము పత్రికలకును, వివిధపట్టణములందలి అధికారులకును తెలుపబడెను. ఈక్లిష్టస్థితిలో ఇమాన్యూల్ మంచి దూరదృష్టితో పనిచేసెను. సైనికశాసనము అమలు పఱచుటయనగా దేశమున యుద్ధమును రేపుటయే అని అతడు నిజమరసెను. కాగా ఫాక్టామంత్రి సైనికశాసనపు డిక్రీ తనవద్దకు

తెచ్చి సంతకము చేయుమని కోరగా ఇమాన్యూల్ నిరాకరించెను. ఆడిక్రీ ఉపసంహరించుకొని ఫాక్టా మంత్రిత్వమునకు రాజీనామా ఈయవలెనని ఆతడు కోరెను. ముసోలినీనాయకత్వమున ఫాసిస్టులు రోముపై మహాప్రస్థానమును అప్పుడే ముగించిరి. కాగా ఇమాన్యూల్ ముసోలినీని మంత్రిత్వమునకు ఆహ్వానించెను. ముసోలినీ మంత్రియయ్యెను.

ఫాసిస్టు ప్రభుత్వమున రాజుగారియొక్క గౌరవము అతిశయించినది. కాని అధికారము డిందుపాటొందినది. అగుగాక ఇటలీదేశమున యుద్ధములేకుండ పోయినది. నాటినుండి ముసోలినీ రాజును మించినాడు. కిరీటాధిపత్యమును గూర్చిన విషయములందుకూడ తుది నిర్ణయము ముసోలినీదే. సైనికదళముల సింహావలోకనము చేయుట మొదలగు పనులకు రాజును, యువరాజును రంగముమీదికి రప్పింపబడుచుందురు. ఆపని తీరిన మరునిముసమున వారు తిరిగి తెరవెనుకకు పోవుదురు. రాజభవనములలో పెక్కులు ఇపుడు ప్రభుత్వపుటాస్తిగా మారిపోయినవి. రాజునకును, రాణికిని పది మిలియనుల లైర్లు భరణము. యువరాజు ముప్పదియేండ్లవాడు - రెండు మిలియనుల లైర్లు భరణము పొందుచున్నాడు.

ఈతరుణమున ఇటలీ అబిసీనియాతో యుద్ధము చేయరాదనుట రాజుగారియొక్కయు, యువరాజుగారియొక్కయు అభిప్రాయమని కొద్దిరోజులక్రిత మొక వదంతి బయలుదేరెను. ఎంతవఱకు నిజమో! ముప్పదియైదు వత్సరములుగ ఇటలీరాజై ఇమాన్యూలు తన దేశము కష్టపరంపరలలో చిక్కి బయటపడుట చూచుచున్నాడు. నేడు ఆతనికి రాజ్యాధికారమేమియు లేదు.

కాని ఒకప్పుడు ఫాక్టా మంత్రిని త్రోసివైచి ముసోలినీని ఆహ్వానించి దేశమును కాపాడి తన కార్యదక్షత్వమును ప్రదర్శించినట్లే ఇమాన్యూల్ కొలదికాలములో తన కార్యదక్షత్వమును తిరిగి ప్రదర్శింపవలసి వచ్చునా?

విద్యావంతుడగు ఈప్రభువు, సైనికుడగు ఈరాజు - ఒకవేళ ముసోలినీ కథ ఈ అబిసీనియా యుద్ధముతో ముగియుచో తిరిగి ఇటలీకి వెనుకటివలె రక్షణదేవత కాకుండునా?

కమ్మరవానితనయుడగు ముసోలినీ పాఠశాలలో కేవలవిద్యార్థిమాత్రుడై యుండిన రోజులలో ఇమాన్యూల్ ఇటలీరాజైనాడు. కాని ఇపుడు ముసోలినీ చెప్పినట్లు ఇమాన్యూల్ చేసితీరవలసినదే. ఇమాన్యూల్‌కు ఫొటోతీయించుకొనుట ఇష్టములేదు. కాని ముసోలినీ తీయించుకొనమనినాడు. మాఱుమాటాడక ఇమాన్యూల్ తీయించుకొన్నాడు. ఇక ముసోలినీ తలపెట్టిన అబిసీనియాయుద్ధమునుగూర్చి ఇమాన్యూల్ పెదవి మెదపకపోవుటలో ఆశ్చర్యమేమున్నది?

మౌనవ్రతుడగు ఆరాజు తిరిగి కార్యక్షేత్రమున ప్రవేశించు నవసరము కలుగునా? అబిసీనియాయుద్ధములో ముసోలినీ ఓడిపోవునని యు, ఇటలీప్రజలు ఆతనిపై తిరుగబడెదరని యు ముసోలినీ జాతకమునుబట్టి ఒకానొక సుప్రసిద్ధ ఫ్రెంచి జ్యోతిష్కుడు జోస్యము చెప్పుచున్నాడు. ఐరోపామహాసంగ్రామకాలమునను, ఫాక్టామంత్రి ఇటలీలో సైనికశాసనమును అమలుపెట్టదలచినపుడును కలుగజేసికొని దేశమును దివ్యరీతిని నడిపినట్లే ఇమాన్యూల్ తిరిగి మరియొకసారి కలుగజేసికొనవలసి వచ్చునా?

మౌనవ్రతియగు ఈరాజుచే భగవంతుడు భావికాలమున ఏమిచేయింపనున్నాడో?




౧. పాటలు.

## జల్తారుకే గిన్నెల్

మీతల్లికోకది ♦ మీతండ్రికోటేది
ప్రాతజల్తారుంటె ♦ పట్టుకొని రండి
ప్రాతజల్తారుకి ♦ బంగారువలె మెఱయు
నూతనంబగు బొమ్మ ♦ లిస్తాను తెండి॥ మీ॥

కుక్కలు కోతులు ♦ కోమలైన దొరసాన్లు
నక్కలు కాకులు ♦ నల్ల బండ్రోతులు
పక్షులు చిలకలు ♦ పంచపాత్తరలున్న
గుఱ్ఱాలు జారీలు ♦ గుఱ్ఱాలు ఆవులు
ఏవికావలస్తే ♦ అవి మీకు యిస్తాను
ఏవికావలస్తే ♦ అవి మీకు యిస్తాను॥ మీ॥

బట్టపై నదియేమి ♦ పళపళా మెఱయునా ?
పెట్టెలోనదియేమి ♦ పిల్లలను పెట్టునా ?
పట్టుకొనిరండి అ ♦ బ్బాయి లమ్మాయిలు !
గట్టివస్తువులిత్తు ♦ కాకుంటె కొనకండి॥మీ॥

పదిలముగ అవి మీరు ♦ వాడుకుంటేను
పదియేళ్ళకైనాను ♦ పగిలిపోవండి
గదిలోను పెట్టితే ♦ ఘనముగా తోచు
చిదిమితే మాత్రము ♦ చితికిపోతాయి॥ మీ॥

—గరిమెళ్ళ సత్యనారాయణ, బి.ఏ.

౨. కథలు.

## వరహాలు : పాములు

ఒక చెఱువుగట్టున ఒక బ్రాహ్మణు డిల్లుగట్టుకుని కాపురముండెను. ఆయనకూతురు విమల. విమలకి ఎనిమిదేండ్లప్పుడే తల్లి చనిపోవుటచే ఆయన తిరిగి పెండ్లిచేసుకొనెను. రెండవభార్య సుందరమ్మకుకూడ ఒకకూతురుపుట్టి పెరుగుచుండెను. సవతితల్లి అన్ని పనులు విమలచేత చేయించుచు కష్టపెట్టుచుండెను. ఒకనాడు విమల చెరువుకువెళ్లెను. ఒక ముసలిది వచ్చి "అమ్మాయి! కాసిని మంచినీళ్ళిచ్చెదవూ ?" అని అడిగెను. ఆమె యిచ్చెను. ఆముసలిది "నీకడుపు చల్లగా, నీనోట్లోనించి వరహాలు రాలాలి" అని దీవించింది. విమల యింటికివెళ్ళి సవతితల్లిని బిందె దించమన్నది. వెంటనే ఆమెనోట్లోంచి వరహాలు రాలెను. అందరూ ఆశ్చర్యపోయారు. అప్పుడు విమల సవతితల్లి ఆమెనోట్లోంచి వరహాలు రాలడానికి కారణం తెలిసికొని తనకూతురును కూడా చెరువుకు పంపెను. ఆముసలిది మళ్ళీవచ్చి మంచినీళ్ళు అడిగెను. ఈబాలిక యివ్వలేదు. ముసలిది కోపగించి 'నీనోట్లోంచి పాములురాలాలి' అని శపించెను. ఆమె యింటికి వచ్చి విమలకి మల్లేనే బిందె దించమనెను. వెంటనే ఆమెనోట్లోంచి పాములురాలెను. అవి కరవగా తల్లీ కూతురూ ఇద్దరూ చచ్చిపోయిరి.

విమల అప్పటినుంచి సుఖముగానుండెను.

—వేమూరు మీనాక్షమ్మ.

## జిజ్ఞాస

విజ్ఞానసంపాదనావసరమున వివిధవిషయములందు కలుగు సందేహములను నివారించుకొొన పత్రికాముఖమున జిజ్ఞాస సలుపుటకును— ఇందలి ఏ ఒక్క జిజ్ఞాసకైననుసరే సరియైన సమాధానము తెలిసియున్నచో దానిని కూడినంత సంగ్రహముగ వ్రాసి, ప్రచురణార్థము పంపుటకును ఆంధ్రభూమి పాఠకులను ప్రార్థింతుము. —సంపాదకుడు.

## మీమాంస

### ౬౪. బొట్టు, కాటుక, గాజుల నిషేధము

హిందూస్త్రీలు చిన్నతనమునుండి బొట్టు, కాటుక, గాజులు ధరింతురు. వివాహమైననాటినుండి మంగళసూత్రమునుగూడ ధరించుచున్నారు, భర్తచనిపోయిన స్త్రీలకు వివాహమునాటి మంగళసూత్రమునేగాక చిన్నతనమునుండి ధరించు బొట్టు, కాటుక, గాజులుకూడ నిషేధించుచున్నారు. చిన్నతనమునుండి ధరించు ఈబొట్టు, కాటుక, గాజులు భర్తచనిపోయిన తదుపరి స్త్రీలు ధరించుటకు హిందూధర్మశాస్త్రప్రకారము నిషేధమున్నదా?

—కర్రి వీరారెడ్డి.

### ౬౫. అశౌచవిచారము

దశరాత్ర జ్ఞాతులలోఁ జేరినవా రెవరేని మరణించినపుడు అవివాహితయగు (కన్యలకు) ఆడపిల్లలకు నాశౌచ మీకన్యలును దండ్రి యధీనములోనున్నవారగుటఁ దండ్రికి సంబంధించిన శుభాశుభములు వీరికిని గలవనియు నందుచే వీరికిని నాశౌచము ధర్మశాస్త్రవిహితమేనని కొందరాచరించుచున్నారు. మఱికొందఱు మాదేశములో నాచారము లేమింజేసి మేమాచరింపమనుచున్నారు. వీరికిని ధర్మశాస్త్రరీత్యా యాశౌచముగలదని ప్రత్యేక ప్రమాణములుగలవా? లేక యేదేశస్థుల కాయాచారమే ప్రమాణమా? —విద్వాన్ షి. లింగయ్యశాస్త్రి.

### ౭౦. పెద్దపులి, సింహము

పెద్దపులి, సింహము అను ఈరెండు ఘాతుక మృగములలో బలశౌర్యములందు అధికమైనదేది? ఈ రెండు జంతువులలో ఒక్కొక్కదానికి ఎంతమంది మనుష్యుల శక్తియుండును?

—తిరువీధుల తాయారమ్మ.

### ౬౮. ముసోలినీపదమునకర్థము

అబిసీనియా చక్రవర్తికి టఫారి నామము తల్లి పెట్టినది. కాబట్టి అది అతనిపేరు. 'ముసోలినీ' అనునది ముసోలినీ అసలుపేరుకాదు. అది అతని ఇంటిపేరు. తెలుగువారిలో ఇంటిపేళ్లు సాధారణముగా గ్రామనామములనుపట్టి ఏర్పడును. ఇటాలియనులలో ఇంటిపేళ్లు వారు చేయువృత్తులనుపట్టి ఏర్పడును. ఇటాలియనులలో ముసోలినీ వంశము చాల ప్రాచీనమైనది. వారు ముసోలినా అనబడు అతిసున్నితమగు వస్త్రములు తయారుచేయువారుగనో, లేక ఆ వస్త్రములతో వర్తకముచేయువారుగనో ఉండుటచే వారికి ఈనామము ఏర్పడెను. ముసోలినా వస్త్రములు అనగా ప్రపంచ ప్రఖ్యాతమైన మన డక్కామస్లిన్ వస్త్రములే. ఈమస్లిన్ వస్త్రములు హిందూదేశము నుండి అరబ్బులద్వారా ఐరోపియన్ క్రూసేడరుల కంది వారిద్వారా యూరపుఖండమున వ్యాపించెను. ముసోలినీ వంశీయులు ఈ వస్త్రములతో విశేషముగా వర్తకముచేయుచు ఈయింటిపేరు నార్జించిరి. ముసోలినీ ఇంటిపేరుతో హిందూదేశమున కిట్లు సంబంధము కలిగియుండుట తెలిసికొనుటకు ఈయదనున చమత్కారముగనే యుండును.

### ౬౬. గ్రేటాగార్బో

సినీమారంగమున లోకప్రఖ్యాతిగాంచిన గ్రేటాగార్బోకు వివాహముకాలేదు.

—సి. సీతారామయ్య.

### ౬౩. అబిసీనియా : ఇథియోపియా

పూర్వకాలపు చరిత్రకారులును, భూగోళశాస్త్రకారులును హిందూదేశము మొదలుకొని ఈజిప్టువఱకుగల సమస్తమైన దేశములను ఇథియోపియా

నామముతో వ్యవహరించిరి. వారి వ్యవహారము ననుసరించి హిందూదేశము, ఈజిప్టుకూడ ఇథియోపియా లోని భాగములే. ఆనాటి ఈదేశములకు చెందిన నల్లవారందఱును ఇథియోపియనులుగానే వారిచే వ్యవహరింపబడుచుండిరి. కాని ప్రస్తుతము ఇథియోపియా నామము ఆఫ్రికాలోని ఒక్కదేశమునకును, ఇథియోపియన్ నామము ఆఒక్క దేశమునందలి ప్రజలకును మాత్రము రూఢమైయున్నది. అబిసీనియా అనునది హబాష్ అను పదమునకు గ్రామ్యము. క్రీస్తునకు పూర్వము ఇథియోపియాపై దండెత్తివచ్చి ఆ దేశమును జయించిన అరబ్బు జాతీయులు అపుడు హబాష్ నామముతో వ్యవహరింపబడుచుండిరి. హబాష్‌లు జయించినదేశము అబిసీనియాయైనది. అబిసీనియా దేశస్థులందరును తమదేశమును ఇథియోపియా అనియే పిలుతురు. అరబిక్ నామముగు అబిసీనియా పదము వారికి కిట్టదు. 'ఇథియోపియారాజులకు రాజు' అను నామమునే అబిసీనియా చక్రవర్తులు ప్రేమింతురు. ఇథియోపియా అను పదము గ్రీకుభాషా జనితము. ఆభాషలో ఆపదమున కర్థము నల్లమొగము వారిదేశము అని. అబిసీనియాదేశమునకు ఆ నామమిచ్చుటకు కారణభూతమైన హబాష్ పదముతో ఆ దేశమున ఏవ్యక్తినైన పిలిచితిమేని అది ఆతడు తనకు చేయబడిన గొప్ప అవమానముగ భావించును. హబాష్ అనగా వెర్రి వెంగళప్పకు పర్యాయపదమై యున్నది. కాని క్రీస్తుశకము నాలగవ శతాబ్దినుండియు హబాష్‌శబ్దభవముగు అబిసీనియా పదము ఆదేశనామముగ వాడబడుచు నేయున్నది.

## ౬౫. జాతిసమితిసభలో భాషాసమస్య

జాతిసమితి సభలో భాషాసమస్య పరిష్కరింపబడిన తీరు చమత్కారమైనది. ఆంగ్ల మంత్రి సర్ శామ్యూల్ హోరు ఆంగ్లమున ఉపన్యసించుచున్నాడనుకొనుడు. మిగిలిన సభ్యులలో ఒక్కొక్కడు తనకు ఆ ఉపన్యాసము ఏభాషలో వినవలయునని ఉన్నదో ఎన్నుకొని ఆభాషగుర్తుగల ఎలక్ట్రిక్ మీటు నొక్కవలయును. ఈమీటు నొక్కుటకుగాను ఆసభ్యుడు తన ఆసనమునుండియైన కదలనక్కరలేదు. ఆమీటు లాతని చెంత నేయుండును. మీటు నొక్కి ఆతడు 'ఇయర్‌ఫోన్' అను యంత్రమును చేకొనవలయును. హోరు ఆంగ్లమున ఉపన్యసించుచున్నను ఆఉపన్యాసము ఆసభ్యునకు ఆతడెన్నుకొనిన భాషలో వినిపించును. హోరు ఉపన్యాసములోని ఒక్కొక్క వాక్యమును ఉద్గారితమగుటతోడనే అందుకొని దానిని తమతమ భాషలలోనికి మార్చి మరల పలుకు ఆయాభాషలకు చెందిన ఉద్యోగులెందరో తెరవెనుక నుందురు. ఉపన్యాసకుని నోట మాట ఉచ్చరింపబడుట తడువుగా వారు దానిని తమభాషలోనికి మార్చి తిరిగి ఉచ్చరింతురు. యంత్రసహాయమున ఆమాట ఆయాసభ్యుల చెవికి చేరును. ఈఏర్పాటు లేకపోయినచో పలుదేశపు ప్రతినిధులుగల జాతిసమితిలో వ్యవహారము నడచుట దుస్తరమే అయిఉండును.

## ౬౬. గోదావరి గంగకు అప్ప

గంగానదికి గోదావరి అప్పగారను పెద్దల పలుకు భూగోళశాస్త్రరీత్యా సమర్థనీయమయినదే. ఈ పలుకు ఉట్టి పుక్కిటిగాథ కాదని భూగర్భశాస్త్ర వేత్తలును, భూగోళశాస్త్రవేత్తలును చేసిన తీవ్రపరిశోధనలచేతను, దీర్ఘపరిశ్రమచేతను నిరూపింపగలుగుచున్నాము. చిరకాలమునకు పూర్వము యిపుడు మనము ఉత్తరహిందూస్థానమని పిలుచు ప్రదేశమంతయు సముద్రమయమై యుండెను. అనగా ఆకాలమున సముద్రపుటలలు హిమాలయపర్వతములను తాకుచుండినవన్నమాట. వింధ్యపర్వతమునకు దక్షిణమున నున్న ప్రదేశము-దక్కనుపీఠభూమి యని మన మిపుడు వ్యవహరించునది- ఒకద్వీపముగా సముద్రమునడుమనుండెను. అందు గోదావరి ప్రవహించుచుండెను. అనంతరము క్రమముగా ఉత్తరహిందూస్థానము ఏర్పడుటయు గంగాది నదులు పుట్టుటయు జరిగెను. గంగకంటె ముందే పుట్టియుండినదగుట గోదావరిని భారతీయులు గంగకు అగ్రసహజగా పేర్కొనుట సమంజసమయినదే.

# ముసోలినీ మంత్రి ప్రయివేటు జీవితము

నేటికాలమున పెక్కుమంది ప్రజలసంభాషణములందును, చర్చలందును ఆమ్రేడితమగుచున్న నామము ముసోలినినామమే. ఆతని కీర్తి దిగంతవిశ్రాంతమైనది. కాని ఆతని ప్రయివేటు జీవితమునుగూర్చి కొద్దిసంగతులు మాత్రమే లోకమువారికి చేకూఱుచున్నవి. కారణమేమి? తనప్రయివేటు జీవితమునుగూర్చిన సంగతులు పఠించుటనుకంటె ముసోలిని ఎక్కువగా కక్కసించుకొను విషయము మఱియొకటిలేదు.

అగుగాక! లోకుల నాలుకపై నాట్యముచేయుచున్న ఆవిఖ్యాతపురుషుని ప్రయివేటు జీవితము, అతని అలవాటులు, తదితరమగు భోగట్టా తెలిసికొనుటకు ఎల్లరును ఉఱకలు వేయుచుందురు.

అతడు ఇటలీ దేశపు ప్రధానమంత్రి. రోజంతయు నాతనికి ఎడతెరిపిలేని పనియే. ఇటలీరాజధానియగు రోము మహానగరమున అతని కార్యాలయము 'పెలాజ్జో వెనీజియా అనుమందిరమున. పని చేయుచున్నంతసేపును అతడు ఏకసర్గుడై యుండును. ఆఏకాగ్రత అసదృశము; అనితరలభ్యము. ఒక్కొక్కప్పుడు అతడు ఉదయము మొదలుకొని అర్థరాత్రియగునఱకు ఏకటాకీని పనిచేయుచునే యుండును. అర్థరాత్రియైనను తెంపులేక పనిచేయుచునే యుండు సమయములును తఱచై యుండును, పని అంతయు ముగించుకొని అప్పుడాతడింటికిపోవును. నిజము చెప్పవలసినచో నాతడు సంఘమున విశేషముగ కలియడని చెప్పకుండరాదు.

రోము నగరమున ముసోలినీ విల్లా టార్లోనియా అను తావున నివసించును. సుందరమగు నోమెంటనాప్రదేశమున ఆ టార్లోనియా ఉన్నది. దాని చుట్టును అందమగు పెద్దపార్కు. అది ముసోలిని సొంతము కాదు. ఆ యింట నాతడు అతిథి మాత్రమే. అది డ్యూక్ ఆఫ్ టార్లోనియాకు చెందినది. అతడు ఇటలీదేశమునందలి అధికధనవంతులగు కర్షకులలో నొకడు. మంత్రియైన తరువాత ఏడు సంవత్సరములవఱకును ముసోలినీ రోమునందు ఒక మేడలో మూడు గదులుగల ఒక సామాన్యపు చిన్నఇంటియందు ఉండువాడు. మూడు సంవత్సరముల క్రితము ఆవిల్లా టార్లోనియా ముసోలినీ కీయబడినది. అప్పటి నుండియు ఆత డందే నివసించుచున్నాడు.

టార్లోనియా భవనము విలాసవస్తువులకు పేరుమ్రోసినది. అచ్చట అంతయు జమీందారీఫాయి జీవితము. అట్టి వాతావరణమున ముసోలినీ నిరాడంబరజీవియై యుండును. అతనికిగల సేవకులు మిక్కిలి కొద్దిమంది. టీపార్టీలు, స్వాగతోత్సవములు, విందు భోజనములు మున్నగు ఆడంబరము లచట లేవు. విదేశములనుండి పనికట్టుకొని తనకొఱకు రాజకీయవేత్తలుగాని తదితరప్రఖ్యాతపురుషులుగాని వచ్చుచో ఆ అతిథులకు ముసోలినీ తన కార్యాలయమగు పెలాజ్జో వెనీజియాయందుకాని, రోమునందలి మొదటి తరగతి హోటలునందుకాని భోజనసదుపాయములు చేయును.

వ్యక్తిగతముగా నాతడు నిరాడంబరుడు. గృహకార్యవ్యవహారమును అచట చాల నిరాడంబరముగనే జరిగిపోవును. ఆతని పెద్ద

కుమారు లిద్దరును తమ తండ్రితో అచటనే నివసింతురు. (ఇపుడు వీరిద్దరు అబిసీనియాకు వెడలియున్నారు.) కాని అతని భార్యయు, మిగిలిన చిన్నపిల్లలును ప్రిడాపియో కోట యందు నివసింతురు.

ముసోలినీ చాల పెందలకడనే నిద్రమేల్కాంచును. ప్రతిదినమును వినియమముగా నాత డేదియేని యొకక్రీడయందు పాల్గొని తీరును. దినమున అతని ప్రథమకృత్యము దేహపరిశ్రమయే. తఱుచు గుఱ్ఱపు స్వారి చేయుచుండును. లేదా బాగుగా వ్యాయామము చేయుచుండును. ఈ కృత్యము చేసి కాని అతడు ప్రతిదినము రాజకార్యనిర్వాహణమునకు దొరకొనడు. పెలాజ్జొ వెనీజియా యందలి తన ఆఫీసు టేబిలువద్ద సాధారణముగ ఎనిమిదిన్నరగంటలు దాటకుండగనే ఆతడు ప్రత్యక్షమగును. ఆరాజభవనము నాతడు తఱుచుగా అర్ధరాత్రి అతిక్రమించువఱకును వీడుచుండడు.

అతని సొంతమునకు ఒక ప్రయివేటు ఫిలుముస్టూడియో ఉన్నది. ఎంత ఆలస్యమైనను ప్రతిదిన మాతడాస్టూడియో దర్శించితీరును. ఆస్టూడియో విల్లాటార్లోనియాయందే యున్నది. క్రొత్తగా వచ్చినవానిలో అతి ప్రశస్తములగు ఫిల్ములలోని కొన్ని భాగములను, ప్రపంచవార్తలలో ముఖ్యములైన వానిని ఆత డచట తిలకించును. అతనికి ఫిలుముల పిచ్చ మెండు. కార్యాలయమున పని చేసిచేసి వచ్చును. అప్పటికే అర్ధరాత్రి అతిక్రమించుచుండును. కాగా ఆ ఫిలుములో ఒక అంకముకంటె ఎక్కువ చూడరాదని నిశ్చయించుకొనును. కాని సాధారణముగ ఆ ఫిలుమంతయు చూడనిదే అతడీవలకు రాడు. ఇంతసేపు మేలుకుండియు నాతడు ఉదయము ఏడుగంటలదాటి ఒక నిముసము నిద్రింపడు!

ముసోలినీ అభిలాష ఒక్క ఫిలుముల యందే కాదు. క్రీడలయందలి ఆతని అభిలాషయు అగ్గలమైనదే. గుఱ్ఱపు స్వారియందు అతనికి అభిమానము హెచ్చు. వ్యాయామ క్రీడలయందు కొండంత మమకారము. గరిడీ చేయుట అతనికి ప్రియతమమైనది. మోటారు సవుపుటయం దాతడు అందెవేసిన చేయి. తఱుచుగా నాతడు మోటారుసైకిలు నెక్కిపోవుచుండును. ఇటలీదేశపుమంత్రి కాకపూర్వము అతడు మిలాన్‌నం దొకపత్రికకు సంపాదకుడుగా నుండెను. అప్పటి అతని కాపురము ఊరుబయట అయి ఉండుటచే రాత్రిపూట ఇంటికిపోవుట కత డొక మోటారుబైసికిలు నుపయోగించువాడు. మోటారు బైసికిలు విహారము అప్పటినుండియు నతనికి అలవాటయ్యెను. ఇప్పుడు కూడ ముసోలిని వారమునకు రెండుమూడుసారులు తన అందమైన మోటారు బైసికిల్ ఎక్కి రోమునగరమునకు వెలుపలను నొమెంటనా యందును విహరించును. మోటారుకారులును అతనికి ప్రియమైనవే. కొద్దికాలమునకు పూర్వమువఱకును ముసోలినీ ప్రతిదినమును మోటారుపై షికారుపోవువాడు- కాని నేడు అతని కట్లు షికారు పోవుటకు బొత్తిగా కాలములేదు. ఎనిమిది సిలిండరులుగల ఆల్ఫారోమియో రేసింగుకారు ముసోలినీకి ఉన్నది. దానిపై నాతడు శరవేగమును మించిన వేగమున పోవుచుండును. ఏ మోటారు కాని ఎక్కి అతడు పోవుచుండినపుడు అతని వేగమునకు స్నేహితులు, శ్రేయోభిలాషులు, కుటుంబపు వ్యక్తులు మిక్కిలి అలజడి పొందుదురు.

విమానవిహారమనినను అతనికి సరదాయే. కాని అతని కుటుంబము వారతనిని

విమాన మెక్కనీయరు. తన ప్రాణమును గూర్చి ముస్సోలినీకి విసరంతేని భయములేదు. ప్రతిదినము నొకసారి విమానవిహారము సల్పవలయునని అతని అభిలాష. కాని ఫాసిస్టు పార్టీనాయకులు ఆ అభిలాషకు అడ్డు తగులు చుందురు. కాగా ముసోలినీకి విమానచోదనమున కుండవలసిన పట్టా (పైలెట్సు సర్టిఫికెట్టు) ఉన్నను తన కుటుంబము వారి ప్రార్థనలను, తన పార్టీనాయకుల ఎచ్చరికలను ఉపలక్షించి యతడు ఎప్పుడును విమాన మెక్కకుండుటకు వాగ్దానము గావించినాడు.

గుఱ్ఱపుచూచి కొట్టుటయందు అతడు మంచి నేర్పరి. సాముివిద్య లెస్సగ నేర్చినవాడు. లోకప్రఖ్యాతి గాంచిన రోయింగుక్లబ్బులో నొకదానియందాతడు సభ్యుడు. తెడ్లువైచుచు పడవనడుపుటలో నతడు సమర్థుడు. చుక్కానిపట్టి కాయుటలో నత డద్వితీయుడు.

అతనికి గ్రంథపఠమునందాశక్తి మెండు. చదువుగ్రంథములకు లెక్కలేదు- శాస్త్రవిషయికములు, రాజకీయములు, సాంకేతిక విషయికములు, సాంఘికములు, చారిత్రకములు మున్నగు పుస్తకములనే గాక అతడు కేవల కళాసారస్వతములకు చెందిన గ్రంథములనుగూడ పఠించును. ముసోలినీ బహుభాషలునేర్చిన ప్రోఢ. జర్మన్, ఫ్రెంచి, ఇంగ్లీషు భాషలను ధారాళముగ మాటలాడగలడు-మాటలాడుటయే గాక ఆయాభాషలయందు ప్రచురింపబడు అమూల్యగ్రంథముల నన్నిటిని ఆత డాయాభాషలయందే చదువగలడు. క్రొత్తగా కట్టబడిన రోమునకు ప్లానులన్నియు ముసోలినీ స్వయముగ నిర్మించినవే- ఈ కారణముచేతనే ఆ నగర మిప్పుడు 'రోమా ముస్సోలినియా' అను నామమున వ్యవహరింపబగుచున్నది.

యువకుడుగా ఉండినప్పుడు వీణవాయించుట ఆతడు లెస్సగ అభ్యసించెను- ఇప్పుడాతనికి బొత్తిగా తీరికయుండదు- కాని ఏ మాత్రము అవకాశము లభించినను ముసోలిని తన వీణ నందుకొని వాయించుచు ఆనందపరవశు డగుచుండును- గానమునకు సంబంధించి ఆ పట్టణమున ఏమి నడచినను ముసోలినీ కుతూహలముతో తెలిసికొనును. రేడియో సంగీత మనిన ఆతడు మనసుపడును- లండను రేడియోసంగీతము ఈ విషయమున అతని అభిమానమును హెచ్చుగ చూఱగొనెనని ముసోలినీమిత్రులు చెప్పుదురు.

ఇన్ని పనుల నడుమ అతడు నాటకరచనము సాగించును! ఈ బహునాటకములను ముసోలిని ఎట్లు రచియింపగలిగెను? పనులు ముగించుకొని రాత్రులు పక్కపై చేరి నాటకములు రచించుట అతని కొకవాడుక యైపోయినది- కాని ఇటీవల అత డీవాడుకను తగ్గించినాడు.

ఇంతకును ముసోలినీ భోజనప్రియుడు- బాగా తినును- ఇటాలియనుల భోజ్యపదార్థముల విషయమున నూతనాభివృద్ధిని గనుపఱచిన సీనర్ ఆల్ఫ్రెడ్ యొక్క హోటలునకు ముసోలినీ తఱచు పోవుచుండువాడు- ఆహోటలుయజమాని పాకనైపుణ్యమునకు మెచ్చి ముసోలినీ బిరుదము కూడ ఇచ్చెను- ఎంత తిన్నను నెమ్మదిగా తిను అలవాటు మాత్రము ముసోలినికి లేదు- విందుభోజనములందు ఇతరులు భోజనమునకు ప్రారంభించు సరికే ముసోలినీ భోజనము మూడువంతులైపోవును- ఇక మిగత భోజనము మిగిలిన వారితో కత్తు కలిపి నెమ్మదిగ చేయును.

కొద్ది సంవత్సరముల పూర్వమువఱకును

ముసోలినీ సంఘమున నలుగురితో కలియుచుండువాడు- ఇటలీదేశపు సుప్రసిద్ధచిత్రకారులు, విఖ్యాతశాస్త్రవేత్తలు సమావేశములగు పరిషత్తులకు ముసోలినీ ఆదినములలో తఱుచు వెళ్లుచుండువాడు- నేడిట్టి పరిషత్తులకు పోవుట కాతనికి బొత్తిగా తీరికలేదు రాజకీయముగా జరుగు విందులకు తప్ప మఱి ఇతరసమావేశములకు పోవుట ఆతడీరోజులలో పూర్తిగా మానుకొన్నాడు.

ముసోలినీకూతురు ఎడ్డా- ఎడ్డాయందు అతనికిగల ప్రేమ నిరవధికము. ఆమె సందర్శనమే అతనికి అఖిలపరిషత్ సందర్శనము. ఆమె కౌంటుకెయినో భార్య. అగుట నామె కౌంటెస్ కెయినో. వార్తాపత్రికలకు సంబంధించిన ముసోలినీవ్యవహారములన్నియు అల్లుని ఆలనయందుండును. (ఆ అల్లుడిపుడు అబిసీనియాయందున్నాడు.) అల్లునితండ్రి సీనియర్ కౌంటుకెయినో (అనగా ముసోలినీ వియ్యంకుడు) ముసోలినీ కాబినెట్టులో ట్రాఫిక్ శాఖ మంత్రి. ఈతనియెడ ముసోలినీ చూపు చెలిమి బలిమిదైనది.

ముసోలినీయొక్క- సౌజన్యమును గూర్చియు, ఆదరణనుగూర్చియు ఎన్నియో కథలు రోముమహానగరమున వాడుకలోనున్నవి. సమాజమున ఉన్నప్పుడు రాజకీయసమస్యలుగాని, సాంఘికసమస్యలుగాని చర్చించుట కాతడియ్యకొనడు, తనముందర రాజకీయములను గూర్చి ఎవరైన వేళాకోళము చేయుచో నతడు కలవరపడును- ముఖస్తుతి అతడు కక్కసించుకొను మఱియొక విషయము- తన్నెవరైన ముఖస్తుతిగావించుటకు దొరకొనిరా వెంటనే ఆతడు మందహాసము చేయును-. ఎడమొగము పెడమొగము అయి తొలగిపోవును.

# శ్రీ॥ శే॥ వేంకటసుబ్బమ్మగారు

శ్రీమతి పాణకా కనకమ్మగారి ఏకపుత్రిక, శ్రీయుత మరుపూరు పిచ్చిరెడ్డిగారి ప్రియపత్ని, విద్యావతి, సుగుణశీల, సౌజన్యమూర్తియగు శ్రీ. వెంకటసుబ్బమ్మగారి—26-వ యేట(5-10-35)—అకాల మృత్యువు ఆంధ్రసొదరీసోదరులను మిగుల విషాదమున ముంపక మానదు. ఈమె గత 3, 4 నెలల నుండి, బలహీనతచే గుండెజబ్బు హెచ్చినందున మూసముదినములుముందు, తల్లిగారు, భర్తగారు మద్రాసుకు గొంపోయి ఎగ్మూరులోని మెటర్నిటీ ఆస్పత్రియందు, శ్రీడాక్టరు లక్ష్మణస్వామి మొదల్యారు చికిత్సగావింపుచుండిరి. పిమ్మట కొంత నెమ్మదించినది. కాని హఠాత్తుగ అక్టోబరునెల 4-వ తేదిని వ్యాధి హెచ్చి 5-వ తేది సాయంత్రం 4 గంటలకు, ఏకైకప్రియపుత్రికాప్రాణయగు మాతృదేవిని, ప్రియనాథుని, వృద్ధురాలగు నవ్వగారిని, ప్రేమమయమగు కుటుంబమును, ఆప్తబంధుమిత్రుల నెల్లరను దుఃఖసముద్రమున ముంచ్చి యిహలోకమునువీడి, శాశ్వితమగు నీశ్వరసాన్నిధ్యముంజేరెను.

వీరికుటుంబము 1914 సం॥ మొదలు రాజకీయములందును, సంఘసేవయందును సర్వధా ముందంజవేయుచు, ధయిర్యత్యాగములకు నత్యంతనిలయమైనది. దేశాభ్యుదయమునకగు ప్రతి యుద్యమమునకును నెల్లూరుజిల్లాలో వీరికుటుంబము పట్టుగొమ్మ. వీరితల్లిగారి త్యాగశీలాది సద్గుణములే యీయమ కుగ్గుపాలతో నలవడినవి. నిరాడంబరము, సేవాసహిష్ణుత; సద్గుణ, సౌజన్య, సౌశీల్యముల నీయమ మూడుమూర్తుల తల్లిగారి ప్రతిబింబమై యొప్పెడిది. ఒక పెద్ద జమీందారీకి తుల్యమగు వీరి యాస్థియంతయు, కాలబద్ధమై, వీరిత్యాగాగ్నిజ్వాలకు, పరుల దుష్పరిపాలనముకు యాహుతియైనను; 1929-వ సం॥ మహాత్ముని యాగమన సందర్భమున, నిరువది నవరసులు విలువచేయు గాజులు, కాసులు మహాత్ముని పాద

# కీ॥ శే॥ వెంకటసుబ్బమ్మగారు

పద్మముల సమర్పించి పూజించి ధన్యురాలైన దేశ
సేవిక. ఈమె పిన్నవయసుననే తిలక్ స్వరాజ్య
నిధికి నెల్లూరు స్త్రీలతోపాటు కృషిసల్పి రు 800-
నిధి వసూలుచేయుటలో విశేషశ్రమపడినట్టియు,
మహాత్ముడు రెండుమార్లు నెల్లూరువచ్చినప్పుడు నిధి
వసూలుచేయుటకును తదితరకార్యసాధనములకును
నత్యంతము కృషిచేసినట్టియు వ్యగ్రోత్సాహ. తన
తనతల్లిగారు జైలులోనున్న కాలమున, కస్తూరీ
దేవీ విద్యాలయము చక్కగాజరుగుటకు, పత్రికలలో
ప్రకటించిన విజ్ఞప్తులు ఈమె కార్యోత్సాహమును
వెల్లడిచేయఁగలవు. రాయలసీమ క్షామనివారణ నిధికి
కొంత ద్రవ్యమును చందాలు వసూలుచేసి, తల్లిగా
రికి మిక్కిలి తోడ్పడినది. తుదకు ఈసంవత్సరం
జబ్బుగానున్నను, కాంగ్రెసు సభ్యులను జేర్చుటలో
నెంతో యుత్సాహముతో పనిచేసినది.


బాల్యమాదిగ జాలి, దయ, వితరణ ఈమెకు
పెట్టనిసొమ్ములు. బీదవారు ఏదయిన నడిగినను, ఆడు
కునే బాలికలు ఏదయినా వస్తువుకావలెనని అను
కొన్నను, తనవద్ద నప్పుడేదియున్న నది వెంటనే
యిచ్చివేయవలసినదే: మంచి మంచి దుస్తులు, చిన్న
చిన్ననగలు ధరించి యామెయాడుకొన నేగినపుడు
తోటి చెలిమికత్తెలు చాల బాగున్నవి యని, వాని
యందలి మక్కువను సూచితముగా తెలియఁజేసినను
వెంటనే వారి కవి తీసియిచ్చివేసి, వినమ్రతతో నిం
టికి వచ్చెడిది. తల్లిగారు మొదలగువా రాదరముతో
మరల కావలసినవి కుట్టించియు, చేయించియు
నిచ్చుచుండెడివారు. ఈస్వభావము వేయకుండా
భాగ్యభోగ్యముల తులదూగే పిన్ననాటనే గాక,
ఐశ్వర్యము క్షీణించి అనేకకష్టములు ప్రాప్తించి
నను జీవితాంతమువరకట్లే యున్నది.

సేవాత్యాగములే జీవితాదర్శము లక్ష్యములుగా
తల్లిచాటున ఆదర్శసిద్ధికి తపస్సుచేయుచున్నదో
యన్నట్లు లాయమ పెరిగి పెద్దదైనది. కొలది దినము
లాయమ పరిచయముకలిగినవారి కామె సుగుణము
లును, సౌజన్యమును మరపునకురావు. మనస్సు అతి
మార్దవము. పతిప్రాణ. తల్లిగారిని కేవలము తల్లిగా
గాక యొకదేవతగా భావించి పూజించుకొనుచు
తాను లోకోన్నతికై ముందుకువచ్చుట కెంతమా
త్రము నభిలషింపక, పేరుప్రతిష్ఠల నిచ్ఛగింపక ఆ
తల్లికడుపునఁబుట్టి సార్థక మొనరించిన ధన్యురాల
నను సర్వదా తల్లిగారి దేశసేవకు, విద్యాలయాభి
వృద్ధి మొదలగు వానికి వెనుకనుండి యత్యంతము
తోడ్పడుచుండెడిది. ఆయమ నిరాడంబర జీవితము
యువతుల కనుకరణీయమైనది. పెద్దలయందలి విన
మ్రత, దేశభక్తులయందు భక్తిగౌరవములు, దేశసేవ
యం దపారప్రేమ, సంఘసంస్కారమునం దత్యంత
ప్రీతి. కుటుంబవిషయములో నామెకు తల్లి దైవము;
భర్త ప్రాణేశ్వరుఁడు. అత్యంతమయిన ఆపతిప్రేమ,
భక్తి, గౌరవము, ఈలక్ష్యము ఆమెవ్రాయు ప్రతి
కథ వ్యాసమునందును ప్రస్ఫుటితమగుచుండెడిది.
నవీనసంస్కారములం దెంతమక్కువయో, పాతి
వ్రత్యాదిప్రాచీనసాంప్రదాయములయందంత గౌరవ
శ్రద్ధలు కలిగియుండునది.

ఈమె తెలుగుభాషయందు మంచి ప్రవేశముకలి
ఆంధ్రభూమి, గృహలక్ష్మి, సుబోధిని మున్నగు పత్రి
కలకు తరుచు మనోహరములగు కథలువ్రాసి యం
చ్చెడిది. తల్లిగారు జైలునుండి వచ్చినపిమ్మట నా
మెవద్ద హిందీ నభ్యసించినది.

జైలు జీవితమున నసలే ఆరోగ్యము చెడిన శ్రీ కన
కమ్మగారి ఆరోగ్యమున కీగర్భశోకము హానని పుం
డుగా పరిణమించినది. తల్లికిని, భర్తకును, కుటుంబ
మునకేగాక, సహృదయమగు నాంధ్రలోకమునకంతకు
నీమె మరణముచే లోటుకల్గినదనియే చెప్పవలెను.
ఇట్టి సౌజన్యధన్యయగు స్వర్గీయ వెంకటసుబ్బమ్మ
గారికి కృపామయుఁడగు భగవానుఁడు ఆత్మశాంతిని
ప్రసాదించును గాక!

—ఎస్. వి. రామానాయుడు.


అరేబియా
ఏడెన్ జలసంధి
హిందూమహాసముద్రం
ఏడెన్
జిబూటి
కస్సాల
గొండార్
మగ్డాలా
డెస్సీ
అబిస్సీనియా
హరార్
అడ్డిస్ అబాబా
గాలా
బ్రిటిష్ సోమలీలేండు
అరస్
ఒగాడెన
స్టెఫానీ సరస్సు
యుగాండా
మొగదిషియో

# అబిసీనియా రాజధానికి రైలు ప్రయాణము

భరతఖండమున నిజాము రాష్ట్రమునకు వలె ఆఫ్రికాఖండమున అబిసీనియా దేశమునకును సముద్రతీరము లేదు. నిజాము రాజధాని యగు హైదరాబాదునకు మచిలీపట్టణము రేవునుండి రైలుఉన్నట్లు అబిసీనియా రాజధానియగు ఆడిస్ అబాబాకు జిబుటి రేవుపట్టణమునుండి రైలుఉన్నది. ఇచట మచిలీపట్టణము రేవు ఇంగ్లీషువారిదైనట్లే అచట జిబుటీ రేవుపట్టణము ఫ్రెంచివారిది. [ప్రక్కపుటపై ముద్రింపబడిన అబిసీనియా దేశ పటమును చూడుడు.]

జిబుటీనుండి ఆడిస్ అబాబాకు **495** మైళ్ళదూరము—మదరాసునుంచి వాల్తేరుకు ఉన్నంతదూరము. మదరాసునుండి వాల్తేరుకు మెయిలుబండి పదునెనిమిది గంటలలోను, పాశెంజరుబండి ఇరువదినాలుగు గంటలలోను ప్రయాణము ముగించును. అదియే దూరము ప్రయాణముచేయుటకు ఆ జిబూటిఆడిస్ అబాబా రైలు మూడుపగళ్లు, రెండురాత్రులు తీసికొనును. మరియు విచిత్రమేమన ఆరైలు రాత్రిపూట ప్రయాణముచేయదు! అట్లు రాత్రిపూట ప్రయాణముచేయకుండుటకు పెక్కు హేతువులుగలవు. అచట మండు వేసవియందే పెద్దవానలు కురియును. ఆవానలైనను సామాన్యపు వానలుకావు. కొండ చిల్లులుపడినదేమో అనిపించు ఝోరీపాతపు వానలు. అట్టివానలవలన ఎప్పటికప్పుడే రైలుపట్టాలు కొట్టుకొనిపోవుచుండుట తఱుచు సంభవించుచుండును. అదియుగాక అబిసీనియాయందలి కొండజాతులవారు రాత్రిపూట మూకలుకట్టుకొని వచ్చి రైలుబండి నాపి దోచుకొనుటకు అవకాశముండును. మఱియు ఆ కొండజాతులవారు రైలుపట్టాలక్రింద అడ్డముగా వేయబడు ఉక్కుస్లీపర్లను ఊడదీసికొనిపోయి ఈటెలుగా బల్లెములుగా చేయించుకొనుచుండుట అరుదుకాదు. విశేషించి రైలుబండిలోని విద్యుద్దీపములు రాత్రులందు భగ్నమగుచుండుట తఱుచు. ఈ హేతువులచే అచటి రైలుబండ్లు సూర్యరశ్మి ఉండునంతసేపే ప్రయాణముచేయును.

'లంఖనాలబోట్లు' అనదగిన ఈరైలుబండ్లు రోజున కొకటైనలేదు. వారమునకు ఎదర రెండును, వాలు రెండును బయలుదేరును. ప్రయాణసందర్భమున మకాముచేయవలసియుండు రెండురాత్రులును రైలుదారియందటనటగల మంచి హోటలులయందు గడపవచ్చును. తొందరలేని ప్రయాణికుడు చికాకుపడగల విషయము లికనేమియు లేవు.

కావున ఒకసారి జిబూటినుండి ఆడిస్ అబాబాకు రైలుప్రయాణము చేయుదము. రండు. జిబూటి రేవు ఫ్రెంచివారిది. దానిచుట్టునుండు ప్రదేశమునకు ఫ్రెంచి సోమాలిల్యాండు అనిపేరు. ఇరకటము, దుర్గంధయుక్తము, నరకకూపము అయిఉండు జిబూటీ పట్టణమున ఏమాత్రమైన సుందరముగనుండు తావు రైలుస్టేషనే. ఇచటనుండి వారమునకు రెండుసారులు ఆడిస్ అబాబాకు రైలు బయలుదేరును. బయలుదేరువేళ ఉదయము ఏడుగంటలు. రైలుకదలి ప్రయాణము ప్రారంభించిన కొలదికాలమునకే ఫ్రెంచి సోమాలిల్యాండునందలి సైకతసముద్రములగు ఎడారులు మనదృగ్గోచరములగును.

ఆరైళ్ళ టైముటేబిళ్లు ఎంత ఆలస్యమైనను కూడదీసికొనుటకు వీలుగనుండునట్లు ఏర్పఱచబడియున్నవి. ఆ ఎడారిలో ఇసుకదుమారములేచి మూడుగంటలకాలము రైలు ఆపుచేయవలసివచ్చినను ఇంజనుడ్రైవరు ఆ పగటిప్రయాణమును సరిగా నిర్ణయింపబడిన కాలముననే ముగించుటకు అవకాశములు చేయబడినవి. ఇన్ని అవకాశములుండియు ఆ రైళ్లు ఒక్కొక్కప్పుడు తమ గమ్యస్థానము మూడుగోజు లాలస్యముగా చేరుటగలదు !

రైలుబండిలో కాలుపెట్టుటతోడనే మనము ముందుగా గమనించునది అవి మిక్కిలి సన్నమైయుండుట. ఒకఅడుగు మూడు అంశముల మీటర్ గేజి. రైలుబండిలో రెస్టారెంటు కార్లులేవు. కాని మధ్యాహ్నభోజనమునకు అనువైన స్టేషనులో రైలు చాల కాలమాగును. భోజ్యపదార్థములు ప్రశస్తములైనవి చౌకగాదొరకుట యొక విశేషము.

మొదటిరోజు ప్రయాణమున గాలిదుమారముల నెన్నిటినో మనము చూతుము. ఎంత దూరము చూచినను పచ్చనిచెట్టుకనిపించదు. ఉష్ట్రపక్షులు, కోతులు, గాడిదెలు, జింకలు మందలు మందలుగాపోవుచు పోవుచున్నరైలును ఆశ్చర్యముతోనో, భయముతోనో, నిర్లక్ష్యముతోనో చూచును. ఒంటెలపై ప్రయాణముచేయువారును మనకు కనిపింతురు. ఎండవేడిమి మాత్రము భరింపరానిదిగా నుండును. సాయంకాలమునకు కొంత శీతలప్రదేశమునకు చేరుదుము.

195 మైళ్లు ప్రయాణముచేసినతరువాత మొదటిరాత్రికి రైలు డైర్‌డావా అనుచోట ఆగును. అబిసీనియాలోనికి సరిహద్దు దాటి ఇప్పటికి 130 మైళ్లు వచ్చితిమి. రైలు డైరుడావా స్టేషన్‌కురావలసిన కాలము సాయంత్రము నాలుగుగంటల ముప్పదినాలుగు నిముసములకు. జిబూటీలోను, అబిసీనియా సరిహద్దున మరియొక స్టేషన్‌లోను తనిఖీజరిగియున్నను తిరిగి ఇచ్చటను కస్టమ్సు ఉద్యోగుల తనిఖీ తప్పదు. ప్రయాణికులతోబాటు వారి సామానులు కూడ రైలునుండి దిగవలసినదే !

డైర్‌డావా చిన్నపట్టణము. కాని క్రొత్తది. చక్కనిరోడ్లు. సుందరముగా నిర్మింపబడిన దుకాణములు. చక్కని పోస్టుఆఫీసు. బ్యాంక్ ఆఫ్ అబిసీనియా శాఖాకార్యాలయము. రాత్రి మకాముచేయుటకు అనువైన తావు. అచట విస్తరించియున్న నారింజచెట్లకే ఎలక్ట్రిక్ దీపము లుంతురు, చీకటిపడుటతోడనే అవివెలిగి చక్కని దృశ్యమును ప్రదర్శించును.

రెండవనాటి ప్రయాణపు దూరము 149 మైళ్లు. ప్రయాణమంతయు కొండలకు ఎగబ్రాకుట. రైలు రొజుకొనుచు ఎక్కును. ప్రక్కను అగాధము. ఉగ్రసుందరమగు దృశ్యము. ప్రొద్దువాటారగా రైలు హవాష్‌నదిపై ఉన్న స్టీలుగర్డరుల వంతెనమీద ప్రయాణము చేయును. బ్రిడ్జిదాటిన తరువాత హవాష్‌పట్టణము. ఆరాత్రి కక్కడే మకాము. డైర్‌డావావలె ఇది సుందరపట్టణముకాదు. భోజనపు సదుపాయము మాత్రము మామూలుగనే.

మూడవనాటి ప్రయాణప్రారంభమునకూడ రైలు ఇంకను కొండలు ఎక్కుచునే ఉండును. ఒకనాడు జ్వాలితపగుచునుండి నేడు చప్పగ చల్లారియున్న అగ్నిపర్వతముల నెన్నిటినో మనము చూతుము. ఒకస్థలమున ఐదు మైళ్ళపర్యంతమును ఈ అగ్నిపర్వతముల లావాగుండనే రైలు ప్రయాణముచేయును. 'క్రొత్తపువ్వు' అని అర్థముగల ఆడిస్ అబా

బా రాజధానీనగరము సమీపమున పడుచుండుటతో పచ్చనిచెట్లు హెచ్చుగా కనిపింప నారంభించును. కొన్ని వ్యవసాయక్షేత్రములు కానవగును. లెస్సగ ఎదిగిన యూక్లిప్టస్ వృక్షములు దృగ్గోచరములగును. తుప్పలతో నిండిన మైదానములు వెనుకపడును.

మూడురోజుల ఆరోహణప్రయాణము— గంటకు ఇరువదిమైళ్లు మించని వేగము. ఆ లంఖనాలబోటునకు స్వాగతమిచ్చుటకు ఆడిస్ అబాబా స్టేషన్ ప్లాటుఫారముపై ఇసుకవైచినరాల నంతమంది జనులు మూగుదురు. వారమునకు రెండుసారులుమాత్రము వచ్చు యీతపాలాప్యాసెంజరురైలును చూచుటకు వచ్చెడి జనులతో ప్రతిసారియు ప్లాటుఫారము ఇక్లే పిక్కటిల్లుచుండును.

ఇంగ్లండుదేశమున ఇదేదూరముగల ప్రయాణముచేయుటకు ఒక రైలుతీసికొను కాలముకంటె ఈరైలు ఐదురెట్లు ఎక్కువ కాలము తీసికొనును. ఐదువందలమైళ్ళ ప్రయాణమునకు మూడురోజులకాలము! పోనీ టిక్కెట్టుచార్జీ లేమైన తక్కువగానుండునా ? అదియులేదు. యీదూరమునకు ఇంగ్లండులో తీసికొను చార్జీకి కంటె ఇచట మూడురెట్లు ఎక్కువ వసూలుచేయుదురు. నేటి అబిసీనియా చక్రవర్తియగు రాస్‌టఫారీ విధానము వలన యీరైలుదారి నష్టమునుండి కిట్టుబాటు స్థితికి వచ్చినది. కాని చార్జీలు ఇంకను హెచ్చుగానే ఉన్నవి. సామాను చార్జీలు ఇంగ్లండులోకంటె పదునొకండురెట్లు హెచ్చు. ఒక టన్నుకు నలుబదిమూడు పౌనులు. జిబూటి నుండి ఆడిస్ ఆబాబాకు మొదటితరగతికి ఒక ప్రయాణికునకు చార్జి పదహారుపౌనులు.

కొత్తపువ్వుఅని అర్థముగల ఆడిస్ అబాబాలోని రైలుస్టేషను క్రొత్తగా కట్టబడినది. మిగుల విశాలమైనది. రెండు అంతస్థులుగల కాంక్రీటు కట్టడము. కప్పుగల ప్లాటుఫారము ఒకటే ఉన్నది. కస్టమ్సుఆఫీసరులు తమతనిఖీముగించులోపల ప్రయాణికులు సావకాశముగ స్టేషన్‌అంతయు చూచిరావచ్చును. ఒక్కొక్కప్పుడు ఈతనిఖీ మఱునాటికికూడ వాయిదాపడుటగలదు. 'రేపు, తప్పకుండా' అనుమాటలు ఆడిస్‌అబాబాలోని కస్టమ్సు ఉద్యోగుల పెదవులనుండి తఱుచు విందుము.

అబిసీనియాదేశములో ఇది ఒక్కటేరైలు దారి. దీని నిర్మాణము జిబూటినుండి 1897లో ప్రారంభమైనది. 1918 నాటికిగాని ఆడిస్ అబాబా చేరలేదు. పూర్తియగుటకు ఇరువదియొక్క సంవత్సరములుపట్టిన ఈఐదు వందలమైళ్ళ రైలుదారిపై ఒక్కప్రయాణము సల్పుటకు రైలునకు మూడురోజులు పట్టును. యాజమాన్యము ఫ్రెంచికంపెనీది.

ప్రయాణికులకు కంటె యీరైలుదారి సరుకురవాణాకు హెచ్చుగా ఉపయోగింపబడుచున్నది. వారమునకు రెండు ఎదర, రెండు వాలు మొత్తము నాలుగుమాత్రమే యీరైలుదారియందలి ప్రయాణికుల బండ్లు. కాని సరుకుబండ్లు రోజుకు నాలుగు ఎదర, నాలుగు వాలు బయలుదేరును. ఈ యుద్ధకాలమున ప్రయాణికుల బండ్లసంఖ్య కొంచెము హెచ్చియుండవచ్చును. సంఖ్య ఎంత హెచ్చినను రాత్రిప్రయాణము ఇంకను కలలోనివార్తగనే యున్నది.

ఆదారిలో రైళ్ళు రాత్రిపూటకూడ ప్రయాణముచేసిన సమయము ఒకటి కలదు. అది 1931-వ సంవత్సరమున రాస్‌టఫారీ— అబిసీనియా చక్రవర్తి – పట్టాభిషేకమహోత్సవసందర్భమున. అపుడు రైళ్లు రాత్రికూడ తెంపులేక నడుచుటకేర్పాట్లు చేయబడినవి.

# టాకీ యాక్టర్లకు టాకీ జాబులు

**శ్రీ. స్టార్ కంబైన్సువారి 'హరిశ్చంద్ర' టాకీలోని సత్యకీర్తికి:—**

రాజభక్తికి పేరుమోసిన నేను నీ వేషంలో రాజంటే లక్ష్యం లేనివాడిగా అయాను. హరిశ్చంద్రుడు చంద్రమతి అభ్యంతరమందిరంలో ఉండగా నీవు నిరభ్యంతరంగా అచటికి పోవడంఉండే రాజంటే నీకు బొత్తిగా భక్తిప్రపత్తులు లేవని తెలియజేస్తోంది. అడవిలో మతంగకన్యలు నాట్యం చేసేటప్పుడు వాళ్ళకేసి క్రీకంటితోనైనా చూడకుండా హరిశ్చంద్రుడు పరధ్యాన్నంగా వున్నాడనే కోపంచేత కాబోలు నీవు రాజుకూచున్న రాతివేదికమీద వెనుకనుంచి కాలు పెట్టావు. ప్రభువుగారి ఆసనానికి అయితేఅయింది కాని ప్రభువుగారికిమాత్రం నీ పాదస్పర్శ లేకుండా చేసినందుకు చాలా సంతోషిస్తున్నాను. మొత్తంమీద రాజులకు బలాదూర్ పెట్టే మంత్రులవర్గంలో జేరావు.

—హరిశ్చంద్రోపాఖ్యానములోని సత్యకీర్తి.

**శ్రీ. స్టార్ కంబైన్సువారి 'హరిశ్చంద్ర' టాకీలోని విశ్వామిత్రునకు :—**

'సీతాకల్యాణం' టాకీలోని నా (విశ్వామిత్ర) వేషానికి చాలాఆనందించాను. దానితరువాతనైన నీయొక్క నా వేషం దాన్నికూడా మించి నాకు ఆనందంకొల్పవలసింది. కాని నీ వేషం నాకు కొంచమైనా తృప్తి కలిగించలేదు. నా వేషం నీకు కొంచమైనా చేతకాకపోగా నాకోపంకూడా నీవు ఏమాత్రం అభినయించలేకపోయావు. మన మాతంగకన్యలను తిరస్కరించిన హరిశ్చంద్రుని కిరీటం ఘూడించి పాదాలతో తన్నవలసిన నువ్వు ఈటాకీలో తటపటాయిస్తూ కిరీటాన్ని అంటనా మాననా అని ఆలోచించి ఆలోచించి మోకాలుతో నెమ్మదిగా త్రోసినెట్టేవేం? స్టూడియోవారి చేతకిరీటం చెడిపోకుండా ఉండటానికిగాను కోపం ధూకుడు తగ్గించి ఘూంకారాన్ని మోతాదులో ఉంచేవా? సృష్టికి ప్రతిసృష్టి చేయగల నా వేషం వేసి వెధవ చేతకిరీటం చెడిపోతుందేమోనని అభాసుపనిచేశావు.

—హరిశ్చంద్రోపాఖ్యానములోని విశ్వామిత్రుడు.

**శ్రీ. స్టార్ కంబైన్సువారి 'హరిశ్చంద్ర' టాకీలోని హరిశ్చంద్రునకు :—**

కావ్యాలూ, నాటకాలు నాయొక్క నిరుపమానమైనసత్యాన్ని శౌర్యాన్ని బహుభంగుల కీర్తిస్తూ ఉన్నాయి. కాని నీ సినిమా వేషంలో నాసత్యం సంగతి ఎల్లాఉన్నా శౌర్యాన్నిమాత్రం హుళక్కి చేశావు. రాజుగావుండి మృగాల్ని వోమాదిరిగా వేటాడేవు. కానిరాచరికంవదిలి అడవుల్లో తిరుగుతూన్నపుడుమాత్రం అడవి జంతువుల్ని చూసి బెదరి బెండువడ్డావు; అదరి అడుగు వెనక్కువేశావు. రాజ్యంతోపాటు శౌర్యంకూడా వదిలేశావా? భేతాళుడితో యుద్ధంచెయ్యవలసిన నువ్వు ఆభేతాళుడికి అంత దూరంగా నిలబడ్డంలో అర్థం ఏమిటి? కొట్టనక్కర్లేకుండానే చంపే కొత్తశక్తిని దేన్నైనా సంపాదించావా? కథమూలంలోఉన్నట్లు నడుపుదామనే మంచితలంపు కలిగి-పాపం- భేతాళుడు తనకుతానే పొడుచుకుని ఆత్మహత్యచెసుకోబట్టి సరిపోయింది కాని నిజంగా వాడు ఎదురుతిరిగేఉంటే అసలు కథలో నేను భేతాళున్ని చంపిఉన్నా సినిమా కథలో భేతాళుడే నిన్ను చంపి కథ అడ్డంగా తిప్పి ఉండును. శౌర్యం ప్రకాశమానం చెయ్యవలసిన చోట నువ్వు వట్టిగద్దమ్మలా ఉండిపోయావు. అడివి మృగాలకు భయపడ్డ శూరశిఖామణివి నువ్వు భేతాళున్ని ఏంచంపుతావ్?

—హరిశ్చంద్రోపాఖ్యానములోని హరిశ్చంద్రుడు.

ఆంధ్రులకు

## సరస్వతీటాకీస్‌వారి సంక్రాంతి బహుమానము

---

# ఆంధ్రభూమిలో

ప్రసిద్ధిచెందిన నటవర్గము అంతయు
సరస్వతీటాకీస్ వారి

## ద్రౌపదీవస్త్రాపహారణ

చిత్రములో పాల్గొన్నారు.

సూపర్‌వైజింగ్ డైరెక్టరు :

## హెచ్. యం. రెడ్డి

డైరెక్టరు :

## హెచ్. వి. బాబు

ఆంధ్రుల అభిమానమునకు పాత్రులైన
క్రింది నటులిందు అభినయించుచున్నారు.

| | |
|---|---|
| యడవల్లి | సి.యస్.ఆర్. |
| నాగరాజరావు | వే. గగ్గయ్య |
| దొమ్మేటి | చొప్పల్లి |
| కన్నాంబ | రామతిలకం |

నగరాజకుమారి

*For Booking Apyly to:—*

**SARASWATI TALKIES, Ltd.,**

Camp: Palace Theatre Buildings,
KOLHAPUR.

'Grams: "SARASWATI,"
KOLHAPUR.



# ఈ నలుగురు యీ యుద్ధానికి సూత్రధారులు

బ్రిటీష్ ప్రతినిధి ఆంతోని ఈడెన్, ఫ్రెంచి ప్రతినిధి పెయిర్రీలావల్, అబిసీనియా ప్రతినిధి టెకిల్ హావారియట్, ఇటలీ ప్రతినిధి బారన్ అలాయిసి జాతిసమితిసభలో వాగ్యుద్ధము జరిపియు అబిసీనియాలో ఆయుధయుద్ధమును మాన్పలేకపోయినారు. మాన్పలేకపోవుటయేగాదు అందుకు వ్యతిరేకముగా ఈ యుద్ధానికి ఈనలుగురును సూత్రధారులు కూడ నైనారు.

## టెకిల్ హావారియట్

అందు ముఖ్యముగ అబిసీనియాప్రతినిధి జాతిసమితిసభలో వాగ్యుద్ధము ముగించుకొని వచ్చి ఇపుడు తనదేశపు ఆయుధయుద్ధమున ఒక ప్రధానపాత్రఅయినాడు. టెకిల్ హావారియట్ రష్యాదేశమున సైనికశిక్షణ మందినాడు. చిరకాలము రష్యాయందుండకుండగనే అబిసీనియాకు తిరిగిపోయి చెర్చర్ అను రాష్ట్రమునకు గవర్నరు అయినాడు. 1924 నుండియు పారిస్ మహానగరమున ఈతడు ఆబిసీనియా ప్రతినిధిగ ఉండుచున్నాడు. ఫ్రెంచి రష్యా భాషలను ధారాళముగ మాటలాడకలడు.

## బారన్ అలాయిసి

మరి ఈతని ప్రత్యర్థి దేశపుప్రతినిధి బారన్ అలాయిసి ప్రజ్ఞావిశేషములెట్టివి? టెకిల్ హావారియట్ వలెనే ఇతడును పలుభాషలు ఎఱిగినవాడు. రాయబారితంత్రమున అందెవేసినవాడు. ఆతంత్రము ఈతని ప్రధానవృత్తి. ముసోలినీకి ఈతనియెడ అభిమానము హెచ్చు. మరియు అలాయిసి అతిసుందరుడు. 1927–వ సంవత్సరమున ఇటలీ– ఆల్బేనియా సంధి రాయబారములను జయప్రదముగ నడపిన దీతడే. ఈరాయబారముల ఫలితముగా ఆల్బేనియా ఇటలీరక్షణక్రింద నుండుటకు అంగీకరించినది. కాని ఈతడు చేసిన అన్నికార్యములందును అధికమైనది రాజకీయప్రపంచమున అపూర్వమగు నొక దొంగతనము. అది ఐరోపామహాసంగ్రామసమయము. యుద్ధమున ఏపక్షమునందును చేరని స్విట్జర్లాండునకు చెందిన జూరిక్ పట్టణము. ఆస్ట్రియన్ కాన్సలేటు భవనమున అర్ధరాత్రి ముగ్గురు వ్యక్తులు ప్రవేశించిరి. అందొకడు అలాయిసి; మిగిలిన ఇద్దరు చోరకృత్యమున కృతపండితులైనవారును, ఇందుకొఱకు ప్రత్యేకముగా రోమునుంచి వచ్చినవారును. ఇటలీదేశమున ఆస్ట్రియావారికున్న చారులు, వారిసంస్థలు మొదలగు విషయములన్నిటిని తెలుపు డాక్యుమెంటులను బారన్ అలాయిసి ఆనాటిరాత్రి తన ఇద్దరి మిత్రులతో కలసి ఆఆస్ట్రియాకాన్సలేట్ కార్యాలయమునుండి తస్కరింపగలిగెను. దొంగతనమున దొరకయైన ఈరాయబారిని చూచిన ఇతరదేశపు ప్రతినిధులకు గుండె బెదురుగా నుండుటలో ఆశ్చర్యమేమి ?

## ఆంతోనియీడెన్

మరి ఇంక బ్రిటీష్ప్రతినిధి ఆంతోని ఈడెన్ ఎట్టివాడు ? ఐరోపామహాసంగ్రామానంతరము ఈతడు ఆక్స్ఫర్డు విశ్వవిద్యాలయపు ప్రాచ్యభాషాపరీక్షలయందు ఉత్తమ

శ్రేణిలో కృతార్థుడయ్యెను. ఈతని కిప్పటికి ముప్పదియేడేండ్లయినను నిండలేదు. జాతిసమితి సభ్యదేశములకెల్ల బ్రిటీష్ సామ్రాజ్యము పెద్దది. ఆపెద్ద సామ్రాజ్యపు ప్రతినిధి ఈడెన్ వివిధదేశపుప్రతినిధు లందఱికంటెను చిన్నవాడు. కాని ఈముప్పదియేడువత్సరములందే ఈడెన్ విశేషమగు లోకానుభవము నార్జించెను. పదునేడేండ్ల బాల్యముననే ఇతడు ఈటన్ కళాశాల వీడెను. సైనిక శిక్షణమున చేరెను. యుద్ధకాలమున మూడేండ్లు సైనికుడుగా ఫ్రాంసుదేశమున పనిచేసెను. యుద్ధము ముగిసినతరువాత తిరిగి ఆక్సుఫర్డు విశ్వవిద్యాలయమున ప్రాచ్యభాషాభ్యసనము. పిమ్మట వార్తాపత్రికానిర్వహణవృత్తిలో ప్రవేశించెను. యార్కు షైర్ పోస్టు అను పత్రికకు యజమానులలో ఇతనిమామ యొకడు. ఆపత్రికకు ఇతడు కళావిమర్శకుడుగా, తరువాత రాజకీయవిలేఖరిగా పనిచేసెను. ఈవృత్తియందుండినపుడే వార్విక్ ప్రతినిధిగా నితడు పార్లమెంటు సభ్యుడయ్యెను. పార్లమెంటునందితనిఅభివృద్ధి హుటాహుటినడలతో సాగెను. నేటి ఆంగ్లపార్లమెంటుసభ్యులందరిలోనికి ఇతడు చాల కష్టపడి పనిచేయును.

## పెయిర్రీ లావల్

ఇక ఈయుద్ధమునకు సూత్రధారులలో మిగిలినవాడు లావల్. యూరోపియన్ రాజ్యాంగవేత్తలయందు బహుదేశములుతిరిగినవారిలో లావల్ అగ్రసరుడు. ఇటలి, ఇంగ్లండు, అమెరికా సంయుక్తరాష్ట్రములు, యుగోస్లావియా, జెకోస్లావాకియా దేశములు రాజకీయసందర్భమున ఇతడు చూచియున్నాడు. ఇతడు పొట్టిగా బొద్దుగా నుండును. ఎంతటికష్టపుపనియైన చేయుటకును, ఎంతకాలమైన తెంపులేక పనిచేయుటకును ఇతనికి దమ్ముఉన్నది. ఇతనితండ్రి హోటలుయజమాని. కాని ఆవృత్తిలో అతడు జయమందలేదు. కాగా లావల్ చిన్నతనమున స్వయంకృషివలననే చదువుకొనవలసి వచ్చెను. పదునొకండేండ్లకే ఇతడు గ్రీకుభాషను లెస్సగ అభ్యసించెను. ఈసంగతి గమనించి ఇతని జన్మస్థలమునందలి మతాధికారి ఎట్టిజీతమును పుచ్చుకొనకయే చదువుచెప్పెను. చదివి లావల్ న్యాయవాది ఆయెను. ఫ్రెంచి మంత్రాంగమున ఇతని మొదటిపదవి న్యాయశాఖాధ్యక్షత. న్యాయశాఖాకార్యాలయములందు టైపురైటర్లను ఉపయోగింపరాదని ఫ్రెంచిప్రభుత్వపు పిచ్చికట్టడి. 1926-వ సంవత్సరమున ఇతడు న్యాయశాఖాధ్యక్షుడగుటతో ఆకట్టడి తొలగింపబడెను. అప్పటిలో ఈమార్పు ఇతని క్రింది ఉద్యోగులకు భీతిని గొల్పినది. ఫ్రెంచి రాజ్యాంగమున అతిలోకుడైన బ్రియాండు ఇతని రాజకీయగురువు. అతనివలె ఇతడును మొదట అతివాది, కాలక్రమమున మితవాదిఆయెను. ఇంగ్లండున లాయడ్ జార్జివలె ఫ్రాన్సున ఇతడు పేదఇంటపుట్టి స్వశక్తిచే చదువుకొని తన దేశమునకు ప్రధాని అయినాడు. ఫ్రెంచినాయకులకు ఏదేని నొక పిచ్చియుండుట మామూలు. అట్లే ఇతనివిషయమునకూడ. ఇతడెప్పుడును తెల్లటి నెక్టైనే ఉపయోగించును. రంగుపిరాయించడు. అతివాదమునుండి మితవాదమునకు రాజకీయమున రంగుపిరాయించిన ఇతడు తనదుస్తులలో ఈనెక్టై విషయము రంగు పిరాయించకుండుట పిచ్చికాక మరియేమి? ఇంతకును ఎవరిపిచ్చి వారి కానందముగదా !

ఆంధ్రభూమియందు ప్రప్రథమమున స్థాపింపబడిన

# ఆంధ్ర ప్రావిడెంటు కంపెనీ,

లిమిటెడ్

ప్రధాన కార్యస్థానము :— బెజవాడ. స్థాపితము 1929.

మేనేజింగు డైరెక్టరు :

మ-రా-రా-శ్రీ దిట్టకవి వీరరాఘవయ్యపంతులుగారు.

స్వల్ప ప్రీమియాములు. నవీనపద్ధతులు.

ఏజంట్లకు ధారాళమైన కమీషను యియ్యబడును.

జననభీమా శిశుపోషణకు గొప్ప సహాయకారి.

ప్రత్యేక సౌకర్యములు.

1. స్త్రీ పురుషులకు సమానమైన ప్రీమియం రేట్లు.
2. రు 100 లు మొదలు రు 500 ల వరకు పట్టాలు జారీచేయబడును,
3. వైద్యపరీక్ష లేని భీమాపద్ధతులు,
4. క్లెయిములు గ్యారంటీ చేయబడినవి,
5. పట్టాదారులకు ఋణము లియ్యబడును,
6 జననభీమాలో నెలకు 1 రూ. లేక 2 రూపాయిలు ప్రీమియం చెల్లించిన రు 500 లు లేక రు 1000 ల వరకు క్లెయిమును పొందవచ్చును. కవల పిల్లలు జనించిన రెండు క్లెయిములు యియ్యబడును.
7 ఉత్తర ప్రత్యుత్తరములు తెలుగుభాషలో జరుపవచ్చును.
8. పట్టాదారులకు ఫలప్రదమును సహాయకరమునగు సేవయే ఆదర్శము.

పూర్తి వివరములకు :

సూపరింటెండెంటు ఆఫ్ ఏజన్సీస్.

ఆంధ్రప్రావిడెంటుకంపెనీ,

గాంధినగర్, బెజవాడ.



స్త్రీలు పూజింపబడుచోట దేవతలు క్రీడింతురు.

# మహిళాలోకము



## యుద్ధప్రశంసలోనున్న ఇటలీ అబిసీనియా స్త్రీలు

అది క్రీస్తుశకము 1008-వ సంవత్సరము డిసెంబరు 31-వ తేదీ. గజినీమహమ్మదు హిందూదేశముపై నాల్గవసారి ఎత్తివచ్చినాడు. ఆ దేవాలయధ్వంసకుని ఎదుర్చుటకు ఆనందపాలుడను రాజపుత్రుడు గొప్ప హైందవసేనను సమకూర్చెను. హిందూసేనలు యుండ్ అనుతావునకును పెషావరునకును నడుమ విడిసెను. మహమ్మదుసేనలు యీప్రచండ హైందవసైన్యమును వెంటనే తాకుటకు సాసాహసములేక తటపటాయింపుతో నలుబది దినములు గడఛిపుచ్చెను. ఈనలుబది రోజులలో ప్రతిదినమును హైందవసేనలో దేశస్వాతంత్ర్యసంరక్షణకాంక్షతో వేలకొలది సైనికులువచ్చి చేరుచునే యుండిరి. అయితే లక్షలకొలది కూడిన ఆసైనికులకు వలయు ఆహారపదార్థములు సమకూర్చుట యొక సమస్యఆయెను. ఆ ఆపత్కాలమున ఆసైనికుల భార్యలు తమ శరీరములపై గల సువర్ణభూషణముల నన్నిటిని తీసి అమ్మివైచి ఆధనముతో సమరాంగణముననున్న తమ భర్తలకు వలయు ఆహారపదార్థములు కూర్చిరి.

ఇట్లే దేశమునకు ఆపత్కాలము సంభవించినపుడు ఆ దేశపు పురుషులతోబాటు స్త్రీలును అపూర్వత్యాగముచేసిన నిదర్శనములు ప్రతిదేశచరిత్రయందునుగలవు. ఇపుడు యుద్ధమున తగుల్కొని యున్న ఇటలీ అబిసీనియా దేశముల కిది ఆపత్కాలమే.

ఇటలీదేశ మిపుడు నానాజాతిసమితివారి నిబంధనలను ఉచ్చులనడుమ చిక్కినది. ఆదేశపు సరుకు ఇతరదేశములకు పోవుటయు, ఇతరదేశముల సరుకు ఆదేశమునకు వచ్చుటయు బందు అయినది. ఆహారపదార్థములకే కఱువు ఏర్పడవచ్చును. ఈ ఆంక్షలను ప్రతిఘటించుటకు ఇటాలియన్ పురుషులతోబాటు స్త్రీలును విశేషకృషిగావించుచున్నారు. గత ఐరోపామహాసంగ్రామమున ప్రాణములనుగోల్పోయిన సైనికుల భార్యలును, తల్లులును ఒకసంఘముగా ఏర్పడియున్నారు. ఆ వీరపత్నులయు, వీరమాతలయు సంఘమునకు చేరినస్త్రీలు ఇంటింటికివెళ్ళి దేశక్షేమము కొఱకు ఆహారపదార్థములవ్యయమును తగ్గింపవలసినదని ప్రచారప్రబోధములను కల్గించుచున్నారు. ఆ దేశపుపూర్వసువాసినులిట్టి విషయమున కష్టించుచుండ పుణ్యస్త్రీలు మాత్ర మెట్లూరకుందురు? వారు పాయరాని తమ వివాహపుటుంగరములనే తీసివైచి ముసోలినీ నియంతకు పంపుచున్నారు. ఆబంగారపుటంగుళీయకములను గైకొని ఆనియంతవానికి ప్రత్యామ్నాయముగ ఉక్కు ఉంగరములను ఇచ్చుచున్నాడు. ఆ ఉక్కుఉంగరములపై 'దేశముకొఱకు' అను అక్షరములు ఉట్టంకితము చేయబడుచున్నవి. నాలుగుకోట్ల

ఇరువదియేడు లక్షల జనాభాగల ఇటలీదేశమున ఒకకోటిమంది గృహిణులిట్లు తమ బంగారపు టుంగరములను ఆంక్షలను ప్రతిఘటించుటకు సమర్పింపనున్నారు. ఈవిధమున నూటయేబదిలక్షల పౌనుల బంగారము ముసోలినీకి ముట్టుచున్నది. ఆఉక్కుఉంగరములు ఆస్త్రీల త్యాగశీలమునకు అమోఘనిదర్శనములు.

ఇట్టి పరిస్థితులలో, పాపము, అబిసీనియను స్త్రీలు ఏమిచేయుచున్నారో కొంచెము చూతము. యుగముల తరబడిని వారనుభవించుచున్న స్వాతంత్ర్యము యీనాటితో నమసిపోవునేమో అను భయమున వారు విచలితులగుచున్నారు. అబిసీనియా చక్రవర్తి రాస్‌టఫారీ భార్య యుద్ధప్రారంభమునకు పూర్వము అసలు యుద్ధమే పొసగకుండ చేయమని భగవత్ప్రార్థనము సల్పి కొన్నినాళ్లు ఉపవాసదీక్షలో ఉండినది. కాని భగవంతు డామెమొఱల నాలకింపలేదు. యుద్ధము పొసగినది! అయితే ఆదేశపుస్త్రీలు యుద్ధమనిన భయపడువారు కారు. ఆ దేశచరిత్రలో వారు కత్తిపట్టి కదనరంగమున కుతికిన నిదర్శనము లెన్నియోగలవు. సంసార రంగముననే గాక యుద్ధరంగమున గూడ వారు తమ భర్తలకు సహధర్మచారిణులై యుండిరి. పాత్రలతో వంటచేయుట కెంతప్రియము పడుదురో, చేతులతో చిన్నారిబిడ్డల సాకుట కెంత ఇష్టపడుదురో, శూలు బల్లెముల ధరించి కయ్యముచేయుటకును వారు అంత ప్రియమును, అంత ఇష్టమును కలిగి యుందురు. పైగా నలుబది సంవత్సరములకు పూర్వము ఇటాలియన్‌లను ఓడించిన అబిసీనియాచక్రవర్తి మెనెలెక్‌తో కూడ యుద్ధమునకు వెడలియున్న ఆతని నాలగవభార్య టైటూ ఆదర్శము ఆదేశస్త్రీలయందు ఇంకను జ్వలితమగుచునే యున్నది. కావుననే 'మాభర్తల తోపాటు మేమును యుద్ధభూమికి వెళ్లుచున్నాము. వారికి అచ్చటకూడ మేమే వంటచేసి పెట్టుచున్నాము. సర్వకాల సర్వావస్థలయందును వారికి ఉత్సాహము కల్గించుచున్నాము. వారికి గాయములు తగులుచో సాకుచున్నాము. అవసరమగుచో ఆహవరంగమునకూడ ప్రవేశించుచున్నాము.' అని అబిసీనియను స్త్రీలు చెప్పుచున్నారు. వేలకొలది అబిసీనియను స్త్రీలు ఇపుడు సైన్యమున చేరుచున్నారు. స్త్రీసైనికదళమున కొకదానికి నాయకురాలు వెజారో అనునామె. ఆమె వ్యాయామసుస్నిగ్ధకాయము చూపఱను సంభ్రమాశ్చర్యములందు ముంచును. ఆమె ముప్పదినాలుగేండ్ల ప్రౌఢవనిత. ఆమె తనదళమును చక్రవర్తికి సమర్పించినది. ఆత డంగీకరించినాడు. ఆసందర్భమున ఆమె ఇట్లు చెప్పినది. 'పార్శ్వవర్తినులమై పడతులమగుమేము సమరముచేయుచుండగా చూచుచు మాతండ్రులు, సోదరులు, భర్తలు సింహవిక్రములై యుద్ధముచేయుదురు.' నిజమునకు అట్లే జరిగినది. ఆమె తన భర్తయగు మైకేల్‌తో కలిసి దక్షిణరంగమున ఇటాలియను సైనికుల నెదిర్చినది. వారిని ఓడించినది. తుపాకిగురియందు ఆమెకు గల నేర్పు నిరుపమానమైనది. దేశస్వాతంత్ర్యరక్షణమున పరవశురాండ్రయియున్న ఆ అబిసీనియను వీరాంగనలనుండి ఇట్టి సాహసికురాం డ్రెందరు బయలుదేరుదురో? అబిసీనియా చక్రవర్తిని చెప్పనే చెప్పినది: 'మాకు స్వాతంత్ర్యమే సర్వస్వమును. మానేలలో సూదిమొన మోపగల యంత ప్రదేశమేని ఇతరులకు పోవ్వట మేము సహింపము. పురుషులతోగలసి స్త్రీలమగుమేమును తుదిదాక పోరుచునే యుందుము.'

# కారపుశనగలు

నేను మద్రాసుకువచ్చిన కొత్తలో కొందరు మిత్రులతో ట్రిప్లికేన్ బీచికి షికారు పోయాను. మాసిపోయి మాగువారి ఉన్న గుడ్డకప్పిన చిన్న తట్ట ఎడంచేత్తో పట్టుకుని కుడిచేత్తో చిన్న బెత్తంఒకటి పట్టుకుని ఈగల్ని తోలుతూ 'కడలిబరాణీ, కడలిబరాణీ' అని కేకవేసుకుంటూ ఒక ముసిలివాడు అక్కడ తిరుగుతూ ఉన్నాడు. 'కడలిబరాణీ' అంటే ఏమిటని నాకు జిజ్ఞాస బయలుదేరింది. బరాణీ అంటే బరాణీలు; కడలి అంటే ఏమిటి అనుకున్నాను. ఎల్లిఅంటే రేపు అనీ, గొడుగుఅనీ రెండు అర్థాలు అంతక్రితమే చెప్పి అక్కడున్న మామిత్రులందరిలోకీ తానే తెలివైనవాడి ననుకుంటూవున్న ఒక ఆంధ్రసచిత్రమాసపత్రిక సంపాదకున్ని చూచి 'కడలి' అంటే ఏమిటన్నాను. తన భాషాపాండిత్యం వెల్లడిస్తూ ఆయన తడుముకోకుండా కడలి అంటే సముద్రం అన్నాడు. 'సముద్రంబరాణీ' ఏమిటి అని నేనన్నాను. సముద్రంఒడ్డునఅమ్మే బరానీలని అతడు తన అర్థాన్ని సమర్థించాడు. కాని నాకుకలిగిన అనుమానం పోలేదు. ఆకడలిబరాణీ మనిషిని పిలిచి మాట్లాడాను. వాడికి తెనుగుకూడావచ్చు. నాప్రశ్నకు వాడు 'కడలి' అరవశబ్దంఅనీ, దానికి తెలుగులో శనగలు అర్థంఅనీ చెప్పేడు. కడలిబరాణీ అనగా శనగలూ, బరాణీలు అని అర్థం తేలింది. మాసంపాదకుడు మాత్రం మతాబా కాల్చాడు. మద్రాసులోనే చిరకాలంగా వున్న ఆసంపాదకుడు దీన్ని అంతవరకు తెలుసుకోకపోవడం విచిత్రంగానే ఉంది. ఇల్లా మాడినప్పటినుంచి ఆసంపాదకుడు తనపత్రికలో ప్రచురింపబడే వ్యాసాల్లో ఏమేనా సందేహాలువస్తే మునపటిలా దిద్ది దూడల్ని వెయ్యకుండా ఇప్పుడు అల్లాంటిచోట వట్టి ప్రశ్నార్థకపు గుర్తులు మాత్రం వేస్తున్నాడు.

... ... ...

నిరుటిలాగ మళ్ళీ ఈయేడు రైలువాళ్లు పదిరూపాయిల టికెట్లు క్రిస్టమసుకి పెట్టబోతున్నారు. కాబట్టి నిరుటిలాగే ఈయేడుకూడా ఆంధ్రులు చాలామంది తుంగచాపలు, దవనంగడ్డి, ఇనపపొయ్యిలు, కుంపటిపొయ్యిలు, బాల్చీలు కొనుక్కోవడానికి మదరాసువస్తారు. వారంతా ట్రిప్లికేన్ బీచ్‌కి కూడా వచ్చి రేడియోసంగీతం విన్నా వినకపోయినా ఒకకానిపెట్టి ఈ కడలిబరాణీలుకూడా కొనుక్కుంటూరుగాక! అవి కొనుక్కోవడంతో వారి యాత్ర పూర్ణయాత్ర అవుతుందని మనవిచేస్తున్నాను.

... ... ...

అబిసీనియా ఇటలీ యుద్ధఫలితాలు హిందూదేశంలో స్పష్టంగా కనిపిస్తున్నాయి. కలకత్తాయందు గ్లిసరైన్ ధర పెరిగింది. కరాచీలో నిమ్మకాయలకు గిరాకీ తగిలినట్లే తగిలి తిరిగి తాజాస్థితికి వచ్చింది. సర్వవిషయాలూ చర్చించే ఆంధ్రభూమి సర్వవిషయాలూమాని ఒక్క యుద్ధవిషయాలమీదే శ్రద్ధ పెడుతూంది. కులాసాకథలపత్రికఅయిన వినోదిని ప్రత్యేకయుద్ధవిలేఖరిని సంపాదించింది. అదీ యిదీ చేతగాక బందరునుంచివచ్చే 'నవ్వులరాణి' పత్రిక ఇతర పత్రికలనుంచి యుద్ధవిషయక వ్యాసాలు దొంగిలిస్తోంది.

... ... ...

ఉత్కళరాష్ట్ర నిర్మాణసందర్భమందు బరంపురం ఆంధ్రులు తమపట్టణం తెలుగుమాగానిలోనే ఉండిపోవడానికి చాలా ఆందోళన చేశారు. కాని వారికి ఇతర ఆంధ్రులు ఎవ్వరూ సాయంచేయకపోయిన కారణంచేత బరంపురాన్ని మరికొంత తెనుగుదేశాన్ని తమరాష్ట్రంలో ఉత్కళులు కలుపుకోకలిగారు. ఇపుడు ఉత్కళులకింకా రాజధానిసమస్య వీడలేదు. కటకమా, బరంపురమా అనే మీమాంస బయలుదేరింది. ఉత్కళరాష్ట్రంలో చేరకుండా వుండడానికి ఇదివరకు ఉత్కళులతో విరోధపడ్డ బరంపురం ఆంధ్రులు ఇపుడు బరంపురంఉత్కళులతో జట్టుకలిపి

ఉత్కళరాజధాన్ని బరంపురం రప్పించడానికి తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. దేశంలో ఉండడానికి సాయం చెయ్యకపోతే చెయ్యకపోయారు కాని పోనీ ఉత్కళరాజధానీనగరం బరంపురం తెప్పించడం విషయంలోనన్నా మనఆంధ్రులు బరంపురం ఆంధ్రులకు సాయపడతారనుకుంటాను.

... ... ...

రాజమండ్రీలో వీరేశలింగంగారి శిలావిగ్రహ ప్రతిష్ఠ, విశాఖపట్టణంలో రామచంద్రశాస్త్రిగారి షష్ఠిపూర్తిఉత్సవం ఒక్కనాడే జరిగేటట్లు ఏర్పాటు చేసిన ఆయాఉత్సవముల అధికారులను నేను ఎంతమాత్రం అభినందించలేకుండా ఉన్నాను. తెనుగువారిలో ఐక్యత లేవనడానికి ఇది ఒక నిదర్శనం. వీరుల్ని పూజించే సందర్భంలోనైనా ఏకాభిప్రాయానికి రాలేని ఆంధ్రులు ఇంక ఏసందర్భంలో ఏకాభిప్రాయానికివస్తారో తెలియకుండావుంది. ఏకాభిప్రాయంలేని పూజలు ఎందుకు?

... ... ...

తమిళదేశపు యాత్ర ముగించుకొని ఆంధ్రదేశపు యాత్ర ప్రారంభించడానికి బాబు రాజేంద్రప్రసాదు మదరాసునందలి ఎగ్మూరుస్టేషన్‌లో దిగారు. ప్రకాశంపంతులుగారు, సత్యమూర్తిగారు ఆహ్వానించారు. కారు స్వరాజ్యపత్రికా భవనానికి వెళ్ళింది. ప్రకాశంగారు రాజేంద్రబాబునకు స్వరాజ్యపత్రికాభవనాలు, యంత్రాలు చూపిస్తున్నారు. సత్యమూర్తిగారు సత్రకాయలా కూడానే ఉన్నారు. రాజేంద్రుడు అంతకుపూర్వం ఎప్పుడూ లినోటైపుయంత్రం చూడలేదు. అచట ఒక లినోటైపు యంత్ర చూసి ఆయన 'ఇదేమిటి ఇంత క్రెడిల్ ఉంది' అని అడిగారు. అది క్రెడిల్ కాదనీ లినోటైప్ యంత్రమనీ ప్రకాశంగారు చెపుతున్నారు. ఇంతట్లో పిలవని పేరంటంగా సత్యమూర్తిఅయ్యరుగారు హిందూ ఆఫీసులో ఇంతకంటే గొప్పయంత్రాలున్నాయనీ పోయి చూద్దామనీ అన్నారు. రాజేంద్రుడు ఇపుడు కాదన్నాడు. దాంతో సత్యమూర్తి మానవుడు కుంగిపోయాడు. తానంటే రాజేంద్రప్రసాద్ మీటింగుల కన్నిటికీ ఎవరూకోరందే అధ్యక్షుడుగా కూచుంటూ వచ్చేడుకాని ఉచితం, అనుచితం ఎరిగిన రాజేంద్రుడు హిందూఆఫీసువాళ్లు పిలవందే అచటికి పోతాడా?

—వి. విశ్వనాథము, బి. ఏ.


# ధన్వంతరినిఘంటువు

నిఖిలపదార్థనామగుణప్రతిపాదకమైన ఈవైద్యనిఘంటురత్నముయొక్క ఐదవకూర్పు ప్రతులు చాలరోజులక్రితమే అయిపోయినవి. వాని ప్రతులకొరకు ఈ నడుమ పలువురు వ్రాసి ఆశాభంగము పొందియున్నారు. ఇపుడు ఆరవకూర్పు ముద్రించియున్నాము. పిడుగువారి వైద్యగ్రంథముల ప్రసిద్ధినిగూర్చి ఆంధ్రులకు ప్రత్యేకముగా చెప్పవలసిన పనిలేదు.

ఈ నిఘంటువు డెమ్మీసైజున 300 పుటలు. ప్రతి ఒక్కింటికి రూ. 2-8-0.

వెంటనే ఆర్డరుపంపుడు.

వలయువారు :

## పిడుగు వెంకటకృష్ణారావు పంతులు

2/40 పెద్దినాయని వీధి, మదరాసు.

అని వ్రాయునది.

# ఇన్సూరెన్సు విషయములు

## ఇన్సూరెన్సే నిజమైన సామ్యవాదము

మానవులకు శత్రువులైనవారెవ్వరు? మానవులకు మానవులే ప్రబల శత్రువులు. కట్టుకొనుటకు సరియైన బట్టలులేకను, తినుటకు సరియైన తిండిలేకను పలువురు మానవులు అల్లాడుచుండుచో– సుఖజీవనమునకు అత్యవసరమైన సామాన్యపు వస్తువులనే అందరు మానవులును పొందలేక పోవుచుండుచో– దానికి హేతువు మానవులే. ఆశాపీడితులును, అహంకారపూరితులును అగు కొందఱు మానవులు ధనమును తమ అవసరముకంటె హెచ్చుగా కూడబెట్టి వేలకొలది తోడిమానవుల సుఖమును దొంగిలించి వారికంటె తాము హెచ్చు సుఖములను బడయుచున్నారు. ధనము ఇట్లు కొద్దిమంది చేతులలో పేరుకొనిపోకుండ సమముగా పంపకమగుచో ప్రపంచమునందలి ప్రతి మానవునకును కావలసినంత ఆహారము, కావలసినన్ని వస్త్రములు లేకుండనుండునా? ధనము సముగాపంపకమే అగుచున్నచో లోకమున ఒకచోట పూర్తిగా తిండిలేక మలమల మాడుట, ఒకచోట సగమాకలితో సంకటపడుట, ఒకచోట అక్కరకుమీరిన ఆహారవస్త్రములు ఉండి ఉచితోపయోగమందక వ్యర్థములగుట ఏల సంభవించుచున్నది?

మానవుడు ప్రకృతిచేత ఆశాపూరితుడు. అగుటచే ఇతరులసుఖమును ఆచుకొని తాను అధిక సుఖములందుచుండుటకే అతడు పట్టిఘడియలు చింతించుచుండును. ఒకొక్కడు ఇతరులకంటె మేధావియై పుట్టుచున్నాడు. ఒకొక్కడు ఇతరులకంటె అధిక విద్యాలాభమునకు నోచుకొనుచున్నాడు. ఒకొక్కడు అధికధనసంపదకు వారసుడగుచున్నాడు. అత్యధిక మేధాశక్తి, అధికవిద్యాలాభము అధికధనసంపద అను ఆయుధములతో వారు తమకు కావలసినదానికంటె హెచ్చు వస్తువులను, హెచ్చు సుఖమును పొందుచున్నారు.

జగమునకంతకును ధనమే మూలమందురు. ప్రపంచమందలి అసమత్వమునకు ఆ ధనమే ప్రధానహేతువు. సామాన్య సంసారి అవసరపు వస్తువులను కొనుటకే డబ్బులేక అల్లాడుచున్నాడు. అక్కతమున తిండిలేమి, సగము ఆకలి – వానివలన చెప్పరాని దైన్యము, సాటిలేని దుఃఖము కలిగి లోకమును కలుషితమొనర్చుచున్నవి. ధనవంతున కింకను ధనవంతుడను కావలయుననికాంక్ష. వారిలో కొందఱు ఆధనము తమకుగాని, సంఘమునకుగాని ఉపయోగపడని రీతిని కూడబెట్టుచున్నారు. తమచేతులనుండి ఆధనము జారిపోవునేమో అను భయముచేతనే వారు దానినిట్లు నిరుపయోగముగ కూడబెట్టుచున్నారు ఆధనము తమ చేతులను విడిచిపోకూడదను

విశేషకాంక్షవలన వారు ఆధనము వాడుకలో లేకపోవుటచేత ప్రజాసామాన్యమునకేమియు దానివిలువ లేకుండ పోవుచున్నదని కాని, సంఘముయెడల తామొక దౌర్జన్యము చేయుచున్నామని కాని తలంపకున్నారు.

ధనమునకు దానంతట దానికి విలువ లేదు. వస్తువులను పొందుటలో అదియొక సాధనము మాత్రమే. దాని కొనుగోలు శక్తివలన అది వాడుకలో ఉన్నప్పుడే దానికొక విలువ కలుగుచున్నది. లోభివాడు ధనమును కూడబెట్టుచున్నాడు. ఇతరులు వానిని ధనవంతుడనుకొందురు. కాని నిజమునకు వాడు నిరుపేదకంటెను నికృష్టజీవితముగడుపును. జీవితపు ముఖ్యావసరములుకొని డబ్బు వెచ్చపెట్టుటకు ఆలోభివాడంగీకరింపడు. ధనము వెచ్చించుట కిచ్చగింపక వాడు దుఃఖమయదరిద్ర జీవితముననే మ్రగ్గును. అధికధనమును కలిగియుండుట ఒక్కటే సుఖమయజీవనమునకు సూచనగాదు. సుఖము ధనమాత్రముచే కొననరానిది. తన అక్కరకురాక, సంఘమువారి ఉపయోగమున కందక పెట్టెలలో మూలుగుచుండు ధనము దుఃఖమునకు భాజనమైనది. సవ్యముగ ఉపయోగింపబడినప్పుడే ధనము ఒక శక్తియై యజమానికిని, ఇతరులకును సుఖమును, పలుకుబడిని యిచ్చుచున్నది.

ధనమును పొందియుండుటవలనకంటె పొందవలయునను తీవ్రకాంక్షవలననే హెచ్చు సుఖము చేకూరుచున్నది. ధనము పొందవలయునను సముచితమగు తీవ్రకాంక్ష మానవుని సత్యమార్గమున లెస్సగ కష్టించువానిగా నొనర్చుచున్నది. ధనము పొందుటకుగాను తాను ఎన్నుకొన్న పద్ధతులలో పనిచేయుచుండునపుడు మానవుడు పొందు మానసికానందము నిరవధికమైనది. అతనికి అధికసుఖమును గూర్చెడువానిలో ? అది నిరుపమానమైనది. నిజముగా ధనమును పొందిన తరువాత అంత ఆనందముండనేయుండదు. కొంత చేరినతరువాత మఱికొంత సంపాదింప మానవునిలో దురాశ ప్రవేశింపవచ్చును.

సామాన్యముగ తమకొఱకును, సంఘముకొఱకును ధనము వెచ్చించువారి చేతులలోనికే ధనము ప్రవహించుచుండును. దీనికి ప్రకృతినుండి ఒక సాదృశ్యము చూపవచ్చును. మంచి ఊటగల నూతిలో నీరు పూర్తిగా తోడివైచుచున్నను తిరిగి కొద్దికాలములో జలము ఊరును. ఆనూతిలో నీరు అసలే తోడకపోయినచో అందలి జలము కాలక్రమమున ఎండిపోవుటయో, లేక అన్యమార్గములను ప్రవహించిపోవుటయో జరుగును. నిరుపయోగముగ కూడబెట్టబడిన ధనమిట్లే దొంగలపాలగుటయో, తనతరువాతి తరమువారు గడింపకపొందిన ధనమగుటచే దాని విలువ తెలిసికొనలేక దానిని దుబ్బారాచేయుటయో జరుగును. అట్లుగాక ఉచితమైన ఉపయోగమున పెట్టబడిన ధనము తనకు, తన పొరుగువారికి, సంఘమునకు సుఖమునిచ్చును.

అట్లు ధనమును ఉచితమైన ఉపయోగమున పెట్టుటకు ఇన్సూరెన్సుకు మించిన సాధనము మఱియొకటి లేదు. ఇన్సూరెన్సుకు ఇతరమైన ప్రవృత్తియందైనను ధనమునకు అసమవిభాగమే. ఈఅసమవిభాగమే ప్రపంచమునందలి పలుప్రజల దుఃఖభాజనజీవనమునకు హేతువు. కావున ఇన్సూరెన్సువిధానమవలంబించి ఈ అసమవిభాగమును తొలగించి ప్రజాసామాన్యపు సాముదాయక సుఖానందములకు దోహదముచేసి నిజమైన సామ్యవాదు లయ్యెదరుగాక !

—యస్. పా యే.

# "ఆంధ్రభూమి" పుస్తకపీఠము

## ౧౨౨. రసరత్నాకరము

ఇది నిత్యనాథసిద్ధ విరచితము. ఐదుఖండముల గ్రంథము. రసఖండము, రసేంద్రఖండము, రసాయన ఖండము, వాదఖండము, మంత్రఖండము అనునవి ఐదుఖండములు. ఈ ఐదుఖండములందు మొదటిదగు రసఖండమునకు వైద్యవిద్వాన్ యస్. కృష్ణమాచార్యులుగారు, బి.ఏ. ఆంధ్రతాత్పర్యమును రచించి ప్రథమసంపుటముగా ముద్రించి ప్రకటించియున్నారు. ఇందు ఉపదేశములుగలవు. రసవిజ్ఞానము, ఉచితమగు యంత్రములు, శుద్ధివిధానము, విషవిజ్ఞానము, వస్తుగుణ విజ్ఞానము మొదలగు విషయములను ఈగ్రంథము లెస్సగ నుపదేశింపచాలియున్నది. రస వైద్యమును విశేషముగ నాశ్రయించు ఆంధ్రదేశ వైద్యుల కిది యెంతయు నుపయోగకరమైన గ్రంథము. మంచిగ్లేజు కాగితములమీద డెమ్మీసైజున ముద్రింపబడియున్నది. 100 పుటలు. వెల రూ. 1-0-0

దొరకుచోటు

ఆంధ్రభూమి బుక్కుడిపో, వేపేరి, మదరాసు.

## ౧౨౩. శ్రీనిజామాంధ్రీయ శ్రీధాతృసంవత్సర పంచాంగమ్

నిజామురాష్ట్రాంధ్రుల కొఱకు ప్రత్యేకముగా గుణింపబడిన ఈ పంచాంగమును అందుకొనుటకు మేమెంతయు ఆనందితులమగుచున్నాము. శంకరంపేటయందలి జ్యోతిర్విద్యాలయాధ్యక్షులగు శ్రీ బి. వెంకటరాజేశ్వరశర్మగారు దీనికర్తలు. శ్రీధాతృ సంవత్సర ఫలితాంశములు వివరముగా వ్రాయబడినవి. పంచాంగము కడపట గోచారరీత్యా ద్వాదశ రాశులకు గలుగగల ఫలములు వివరింపబడినవి నిజామురాష్ట్రాంధ్రసోదరులీపంచాంగము వలని పరమ ప్రయోజనమును బడయుదురుగాక యని కోరెదము. వలయువారు కర్తగారికి రెండుఅణాల తపాల బిళ్ళలు పంపిన పంచాంగపు ప్రతిని బడయగలరు.

## ౧౨౪. ధ్రువ

నవ్వులతీవ సంపాదకులగు శ్రీ కొంచనపల్లి వెంకటరంగారావుగారిచే రచియింపబడిన చిన్న నాటకము. ధ్రువుడు బాలవీరుడు. ఆబాలవీరుని కథ ప్రత్యేకము బాలురకొఱకు దృశ్యప్రబంధముగా రచియించి ఆంధ్రబాలవాఙ్మయమును పెంపొందించిన వెంకటరంగారావుగారిని అభినందించుచున్నాము. పాఠశాలాధికారులు బాలుర జీవితమున కుత్తేజము కల్గించు విషయములతో కూడిన ఇట్టి గ్రంథములను ప్రోత్సహించుట వాంఛనీయము. పాత్రలు ఎక్కువమందిలేరు. కావున బడుల్లలో ఆడబడుటకీ చిన్న నాటిక ఎంతయు తగియున్నది. చిన్న సైజున 40 పుటలు. వెల ఒక అణా. వలయువారు గ్రంథకర్త పేర బరంపురము వ్రాయునది.

## ౧౨౫. మహారోగము

ప్రకృతి గ్రంథమాలలో ఇరువదియారవ గ్రంథము. కర్త రామరాజయోగీంద్రులు. ఇది విజ్ఞానదాయకమగు నొక యపూర్వగ్రంథము. లోకమునందితర జీవరాసులకులేని పలురోగము లీ మానవజాతి నెందు కాశ్రయించెనో ఈ గ్రంథమున ప్రస్తరింపబడినది. ఆరోగ్యము మహాభాగ్యమను సత్యమును విస్తరించు ఈ పుస్తకమునందలి 31, 32 పుటలు ప్రత్యేకము పఠింపదగినవి. రోగము కలుగుటకు మనస్సే కారణమను ఈగ్రంథమునందలి 52-వ పుటల్లోని వాక్యములు ఎల్లప్పుడు జ్ఞప్తియందుంచుకొనదగినవి. ఇందలి మిథ్యాహారవిహారాదుల నిరసన మెంతయు మెచ్చదగినది. క్రౌనుసైజున 55 పుటలు. వెల నాలుగు అణాలు. ప్రకాశకులు ప్రకృతికార్యాలయము, బెజవాడ.

### ౧౨౯. మారకపు రేటు

గ్రంథకర్త, తమ్మిరాజు [redacted]రాయణరావు గారు, బి.ఏ. (ఆనర్సు). ప్రజా సేవా గ్రంథమాలలో మొదటి గ్రంథము. ఇది డెమ్మీ సైజున 13 పుటల చిన్న గ్రంథమే అయినను విషయగౌరవముకలది. నాలుగు అధ్యాయములు. మొదటి అధ్యాయమున మారకపు రేటు అనిన నేమియో తెలుపబడినది. రెండవ అధ్యాయమున హిందూదేశపు రూపాయి బ్రిటీష్ పౌనుకు 18 పెన్నీలవిలువకు ముడిపెట్టబడిన తీరు వ్రాయబడినది. మూడవ అధ్యాయమున ఈ రేష్యో ముడి 1929 తరువాత ఎట్లుండినదో వివరింపబడినది. నాలగవ అధ్యాయమున 18 పెన్నీల సంబంధము వలని లాభనష్టములు వర్ణింపబడినవి. ఆంగ్లవిద్యాధికులగు రావుగారు తమవిజ్ఞానము నిట్లు దేశీయులకు ఇట్టి గ్రంథములద్వారా పంచియిచ్చుటకు దొరకొనినది ప్రశంసనీయమగువిషయము. ఆంధ్రులు వారికి ప్రోత్సాహమిత్తురుగాక! వెల అరణా. కార్యస్థానము, అనకాపల్లి.

### ౧౨౨. శ్రీ వెంకటాచలక్షేత్రము

భారతదేశమునందలి వివిధప్రాంతములనుండి తైర్థికుల నాకర్షించు తెనుగుక్షేత్రములలో తిరుపతి తొలుత, పేర్కొనదగినది. ఆ వెంకటాచలక్షేత్రమునకు కలియుగవైకుంఠమను ప్రసిద్ధిగలదు. తిరుపతియాత్ర చేయువారికి సకలసౌకర్యములు కల్గించుటకు ప్రభుత్వమువారొకకమిటీని ఏర్పాటు చేసియున్నారు. యాత్రికుల సౌకర్యమునకై ఆకమిటీవారొకకరపత్రమును ప్రచరించియున్నారు. అది విమర్శనార్థము మా కార్యాలయమున కంపబడినది. తిరుపతి యాత్రచేయ దలచినవారు ముందుగా ఈగ్రంథమును పొంది పఠించి ఇందలి మెలుకువల ప్రకారము నడుచుకొనుచో యాత్ర సుకరమగును. దేవస్థానమునకు ఆంధ్రమహాశయులగు శ్రీ. సీతారామరెడ్డిగారు కమీషనరు. గ్రంథములకు వారికి వ్రాసినచో నుచితముగా బడయవచ్చును.




మీ కేడిజైను కావలసినా, కలరుపోస్టర్లు, లైనుడ్రాయింగులు, ఆఫ్‌టోను చిత్రములు, కేలండరు చిత్రములు, బ్లాకులు తక్కువధరలకు టైముకు అందచేయబడును. వివరములకు. ది మద్రాసు పిక్చర్సు, 39 అరసప్ప మొదలివీధి, వేపేరి, మదరాసు.

Printed at The Andhrabhumi Printing works, Vepery, Madras.
Editor & Publisher: Andra Seshagiri Rao. B A

# సువర్ణసుందరరసము
## సర్వసవామేహములకు
## సంజీవివంటిది

ఎటువంటి సవామేహములనైన కుదుర్చును. ఇంజక్షనులు అవసరములేదు. అనేకులు వాడి మెచ్చి యున్నారు. 60 ఏండ్లు వైద్యమున అనుభవముగల కీ. శే. వేటూరి సుందరశాస్త్రి గారిచే కనిపెట్టబడినది. వాడువిధము మందుతో పంపబడును.

వెల : 50 మాత్రలు: రు. 5-0-0.

# ఆర్షరసాయనశాల, ముక్త్యాల

## ఆభ్రకభస్మము.

—: అమృతమువంటిది :—

బహుమూత్రమును, క్షయను, దగ్గును పోగొట్టి వీర్యవృద్ధిని గలిగించును. మూత్రమునందుండు చక్కెరను మాయముచేయును. ప్రశస్తమైన రసాయనము. వెల· తులము 1-కి: రు. 5-0-0.

కన్సల్టింగు ఫిజీషియన్:—

ఆయుర్వేదభూషణ వేటూరి శంకర శాస్త్రి గారు, ఎ.ఎం.ఎ.సి.

[టెలిగ్రాము: లీవర్ క్యూరు] [టెలిఫోను నెం. 8139]

ఈ ట్రేడుమార్కును గుర్తింపుడు



# డాక్టరు జమ్మి వేంకటరమణయ్యగారి ప్రసిద్ధిచెందిన లీవర్ అండ్ స్ప్లీన్ స్పెసిఫిక్.

అగ్రగణ్యము!

అసమానము!

'చికిత్సావిధానమున ఒక క్రొత్త యుగము.'

'మృత్యుముఖమునుండి వేలకొలది శిశువులరక్షించినది'

'రోగనిరోధమునకు కూడ సాటిలేనిమందు'

## పిల్లలకు

కడుపుబ్బ, బల్ల, గడ్డ మొదలగు లివర్ అండు స్ప్లీను వ్యాధులకు లోకప్రఖ్యాతి చెందిన డాక్టరు జమ్మి వేంకటరమణయ్యగారి ఔషధమును ఉపయోగింపుడు. శిశువులకు ఆకలి, జీర్ణశక్తులను వృద్ధిపరచు, మలబద్ధము లేకుండా విరేచనము సరిగా అవుటకును, రక్తము శుద్ధియగుటకును సాటిలేని ఔషధరాజము.

## హూక్రో

శిశువులను కోరింత దగ్గు నుండి రక్షించు దివ్యౌషధము.

హెడ్ ఆఫీసు: 8, శాలైవీధి, మైలాపూర్, మదరాసు.

బ్రాంచి ఆఫీసు: 125, హారిసన్ రోడ్డు, కలకత్తా.



**If your Children suffer from LIVER & SPLEEN COMPLAINTS start giving them to-day**

**JAMMI VENKATARAMANAYYA'S FAMOUS LIVER & SPLEEN SPECIFICS**

8, SALAI STREET, MYLAPORE, MADRAS.